# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 4 - సంచిక 6 | మార్చి 2026 | వెల : రూ.15

ఉన్మాదుల యుద్ధానికి ఎదురుదెబ్బ

మన సార్వభౌమాధికారానికే సవాలు

అణుయుద్ధం అంచున ప్రపంచం

యుద్ధం ఇస్తున్న అతిచక్కని అవకాశం!

విదేశాంగ నీతిలో తప్పటడుగులు..

దేశం కోసం ధర్మం కోసమా ట్రంప్‌నకు గులాంగిరి ?

అంతు లేని అమెరికా అమానుషాలు

మోదీ జీ.. 'జాతీయ అవమానం' అంటే ఏమిటో మీకు వివరిస్తా

పెట్రో ఉత్పత్తుల కొరత  రిలయన్స్ కథా కమామీసు

పలస్తీనాలో యూదులు !

కార్పొరేట్ సంపదలో  సామాన్యులకు భాగస్వామ్యం

సన్నగిల్లుతున్న సామాజిక న్యాయం

ప్రజాస్వామ్యం-సామాజిక న్యాయం

ఎప్‌స్టీన్ ఫైల్స్ .. వ్యవస్థల పతన గాథ

కారల్ మార్క్స్ :  ఒక చారిత్రక ప్రవాహం

చరిత్రకారుడి 'ఆసక్తికర సమయాలు'

పణిక్కర్‌తో నా ప్రయాణం - కె.ఎన్. పణిక్కర్: ఒక మేధో మార్గదర్శి

రాష్ట్రంలో భావజాల విధ్వంసం!?

మార్చి - 2026 పేజీలు : 41

# దారి దీపం

## మాసపత్రిక

సంపుటి : 4 - సంచిక : 6


డి.వి.వి.యస్.వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1. ఉన్మాదుల యుద్ధానికి ఎదురుదెబ్బ : సంపాదకీయం 3
2. మన సార్వభౌమాధికారానికే సవాలు - ప్రభాత్ పట్నాయక్ 4
3. అణుయుద్ధం అంచున ప్రపంచం.. చైనా, రష్యాల జోక్యమే ప్రపంచ శాంతికి శరణ్యం - బిబి ప్రేమ్ శంకర్ ఝూ 6
4. యుద్ధం ఇస్తున్న అతిచక్కని అవకాశం! - రాహుల్‌కుమార్ 9
5. విదేశాంగ నీతిలో తప్పటడుగులు.. - సి.రామచంద్రయ్య 11
6. దేశం కోసం ధర్మం కోసమా ట్రంప్‌నకు గులాంగిరి ? - దేవరాజు మహారాజు 13
7. అంతు లేని అమెరికా అమానుషాలు - డాక్టర్ పి.మిత్ర 15
8. ప్రధానమంత్రి మోదీ, “జాతీయ అవమానం” అంటే ఏమిటో మీకు, మీ పార్టీకి వివరిస్తాను - రాజ్‌దీప్ సర్ దేశాయ్ 16
9. పెట్రో ఉత్పత్తుల కొరత రిలయన్స్ కథా కమామీసు - జి.భార్గవ 17
10. పలస్తీనాలో యూదులు ! - మహాత్మా గాంధీ 18
11. కార్పొరేట్ సంపదలో సామాన్యులకు భాగస్వామ్యం - వెంకటరామారావు 20
12. సన్నగిల్లుతున్న సామాజిక న్యాయం - దడాల సుబ్బారావు 22
13. ప్రజాస్వామ్యం-సామాజిక న్యాయం - లలితానంద ప్రసాద్ 24
14. ఎప్‌స్టీన్ ఫైల్స్ .. వ్యవస్థల పతన గాథ - కృష్ణ కానూరి 26
15. కారల్ మార్క్స్ : ఒక చారిత్రక ప్రవాహం - రమేశ్ రాంపల్లి 29
16. చరిత్రకారుడి ‘ఆసక్తికర సమయాలు’ - డా.జె.రవీంద్రనాథ్ 31
17. పణిక్కర్‌తో నా ప్రయాణం - వకుళాభరణం రామకృష్ణ 33
18. కె.ఎన్. పణిక్కర్: ఒక మేధో మార్గదర్శి - ప్రొ॥ అర్చనా ప్రసాద్ 34
19. రాష్ట్రంలో భావజాల విధ్వంసం!? - సంగిరెడ్డి హనుమంత రెడ్డి 36
20. శ్రీ కలిదిండి భీమరాజు జయంతి సభ చర్చా గోష్ఠి 37




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM

దారి దీపం
మాసపత్రిక
మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495



# ఉన్మాదుల యుద్ధానికి ఎదురుదెబ్బ

అమెరికా, ఇజ్రాయెల్‌లు ఇప్పుడు ఇరాన్ మీద సాగిస్తున్నది స్వీయ రక్షణ కోసం సాగిస్తున్న యుద్ధం కాదు. ఇది ఇద్దరు ఉన్మాదులు సాగిస్తున్న యుద్ధం. ట్రంప్ తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలన్నాడు. ప్రపంచంలో ఎక్కడ సంఘర్షణ జరుగుతున్నా తానే మధ్యవర్తిగా దిగి శాంతిని నెలకొల్పుతున్నానని ప్రకటించాడు. భారత్–పాక్ యుద్ధ విరమణ తానే చేయించానని మోదీకన్నా ముందు ఆయనే ప్రకటించాడు. అంతమాత్రాన ట్రంప్ శాంతి దూత కాదు. నిఖార్సయిన యుద్ధోన్మాది. “అమెరికా ఫస్ట్ ” అంటాడు. ప్రపంచం అంతా తన చెప్పు చేతల్లో వుండాలంటాడు. ఉండకపోతే ఊరుకోనంటాడు. వెనిజువెలాలో ఎన్నికైన దేశాధ్యక్షుడిని బందీగా దాడి చేసి తెచ్చాడు. దాని ఆయిల్ నిక్షేపాల మీద ఆధిపత్యం సంపాదించాడు. గ్రీన్‌లాండ్ తనకు కావాలంటాడు. క్యూబాను కబళిస్తానంటాడు. మెక్సికో అమెరికాలో అంతర్భాగం అంటాడు. ఇదీ ట్రంప్ యుద్ధోన్మాదం. ప్రపచం దేశాల సార్వభౌమాధికారం మీద దాడి చేసే ఉన్మాదం. ఆ దేశాల సహజ వనరులను కాజేసే పన్నాగం. అంగబలం, ఆర్థిక బలం వుందన్న గర్వంతో చేస్తున్న ప్రేలాపనల ఉన్మాదం. ఇందులో భాగంగానే అమెరికా, ఇజ్రాయెల్‌లు ఇరాన్‌పై యుద్ధం మొదలు పెట్టాయి.

యుద్ధం మొదటి రోజునే దేశాధ్యక్షుడైన ఖమైనీని హతమార్చారు. ఇరాన్ పని అయిపోయిందని అక్కడ త్వరలో తమకు అనుకూలమైన ప్రభుత్వం ఏర్పాటు చేస్తానని ట్రంప్ ప్రగల్భాలు పలికాడు. గల్ఫ్ దేశాల నుంచి అమెరికాకు ప్రమాదం లేదు. కాని, అమెరికాకు గల్ఫ్ దేశాలు కావాలి. అక్కడి ఆయిల్ నిక్షేపాలు కావాలి. లొంగి వుండే జీ హుజూర్ ప్రభుత్వాలు కావాలి. దీని కోసం గల్ఫ్ దేశాలైన ఖతార్, బహ్రెన్, కువైట్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్, ఇరాక్‌లలో అమెరికా సైనిక స్థావరాలు ఏర్పాటు చేశారు. అక్కడ మొత్తం మీద అనేక జెట్ విమానాలు, భారీ యుద్ధ నౌకలు, 40 వేల వరకు సైనికుల నిరంతర నిఘాలో ఆ దేశాలు వున్నాయి. ఇప్పుడు ఇరాన్ ఈ అమెరికా స్థావరాలను భస్మీపటలం చేస్తున్నది. ఈ దేశాల ఆయిల్ నిక్షేపాలను అగ్నికి ఆహుతి చేస్తున్నది. అమెరికా రక్షణ పాటవం తమ స్థావరాలనే కాపాడుకోలేని స్థితిలో పడింది. ఇరాన్ దాడులతో ఇజ్రాయెల్ బుగ్గిపాలైంది. తన అధీనంలోని అంతర్జాతీయ రవాణా మార్గమైన హార్మోజ్‌ను మూసివేయడంతో ప్రపంచ వ్యాప్తంగా సంక్షోభానికి తెరతీసింది. ఇరాన్ ప్రతిఘటనతో ప్రపంచం ఆయిల్ సంక్షోభంలో పడింది. ఇప్పుడు ట్రంప్ శాంతి ప్రవచనాలు పలుకుతున్నాడు. యుద్ధ విరమణకు చర్చలంటున్నాడు.

ఈ యుద్ధంలో మోదీ విదేశాంగ రాజనీతి పరాభవంపాలైంది. చిరకాలంగా వున్న ఇరాన్ మిత్రత్వాన్ని పక్కనబెట్టి ఇజ్రాయెల్‌ను పితృదేశంగా మోదీ ప్రకటించి అపహాస్యం పాలయ్యారు. అమెరికా చెప్పు చేతలలో ఆయన రాజనీతి తలదాచుకుంటున్నది. రష్యా నుంచి 30 రోజులపాటు ఆయిల్ కొనుగోలుకు అనుమతి ఇస్తూ ట్రంప్ చేసిన ప్రకటన భారత సార్వభౌమాధికారానికి గొడ్డలి పెట్టు. ఇరాన్ అధ్యక్షుణ్ణి దాడిచేసి చంపినా ఖండించలేని దుస్థితిలో మోదీ పడ్డారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో పేరు వుండడం, అదానీ కేసులు వల్ల ఈ లొంగుబాటు అని సామాజిక మాధ్యమాలు చేస్తున్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇది భారత విదేశాంగ విధానంలో చెరగనిమచ్చ. మొత్తం మీద అమెరికా, ఇజ్రాయిల్ ఉన్మాదుల యుద్ధానికి ఇరాన్ గొప్ప గుణపాఠం నేర్పింది. ❑

**- డి.వి.వి.యస్.వర్మ, సంపాదకులు, 85006 78977**

# మన సార్వభౌమాధికారానికే సవాలు



- ప్రభాత్ పట్నాయక్

అంతర్జాతీయ న్యాయ సూత్రాలనన్నింటినీ అడ్డగోలుగా ఉల్లంఘిస్తూ సామ్రాజ్యవాదం నేడు మూడవ ప్రపంచ దేశాల సార్వభౌమాధికారాన్నే రద్దు చేసేంత దాకా పోతోంది. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్ మీద బాంబు దాడికి దిగడం దీనినే సూచిస్తోంది. ఇరాన్‌లో అధికారంలో ఉన్న వారిని గద్దె దించి తమకు నచ్చిన వారిని ఆ స్థానంలో కూర్చోపెట్టడమే లక్ష్యం అని ట్రంప్ బహిరంగంగానే ప్రకటించాడు ! తమకు ఇబ్బందికరంగా తయారైన ప్రభుత్వాలను కూల్చడానికి కుట్రలు పన్నడం సామ్రాజ్యవాదులకు కొత్తేమీ కాదు. కాకపోతే అటువంటి దేశాలలో సైనికపరంగా జోక్యం చేసుకోవడానికి ఇంత వరకూ వేరే ఏవో సాకులను చూపేవారు. ప్రజాబాహుళ్యాన్ని అంతం చేయగల భయంకర మారణాయుధాలను ఆ దేశం తయారు చేసిందనో, మాదకద్రవ్యాల రవాణా ఆ దేశ ప్రభుత్వమే చేపట్టిందనో – ఇలా సాకులను చూపేవారు. ఇప్పుడు ఇరాన్ మీద దాడికి తెగబడ్డప్పుడు అటువంటి సాకులు చూపే ప్రయత్నం కూడా చెయ్యలేదు. నిజానికి ఇరాన్‌తో ఉన్న వివాదం ఆ దేశం అణ్వాయుధాల తయారీ సామర్ధ్యాన్ని పెంపొందించుకుంటోందన్న ఆరోపణ చుట్టూ నడుస్తోంది. ఆ విషయమై ఒకపక్క చర్చలు కొనసాగుతూనే వున్నాయి. ఆ చర్చల్లో కొంత పురోగతి సాధించారు. అయినప్పటికీ అవేమీ ఖాతరు చేయకుండా అమెరికా దాడికి దిగింది. వలస పాలనా కాలం అంతమయ్యాక ఒక మూడవ ప్రపంచ దేశపు ప్రభుత్వాన్ని తన ఇష్టం వచ్చిన రీతిలో గద్దె దించివేసే అధికారాన్ని బాహాటంగా తనకు తాను అమెరికా ఆపాదించుకోవడం ఇదే మొదటిసారి.

ఇరాన్‌లోని ఇస్లామిక్ ప్రభుత్వానికి ప్రజా బాహుళ్యపు మద్దతు ఉందా లేదా అన్న విషయం కాని, అది ప్రజలను అణగదొక్కుతున్న ప్రభుత్వమా అన్నది కాని, అక్కడ వాక్ స్వాతంత్ర్యం ఉందా లేదా అన్నది కాని, ఆ ప్రభుత్వం ప్రతిపక్షాన్ని సహిస్తుందా లేదా అన్నది కాని ఇక్కడ ప్రధానాంశం కాదు. తమను ఈ ప్రభుత్వం పరిపాలించాలా వద్దా అన్న విషయాన్ని తేల్చుకునే హక్కు, అవసరమైతే ప్రభుత్వాన్ని మార్చుకునే హక్కు ఇరాన్ దేశ ప్రజానీకానికి మాత్రమే ఉందన్నది ఇక్కడ ప్రధానాంశం. మరొక దేశపు అంతర్గత వ్యవహారాల్లోకి బలప్రయోగం ద్వారా జోక్యం చేసుకునే హక్కు గాని, పెత్తనం గాని అమెరికన్ సామ్రాజ్యవాదానికి లేదు. ఒక దేశానికి సార్వభౌమాధికారం ఉండడం అంటేనే ఆ దేశ వ్యవహారాలను నిర్ణయించుకునే సంపూర్ణ హక్కు ఆ దేశ ప్రజానీకానికి మాత్రమే ఉండడం. రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో మూడవ ప్రపంచ దేశాలన్నింటిలోనూ వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల పర్యవసానంగా అవన్నీ సార్వభౌమాధికారాన్ని సాధించుకున్నాయి. ఇన్నాళ్లూ సామ్రాజ్యవాదం మూడవ ప్రపంచ దేశాల సార్వభౌమాధికారాన్ని దెబ్బ తీయడానికి దొడ్డిదారిన అనేక ప్రయత్నాలు సాగిస్తూ వచ్చింది. ఇప్పుడు బహిరంగంగానే సైనిక బలప్రయోగంతో దెబ్బ తీయడానికి సిద్ధమైంది. ఇది దేశాల సార్వభౌమాధికారం మీద ప్రత్యక్ష దాడి. చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి తెర లేచింది. స్వాతంత్ర్య పోరాటాలు సాధించిన విజయాలను తిరగ దోడి మూడవ ప్రపంచ దేశాలను మళ్లీ తమ ఆధీనంలోకి తెచ్చుకోడానికి జరుగుతున్న ప్రయత్నం ఇది.

ఇటువంటి దాడికి దిగడానికి సామ్రాజ్యవాదానికి అంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది ? ఇప్పుడు నెలకొన్న పరిస్థితుల్లో ఈ విధంగా దాడి చేయాల్సిన అవసరం సామ్రాజ్యవాదానికి ఏమొచ్చింది ? మొదటి ప్రశ్నకు సమాధానం సూటిగానే లభిస్తుంది. సోవియట్ యూనియన్ పతనం అనంతరం ప్రచ్ఛన్న యుద్ధ దశ ముగిసిపోవడంతో సామ్రాజ్యవాదాన్ని నిరోధించగల పరిస్థితులు లేవు. ఉదాహరణకు క్యూబా విషయమే తీసుకోండి. అక్కడ కూడా ప్రభుత్వం మార్పు జరగాల్సిందేనంటూ అమెరికా మాట్లాడుతోంది. 1962లో తలెత్తిన క్యూబన్ మిస్సైల్ సంక్షోభం వంటి సందర్భంలో బలాబలాల పరిస్థితికి నేటి పరిస్థితికి తేడా ఎంత కొట్టవచ్చినట్టు కనిపిస్తోందో చూడండి. అప్పుడు క్యూబాను అమెరికన్ యుద్ధ నౌకలు చుట్టు ముట్టినప్పుడు సోవియట్ యూనియన్ తన యుద్ధ నౌకలను పంపి అమెరికన్ నౌకలను పేల్చివేసైనా సరే ఆ దిగ్బంధనాన్ని చెదరగొట్టమని ఆదేశించింది. ఆ క్రమంలో అణుయుద్ధంగా ఆ ఘర్షణ పరిణమించే ప్రమాదం ఏర్పడింది. ఆ పరిస్థితిలో అమెరికా వెనక్కి తగ్గక తప్పలేదు. ఆ తర్వాత కాలంలో మరే దేశం విషయంలోనూ అమెరికా అటువంటి ప్రయత్నాన్ని తలపెట్టడానికి సాహసించలేదు.

ఇక రెండవ ప్రశ్నకు వద్దాం. ప్రస్తుతం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్న సంక్షోభ పరిస్థితిలో రెండు అంశాలు ఉన్నాయి. **మొదటిది :** సంపన్న పెట్టుబడిదారీ దేశాల జాతీయాదాయాలలో

అక్కడి కార్మికుల వాటా తీవ్రంగా తగ్గిపోయింది. అదే విధంగా మూడవ ప్రపంచ దేశాల జాతీయాదాయాలలో అక్కడి శ్రామిక ప్రజానీకపు వాటా కూడా దారుణంగా తగ్గిపోయింది. మిగులు సంపద శ్రామిక ప్రజల వద్ద చేరితే దానినంతటినీ వినియోగిస్తారు. అదే సంపద ఒకదగ్గర కేంద్రీకరణ జరిగితే అందులో వినిమయానికి నోచుకునేది చాలా స్వల్పం. అందువల్ల స్థూల డిమాండ్‌తో పోల్చినప్పుడు మార్కెట్‌లోకి వచ్చే ఉత్పత్తి ఎక్కువగా ఉండి అధికోత్పత్తి సంక్షోభం తలెత్తుతుంది. దీని పర్యవసానంగా నిరుద్యోగం పెరుగుతుంది (నిరుద్యోగం పెరుగుతోందన్న విషయాన్ని కప్పి పుచ్చడానికి అమెరికాలో పదాలు మార్చి కార్మికులు ఉత్పత్తిలో భాగస్వాములు అయ్యే రేటు తగ్గుతోందని అంటున్నారు). ఇందువలన శ్రామిక ప్రజలు మరింత దరిద్రంలోకి నెట్టబడతారు.

**ప్రస్తుత సంక్షోభానికి దారి తీసిన రెండవ అంశం :** మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు రోజుల్లో తమ తమ వలస దేశాల నుండి మిగులు సంపదను కాజేయడం ద్వారా గాని, ఆ దేశాల్లో పరిశ్రమలను నాశనం చేయడం ద్వారా కాని వలస పాలకులు తమ విదేశీ చెల్లింపుల లోటును భర్తీ చేసుకునే వీలు ఉండేది. సామ్రాజ్యవాద శిబిరానికి నాయకస్థానంలో ఉండే దేశం ఎప్పుడైనా తక్కిన దేశాలతో వాణిజ్య చెల్లింపులలో లోటును కలిగి వుంటుంది (ఆ దేశాల నుండి దిగుమతులను తన మార్కెట్‌లోకి అనుమతిస్తుంది. తద్వారా ఆ దేశాల సహకారాన్ని పొందుతుంది). ఇప్పుడు అమెరికాకు కూడా అటువంటి లోటు ఉంది. దానికితోడు ప్రపంచం మీద తన పెత్తనాన్ని చెలాయించడం కోసం అమెరికా దాదాపు 80 దేశాలలో 750కి పైగా సైనిక స్థావరాలను నెలకొల్పింది. దీనికయ్యే ఖర్చు కూడా అమెరికా లోటు పెరగడానికి తోడైంది.

మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వపు రోజుల్లో సామ్రాజ్యవాద శిబిరానికి నాయకుడు బ్రిటన్. ఆ దేశానికి ఉండిన లోటును భర్తీ చేసుకోడానికి బ్రిటన్ భారతదేశంతో సహా తన వలస దేశాల నుండి మిగులును తరలించుకుపోయింది. ఇప్పుడు నాయకుడి స్థానంలో ఉన్న అమెరికాకు వలసలు అంటూ ఏమీ లేవు. అందుచేత తన లోటును భర్తీ చేసుకోడానికి డాలర్లను అదనంగా ముద్రించడం మినహా దానికి వేరే దారి లేదు. ఇలా అదనంగా ముద్రించిన డాలర్లతోను, డాలర్ల రూపంలో ఉన్న ఆస్తులతోను (షేర్లు, స్టాక్‌లు, బాండ్లు వగైరా) ప్రపంచం నిండిపోయింది. అదంతా అమెరికా ప్రపంచానికి చెల్లించవలసిన అప్పే. డాలర్ కరెన్సీ బలం మీదనే ఇప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడ ఆధారపడి వుంది. ఆ డాలర్ బలం ప్రశ్నార్థకంగా మారుతోంది.

ప్రపంచం అంతా డాలర్‌నే ఉపయోగిస్తున్నారు గనుక ఇప్పట్లో డాలర్‌కు వచ్చే ముప్పు ఏమీ లేదని చాలామంది చెప్తున్నారు. కాని అది పొరపాటు. వేరే ఏదో కరెన్సీ నుండి డాలర్‌కు ఇప్పట్లో ముప్పు లేకపోవచ్చు. కాని వివిధ దేశాల మధ్య వాణిజ్యం డాలర్ మాధ్యమం ద్వారా మాత్రమే సాగాలన్న నియమం ఏదీ లేదు. సరుకులకు బదులు వేరే సరుకులను మారకం వేసుకునే అవకాశం ఎప్పుడూ ఉంది. అదే జరిగితే పెట్టుబడిదారీ ప్రపంచంలో అది భారీ స్థాయిలో ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. 1970 దశకంలో ఇదే జరిగింది. ఆ నేపథ్యంలోనే థాచరిజం, రీగనామిక్స్ తెర మీదకి వచ్చాయి. ఆ విధానాలు ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి తమ తమ దేశాల్లో భారీస్థాయి నిరుద్యోగాన్ని కలిగించాయి. అప్పటి వరకూ యుద్ధానంతర కాలం అంతా వృద్ధి కొనసాగిన దశ. కార్మికులు దాని వలన ప్రయోజనాలు పొందిన దశ. ఇప్పుడు గనుక అదే పునరావృతం అయితే (అంటే థాచరిజం, రీగనామిక్స్ మళ్లీ అమలైతే), ఇప్పటికే దారిద్ర్యంలోకి కూరుకుపోతున్న కార్మికుల పాలిట గుదిబండగా మారి సామాజిక అస్థిరతకు దారి తీయకమానదు.

అటువంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా నివారించడానికి సామ్రాజ్యవాదం రెండు విధాలుగా ప్రయత్నిస్తోంది. **మొదటిది:** అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం మాదిరిగా నయా ఫాసిస్టు ప్రభుత్వాలను వీలైన చోటల్లా ఏర్పరచడం. **రెండవది:** తమకు విశ్వాసపాత్రంగా వ్యవహరించే ప్రభుత్వాలను మూడవ ప్రపంచ దేశాల్లో ఏర్పాటు చేసి వాటి ద్వారా పాత, వలస పాలనా కాలపు ఆధిపత్యాన్ని ప్రపంచం మొత్తం మీద మళ్లీ చెలాయించడం. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను దొంగచాటుగా ఎత్తుకుపోవడం, ఇరాన్ మీద దాడికి దిగడం (అక్కడ పాత నియంత పెహ్లవీ షా వారసుడు అమెరికా దయతో గద్దెనెక్కడానికి తహతహలాడుతున్నాడు.). మళ్లీ వలసాధిపత్యాన్ని సాధించడానికి జరుగుతున్న ప్రయత్నాలకు ఉదాహరణలు. వెనిజులా గాని, ఇరాన్ గాని రెండూ చమురు నిక్షేపాలు సమృద్ధిగా ఉన్న దేశాలు. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద చమురు నిక్షేపాలు వెనిజులాలో ఉన్నాయి. వాటిని గనుక అమెరికన్ కంపెనీలు చేజిక్కించుకోగలిగితే, అక్కడి నుండి మిగులును అమెరికా కొల్లగొట్టగలుగుతుంది. తద్వారా తన లోటు సమస్యను పూడ్చుకోగలుగుతుంది.

ఇలా మళ్లీ వలస పాలన దిశగా మరలడం అనేది కేవలం మిగులును కొల్లగొట్టడానికే పరిమితం కాదు. ఇండో-అమెరికన్ వాణిజ్య ఒప్పందం వంటి 'అసమాన ఒప్పందాల'ను రుద్దడం ద్వారా అమెరికన్ సరుకులకు కొత్త మార్కెట్‌లు కల్పించడం ఇందులో భాగమే. గతంలో బ్రిటన్ వలస పాలన కాలంలో ఇదే చేసింది. ఇటువంటి చర్యలతో తన సంక్షోభాన్ని సామ్రాజ్యవాదం అధిగమించగలుగుతుందా లేక విఫలమౌతుందా అన్నది ఇక్కడ చర్చనీయాంశం కాదు. మళ్లీ వలస పాలన పరిస్థితులను తీసుకురాగలిగితే తమ సమస్య పరిష్కారం అవుతుందని

**(మిగతా 12వ పేజీలో)**

# అణుయుద్ధం అంచున ప్రపంచం..
# చైనా, రష్యాల జోక్యమే ప్రపంచ శాంతికి శరణ్యం



- బిబి ప్రేమ్ శంకర్ ఝా

ఎన్నడూ లేనంతగా ఇజ్రాయెల్ సైనిక సామర్థ్యం తీవ్ర ఒత్తిడికి లోనవుతోంది. ఇరాన్‌పై జరుపుతున్న యుద్ధం ఇదే తరహాలో జరిగితే విజయం ఇజ్రాయెల్‌కు కనుచూపు మేరలో కనిపించడం లేదు. దీంతో అణ్వస్త్ర ప్రయోగంతోనైనా ఇరాన్‌పై విజయం సాధించాలని ఇజ్రాయెల్ ఆలోచిస్తోంది. చైనా-రష్యాలు జోక్యం చేసుకోకపోతే, ప్రపంచం అణు మారణ హోమానికి చేరువయ్యే ప్రమాదం ఉంది. మార్చి 8న ఉదయం ఇజ్రాయెల్-అమెరికాలు ఇరాన్‌పై ప్రారంభమైన యుద్ధం ప్రమాదకరమైన కొత్త మలుపు తీసుకుంటోంది.

దేశ రాజధాని టెహ్రాన్ చుట్టూ ఉన్న ఇరాన్ చమురు శుద్ధి కేంద్రాలు, అణుబంధ పరిశ్రమలపైనా; టెహ్రాన్‌కు పొరుగున ఉన్న కరాజ్ నగరంపైనా అమెరికా బాంబు దాడులకు దిగడంతో ఈ ప్రాంతంలో కాలుష్యం విషమ స్థితికి చేరింది. ఈ మాస్కులు ధరించాలని, ఆహారాన్ని ఫ్రిజ్‌లలో భద్రపరుచుకోవాలని, అవసరమైన సరఫరాకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలని (ఫిల్టర్లు మార్చుకోవాలని) ఇరాన్ ప్రభుత్వం ప్రజలను కోరింది. అనంతరం, గల్ఫ్ ప్రాంతంలోని అరబ్ దేశాలలో ఉన్న చమురు నిల్వలు, శుద్ధి కర్మాగారాలవంటి వాటిపై నాలుగు గంటల్లో దాడి చేయనున్నట్టు ఇరాన్ ప్రకటించింది. ఇజ్రాయెల్‌కు చమురు సరఫరా చేసే హైఫా బే ప్రాంతంపై ఇరాన్ భారీ ఎత్తున దాడి చేసింది.

## ఇజ్రాయెల్ వెన్నుముక మీద ఇరాన్ దాడి..

ఇజ్రాయెల్ ఆర్థిక వ్యవస్థకు, సైనిక సామర్థ్యానికి హైఫా బే (హైఫా జలసంధి) వెన్నుముక. ఈ మార్గంలో దేశానికి వచ్చే చమురు నిల్వల ద్వారా ఇజ్రాయెల్ చమురు అవసరాలలో సగానికి సగం తీరుతాయి. ఇజ్రాయెల్ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా ఉన్న హైఫా బే ఇరాన్ భీకర దాడికి పాల్పడింది. దీంతో ఇజ్రాయెల్-అమెరికాలు ఇరాన్‌పై ప్రారంభమైన యుద్ధం చెదురుమదురు దాడుల దశ దాటి పూర్తి స్థాయి యుద్ధం దశకు చేరింది. పరిస్థితి విషమించి, ఈ యుద్ధం మరో మలుపు తిరిగి అణుయుద్ధంగా మారితే మిగిలేది ప్రపంచ వినాశనమే. నాకు ఈ ఆందోళన కలగడానికి రెండు కారణాలు : పన్నెండు రోజుల యుద్ధం కంటే ముందు, ఇజ్రాయెల్ సైన్యానికి ఇప్పుడు జరిగినంత నష్టం ఎన్నడూ జరగలేదు. “ఇనుప కవచం”గా పిలవబడే ఇజ్రాయెల్ వద్ద ఉన్న క్షిపణి విధ్వంసక పరిజ్ఞానాన్ని ఛేదించి ఇజ్రాయెల్‌పై దాడి చేయగల సామర్థ్యం ఉన్న ఆధునిక క్షిపణి ఆయుధాలు ఇరాన్ వద్ద ఉన్నాయన్న పరిశీలన ఇజ్రాయెల్ ఆలస్యంగా గ్రహించింది.

పన్నెండు రోజుల యుద్ధంలో ఇరాన్ దాడుల్లో ఇజ్రాయెల్ ఎంత నష్టపోయారో అన్న విషయంపై ప్రభుత్వం అధికారికంగా స్పందించలేదు. కానీ అనధికారిక అంచనాల ప్రకారం, ఇరాన్ ఎదురు దాడుల్లో 33 లేదా 34 మంది మరణించారు. 3,500 మందికి పైగా గాయపడ్డారు. తాజా యుద్ధంలో ఇరాన్ ప్రయోగిస్తున్న క్షిపణులు గత సంవత్సరం జూన్‌లో ప్రయోగించిన క్షిపణులకంటే ఎక్కువ విధ్వంసకర సామర్థ్యం కలిగినవి. హైఫా బే రిఫైనరిపై ఇరాన్ ప్రయోగించిన ఆయుధం ఇంధన రాకెట్-ఖేబర్ షేకన్ పేరుతో పదకొండు మీటర్ల పొడవున రాకెట్ అర టన్ను పేలుడు సామగ్రిని మోసుకుపోగలడు.

## ఇరాన్ అమ్ముల పొది నుంచి అధునాతన ఆయుధాలు..

ఇరాన్ ప్రయోగించిన హైపర్ సోనిక్ క్షిపణులు ఇజ్రాయెల్ నిర్మించుకున్న రక్షణ కవచాలను ఛేదించి టెల్ అవీవ్(ఇజ్రాయెల్ రాజధాని)పై బాంబుల వర్షం కురిపిస్తున్నాయని అల్ జజీరా వార్తా సంస్థ విడుదల చేసిన వీడియోలు వెల్లడిస్తున్నాయి. ఈ హైపర్ సోనిక్ క్షిపణులు స్వతంత్రంగా ప్రయాణించే సామర్థ్యం కలిగినవి మాత్రమే కాక ఏక కాలంలో పలు దిక్కులలో ఆయుధాలు ప్రయోగించే సామర్థ్యం కలిగిన “క్లస్టర్” ఆయుధాలు. ఈ క్షిపణులు పేలిపోతే, సాధారణ ప్రజానికానికి నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఆరు రోజులుగా జరుగుతోన్న యుద్ధంలో ఇజ్రాయెల్ రక్షణ కవచాలను ఛేదిస్తున్న ఇరాన్ క్షిపణుల మోతాదు 10% నుంచి 35 శాతానికి పెరిగాయని అమెరికా సైనిక విశ్లేషకుల అంచనా.

ఇజ్రాయెల్‌పై ఇరాన్ వేస్తున్న ఆయుధాలను గమనిస్తే, సాంప్రదాయక ఆయుధ నిల్వలు తగ్గిపోయినందు వలనే హైపర్ సోనిక్‌వంటి ఆధునిక యుద్ధ సాధనాలను ఇరాన్ బయటకు తీసిందని అంచనా వేస్తున్నారు. ఇరాన్ క్షిపణి ప్రయోగ కేంద్రాలను ధ్వంసం చేయాలన్న ఇజ్రాయెల్-అమెరికా ప్రయత్నాలు పాక్షిక ఫలితాన్ని మాత్రమే సాధిస్తున్నాయి. దీనికి కారణం ఇరాన్ క్షిపణి ప్రయోగ కేంద్రాలన్నీ భూగర్భంలో దాగి ఉండడమే. క్షిపణులు ప్రయోగించేంత వరకు ఏ ప్రాంతం నుంచి ఇరాన్ క్షిపణులు ప్రయోగిస్తుందో ఇజ్రాయెల్-

అమెరికాలకు అంతు చిక్కని పరిస్థితి ఉన్నది. ఒకసారి మాత్రమే ప్రయోగించగలిగిన ఈ క్షిపణులు-ప్రయోగించిన తర్వాత పరిసర ప్రాంతాలలో ఏర్పడే ధూళి మేఘాలను గుర్తించిన తర్వాత మాత్రమే ఫలానా చోట నుంచి క్షిపణి ప్రయోగం జరిగిందని తెలుస్తుంది. భూగర్భ క్షిపణి ప్రయోగ క్షేత్రాలు ఇరాన్ దేశమంతటా విస్తరించి ఉన్నాయి. పొరపాటున వాటంతట అవి పేలితే తప్పా ఫలానా చోట క్షిపణులు ఉన్నాయని తెలియడం లేదు. ఏరోజుకారోజు ఇరాన్ ఇటువంటి క్షిపణి ప్రయోగ క్షేత్రాలను తయారు చేసుకుంటోంది. ఇప్పటి వరకు దేశంలో ఎన్ని ఉన్నాయో తెలియదు. వేల సంఖ్యలో ఉన్నాయని మాత్రం అంచనా.

## పూర్తిగా తారుమారైన పరిస్థితులు..

కొంత కాలంగా అమెరికా చేస్తున్న దాడులతో ఇరాన్‌లో గందరగోళం, తిరుగుబాటు, ప్రభుత్వ మార్పిడికి బదులుగా ప్రజలు ఇరాన్ ప్రభుత్వాన్ని మరింతగా బలపరుస్తున్నారు. ఇరాన్ రాజకీయ నాయకత్వం కూడా ఇజ్రాయెల్-అమెరికా జంట దాడులకు గట్టిగా సమాధానం ఇవ్వాలని పట్టుదలతో ఉంది. గత కొన్ని నెలలుగా ఇరాన్ రూపొందించుకున్న వ్యూహం ఇప్పుడు అమలులోకి వస్తోందని అర్థమవుతోంది.

## రాజకీయ చర్చ

ఇరాన్ తొలుత గల్ఫ్ ఎమిరేట్స్‌లోని అమెరికా సైనిక స్థావరం మీద దాడి చేసింది. తర్వాత అమెరికా సైన్యం నివసిస్తోన్న హోటల్లపై గురి పెట్టింది. హౌతీల సహకారంతో హార్మూజ్ జల సంధిని దిగ్బంధనం చేస్తోంది. ఈ జలసంధి ద్వారానే రోజుకు 20 బిలియన్ బ్యారెల్ల చమురు వాణిజ్యం జరుగుతోంది. ఇరాన్ ప్రతిఘటన మరికొంత కాలం ఇదే స్థాయిలో కొనసాగితే, బెంజిమెన్ నెతన్యాహూ నేతృత్వంలోని ఇజ్రాయెల్ ప్రభుత్వం తీవ్రమైన ఆందోళనకు లోనుకాక తప్పదు.

## వెన్నులో వణుకు పుట్టించిన ఇరాన్

ఇప్పటి వరకు-ఇజ్రాయెల్ ప్రజలు తమ రక్షణపై పూర్తి భరోసాతో ఉన్నారు. ఇజ్రాయెల్ ప్రభుత్వం నిర్మించిన ఇనుప కవచం పట్ల అపరిమితమైన భరోసాతో ఉన్నారు. కానీ తాజా దాడులతో ఇజ్రాయెల్ ప్రజలు నేతన్యాహూ ప్రభుత్వంపై నమ్మకం కోల్పోతున్నారు. దాదాపు 30, 40 సంవత్సరాలలో చూడని విధంగా గత జూన్‌లో తమ సైనిక సామర్థ్యం రక్షణ వ్యవస్థపై పెను దాడిని ఇజ్రాయెల్ వాసులు గుర్తించారు. ఈ దాడుల్లో భారీ సంఖ్యలో ప్రజలు గాయాలపాలైయ్యారు. ఇజ్రాయెల్ నిఘా వ్యవస్థ మొసాద్ ప్రధాన కార్యాలయం పాక్షికంగా ధ్వంసమైంది. హైఫా విమానాశ్రయంపై కూడా దాడి జరిగింది. ఇజ్రాయెల్ భూభాగంలో ఈ స్థాయి విధ్వంసం జరగడం ఇదే మొదటిసారి.

చాలా కాలంపాటు ఇజ్రాయెల్ ప్రభుత్వం ఈ దాడులలో జరిగిన నష్టాన్ని వెల్లడించలేదు. కానీ రాత్రి పూట పెరిగిన ఇరాన్ ప్రతిదాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రజలు రక్షణ కోసం పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బేస్‌మెంట్‌లలోనూ, బంకర్‌లలోనూ తల దాచుకుంటున్నారు. ఈ దాడులలో జరిగిన ధన, ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ప్రభుత్వం ఎటువంటి వివరాలు ప్రకటించడం లేదు. ఏతావాతా ఈ దాడులు ఇజ్రాయెల్ పౌరులకు ప్రాణ భయం కల్పించాయన్నది మాత్రం వాస్తవం.

ఇజ్రాయెల్ చుట్టు పక్కల ఉన్న గాజా, వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరుసలేం పరిసర ప్రాంతాలలోని ప్రజలు గత కొన్ని దశాబ్దులుగా ప్రాణాలు అరచేత పట్టుకోని జీవిస్తున్నట్టే, ప్రస్తుతం ఇరాన్ దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రజలు మొదటిసారి ప్రాణాలు అరచేత పట్టుకుని ఉన్నారు. అంటే ఇరాన్ ఇజ్రాయెల్‌కు భయాన్ని పరిచయం చేసింది. ఎప్పుడు పడుకుంటారో, ఎప్పుడు ఏ పని చేయాల్సి వస్తుందో, తలదాచుకోవడానికి ఎప్పుడు ఎక్కడికి పరిగెత్తాల్సి వస్తుందో తెలియని స్థితి. పిల్లలు బడికి వెళ్తారో లేదో, వెళ్లిన పిల్లలు తిరిగి వస్తారో లేదో అని తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటున్నారు. ఇరాక్, లిబియా, సిరియా, యెమెన్‌లలో లక్షలాది మంది అరబ్ కుటుంబాలు సరిగ్గా ఇజ్రాయెల్ వల్ల ఇదే భయంతో జీవిస్తున్నాయి. 2003 నుంచి నేటి వరకు ఇజ్రాయెల్- అమెరికా ద్వయం పశ్చిమాసియాలో సాగిస్తున్న యుద్ధాల కారణంగా అరబ్ ప్రజలు ఎదుర్కొంటున్న దైనందిన ప్రాణభయం ఇది. ఇజ్రాయెల్ దుర్భేధ్యమైన దేశం అంటూ నేతన్యాహూ చేసుకున్న ప్రచారం గత జూన్ నెలలో జరిగిన దాడులతో ప్రశ్నార్థకమైంది.

## విశ్వాస-అవిశ్వాసల లెక్కలు.. గాజా ఊచకోత..

2024 మేనాటికి ప్యూ సంస్థ నిర్వహించిన సర్వేలో 58% ప్రజలు నేతన్యాహూ విధానాలను, మితవాద సంకీర్ణ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. 38% మంది మాత్రమే సమర్థిస్తున్నారు. పన్నెండు రోజుల యుద్ధం జరిగిన రెండు నెలల తర్వాత హిబ్రూ పత్రిక నిర్వహించిన సర్వేలో-ఎన్నికలు జరిగితే, 120 స్థానాలు ఉన్న పార్లమెంటులో 62 స్థానాలు ప్రతిపక్ష పార్టీలు గెలిచే అవకాశం ఉందని; దీంతో పార్లమెంట్‌లో మెజారిటీ తారుమారయ్యే పరిస్థితి ఉంది. కేవలం 27% ఇజ్రాయెలీలు మాత్రమే నెతన్యాహూ ప్రభుత్వంపై విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి నుంచి బయటపడడానికి నెతన్యాహూ ప్రభుత్వం నిస్సహాయులైన వెస్ట్‌బ్యాంక్, గాజాలోని పాలస్తీనా వాసులను ఊచకోత కోస్తుంది. 2025 అక్టోబరు 10 నుంచి 2026 ఫిబ్రవరి 10 వరకు-120 రోజులలో ఇజ్రాయెల్ సేనలు ట్రంప్

కుదిర్చిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని 1620 సార్లు ఉల్లంఘించాయి. ఈ కాలంలోనే 520 మంది పాలస్తీనా పౌరులను కాల్చివేయడమే కాక 79 సార్లు రక్షణ రేఖ దాటి పాలస్తీనియుల నివాసాలపై ఇజ్రాయెల్ సేనలు సాయుధ దాడికి పాల్పడ్డాయి. గాజాపై 749 సార్లు బాంబు దాడులకు పాల్పడ్డాయి. 232 దాడులలో పౌర నివాసాలు ధ్వంసమైయ్యాయి. 50 మంది పాలస్తీనా వాసులను గాజా నుంచి ఇజ్రాయెల్ అపహరించుకుపోయింది. గాజా ప్రాంతంలో పౌర నివాసాలపై దాడి చేయడమే కాక యుద్ధంలో గాయపడిన వారికి అంతర్జాతీయ సంస్థలు అందిస్తున్న సహాయాన్ని కూడా చేరనీయకుండా ఇజ్రాయెల్ నిలిపివేసింది. ఈ వివరాలను పరిశీలించినప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా అఖండ ఇజ్రాయెల్‌ను నిర్మించే ప్రయత్నానికి నేతన్యాహు ఒడిగట్టాడని అర్థమవుతోంది. యుద్ధ రూపాన్ని ఈ ఇతర మార్గాలే తీసుకున్నాయి.

**తన చివరి అస్త్రాన్ని ఇజ్రాయెల్ ప్రయోగిస్తుందా?**

అమెరికా ఎంతగా అత్యాధునిక సాయుధ సహకారాన్ని అందించినా ఈ యుద్ధంలో ఇజ్రాయెల్ గెలుపు అసాధ్యమని ప్రజలు క్రమక్రమంగా అర్థం చేసుకుంటున్నారు. ఇక నెతన్యాహూ ముందు చివరి అస్త్రం ఏంటి? అణుబాంబు. ఇప్పటి వరకు ఇజ్రాయెల్ వద్ద ఎన్ని అణుబాంబులు ఉన్నాయనే విషయం ఎవరికీ తెలియదు. 2009లో అల్‌జజీరా వెల్లడించిన వివరాల ప్రకారం, ఇజ్రాయెల్ 118 అణుబాంబులు ఉన్నాయి.

అణుబాంబు ప్రమాద తీవ్రత ఎంత ఉంటుందో అర్థం కాని ఈ తరానికి అర్థం కావడం కోసం "ఓ చిన్న" వివరణ, 1945 ఆగస్టు 6న హిరోషిమాపై ప్రయోగించిన అణుబాంబు బరువు 15,000 టన్నులు. ఈ దాడిలో పరిసర ప్రాంతాలలో 70% భవనాలు నేలమట్టం అయ్యాయి. బాంబు వెదజిమ్మిన విష వాయువులతో 1945 చివరి నాటికి లక్షా నలభై మంది ప్రజలు చనిపోయారు. మూడు రోజుల తరువాత నాగసాకిపై ప్రయోగించిన ఫ్లూటోనియం బాంబు నగరంలో 6.7 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని ధ్వంసం చేసింది. 74వేల మంది ప్రాణాలు తీసింది. ఈ బాంబు దాడుల తర్వాత, ఆ ప్రాంతంలో ఉష్ణోగ్రత నాలుగు వేల డిగ్రీలకు పెరిగింది. రెండు నగరాలు అణు ధార్మిక వానలతో తడిచిపోయాయి.

**కించిత్తు కూడా పశ్చత్తాపపడని నేతన్యాహూ..**

సాధారణ పరిస్థితుల్లో అటువంటి ప్రమాదకరమైన ఆయుధాల ప్రయోగం గురించిన ఆలోచన చేయడానికి సాహసించము. కానీ, నేతన్యాహూ నాయకత్వంలో ఇజ్రాయెల్ ప్రభుత్వం ఇటువంటి సాధారణ స్థితికి మినహాయింపు కావచ్చు. తాను ఇజ్రాయెల్ ప్రధానమంత్రిగా దిగిపోయిన మరుక్షణం తనపై ఉన్న అవినీతి ఆరోపణలకు జైలు శిక్ష అనుభవించాలి. తను జైలులో పడకుండా ఉండడానికి పాలస్తీనా నుంచి చివరి అరబ్ పౌరుడిని కూడా హతమార్చడం ఒకటే మార్గం అని నేతన్యాహు భావిస్తున్నాడు. తద్వారానే అఖండ ఇజ్రాయెల్ నిర్మాణం సాధ్యమని నమ్ముతున్నాడు. అందువల్లనే 2023 అక్టోబరు 7 నుంచి 2026 ఫిబ్రవరి 21 మధ్య కాలంలో 75,227 మంది పాలస్తీనా పౌరులను ఊచకోత కోసినా కించిత్తు పశ్చత్తాపం కూడా నేతన్యాహూకు లేదు.

అంతర్జాతీయ సమాజం, అమెరికా ఒత్తిడి మేరకు నేతన్యాహూ హమస్‌తో రాజీ కుదుర్చుకోవాల్సి వచ్చింది. దీంతో తన యుద్ధ దాహాన్ని తీర్చుకోవడానికి ఇజ్రాయెల్‌కు కొత్త శత్రువు అవసరమైంది. ఆ శత్రువు ఇజ్రాయెల్ ఉనికికి సవాలు విసిరే శత్రువు కావాలి- అప్పుడు మాత్రమే తాను దేశ రక్షణ సాకుతో అధికారంలో కొనసాగవచ్చు. అందువల్లనే ఇజ్రాయెల్-అమెరికాల మనుగడకు ఇరాన్ ప్రధాన శత్రువని గుర్తించాడు. తన లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లి మూర్ఖుడి రూపంలో డొనాల్డ్ ట్రంప్ దొరికాడు.

ఒక దేశాధినేత సాధారణంగా అమెరికా పర్యటించాలంటే ఒకటి లేదా రెండేళ్లపాటు సన్నాహాలు జరగాలి. 2025లో ట్రంప్ ఇరాన్‌లో యురేనియం శుద్ధి కార్యకలాపాలను నియంత్రించే విషయంలో ఆ దేశంతో ఒప్పందం కుదుర్చుకోవడం గురించి ప్రస్తావించిన అన్ని సందర్భాలలోనూ మరునాడే నేతన్యాహూ అమెరికా అధ్యక్ష భవనంలో ప్రత్యక్షమయ్యేవాడు. 2025-26 మధ్య కాలంలో నేతన్యాహూ ఆరు సార్లు ట్రంపును కలిశాడు. ట్రంప్ ఆరుసార్లు ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకుంటామని వెనక్కి తగ్గాడు. కొత్త కొత్త డిమాండ్లు ముందుకు తెచ్చాడు.

**ప్రస్తుతం ఇజ్రాయెల్- అమెరికాలు ఆశించినట్టుగా ఇరాన్‌పై యుద్ధం విజయం వైపు సాగడం లేదు. అటువంటప్పుడు నేతన్యాహూ ముందున్న మార్గం ఒకటే, ఇరాన్‌కు వ్యతిరేకంగా అణ్వస్త్ర ప్రయోగం. అనధికార సమాచారం ప్రకారం, ఇజ్రాయెల్ తన అణ్వస్త్రాలను సముద్రంలోని సబ్‌మెరైన్‌లలోకి తరలించింది. ఇరాన్‌పై అణ్వాయుధ దాడికి పాల్పడితే ఉపేక్షించేది లేదని రష్యా-చైనాలు తీవ్రమైన హెచ్చరిక చేయడం ద్వారా మాత్రమే ప్రపంచం ముందున్న అణుయుద్ధ ప్రమాదాన్ని నిలువరించగలము.** ❑

**అనువాదం: కొండూరి వీరయ్య**

**(ది వైర్ సౌజన్యంతో)**

# యుద్ధం ఇస్తున్న అతిచక్కని అవకాశం!



- రాహుల్ కుమార్

చరిత్రను గుర్తుంచుకోవటం కష్టం. మరిచిపోవటం సులభం. మంచి పనులు చేసినవాళ్లే దాన్ని గుర్తు చేస్తూ భవిష్యత్తు తరాలకు ప్రేరణగా ఉంటారు. తప్పని కచ్చితంగా తెలిసి దారుణాలకూ దురాగతాలకూ దౌర్జన్యాలకూ పాల్పడిన వారు చరిత్రను తేలికగా మర్చిపోతారు. ప్రజలు దాన్ని మర్చిపోయేలానూ చేస్తారు. వ్యక్తులకైనా దేశాలకైనా ఇదే వర్తిస్తుంది. ఇరాన్‌పై బాంబులు కురిపిస్తూ, రోజుకో విధంగా యుద్ధ కారణాలను వినిపిస్తోన్న అమెరికాకు అసలు ఉన్న చరిత్రే తక్కువ. అందులోనూ మరుపు చాలా ఎక్కువ. ఎలాంటి యుద్ధ ప్రకటన లేకుండా, ఐక్యరాజ్యసమితిలో సమస్యను చర్చించకుండా, వేలాది ప్రాణాల ఉసురు పోసుకుంటూ, ఉన్మత్తతతో ఊగిపోతున్న అమెరికా అధ్యక్షుడు.. తన చర్యల వల్ల చరిత్రలో ఒక గొప్ప అవకాశం వచ్చిందనీ దాన్ని ఇరాన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. అసలు ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం రావటానికీ, ఆ తర్వాత అది తన పదఘట్టనల కింద ప్రజాస్వామ్యాన్ని నలిపివేయడంలోనూ అమెరికా పాత్రే కీలకం. ఆ చేదు చరిత్ర ట్రంప్‌లాంటి అమెరికా పాలకులకు ఇప్పుడు గుర్తుకు రావటం లేదు. గుర్తు చేసిన వాళ్లను జాతి వ్యతిరేకులుగా ముద్రలు వేస్తున్నారు.

పశ్చిమాసియా దేశాలను వాటి మానాన వాటిని వదలివేస్తే అవన్నీ నిజమైన ప్రజాస్వామ్యం దిశగా కొన్ని అడుగులైనా తప్పనిసరిగా వేసేవి. కానీ చమురు సంపదలపై గుత్తాధిపత్యాన్ని నెలకొల్పుకొనే లక్ష్యంతో ప్రజాబలంతో అక్కడ ప్రభుత్వాలు ఏర్పడకుండా ముందుగా బ్రిటన్, ఆ తర్వాత అమెరికా శక్తివంచన లేకుండా పనిచేశాయి. అందుకే అమెరికా ప్రాపకంలోని పశ్చిమాసియాలో ప్రజాస్వామిక ప్రభుత్వాలూ లేవు. బహుళపార్టీలు కలిగిన రాజకీయ వ్యవస్థలూ లేవు. లౌకికవాదం ఉన్నచోట భిన్నాభిప్రాయాలకు తావు ఉంటుంది. అవి ఉన్నచోట ప్రజాస్వామ్య రాజకీయాలు ఉంటాయి. పశ్చిమాసియాలో అలాంటివి బలపడకుండా ఉండటానికి మతశక్తులకూ రాజరికాలకూ అమెరికా వెన్నుదన్నుగా నిలిచింది. ప్రజాస్వామ్యశక్తులు ఏదో విధంగా బలపడిన చోట వాటిని నిర్వీర్యం చేసే దాకా నిద్రపోలేదు. బహుళపక్ష రాజకీయాలు ఉంటే ఆర్థిక విధానాల మంచి చెడులపై విశ్లేషణలు వస్తాయి. విదేశీ కంపెనీలు తరలించే సొమ్ముల లెక్కలు తేలుతాయి. ఈ బెడద లేకుండా ఉండాలంటే అక్కడి దేశాలను నయానో భయానో ప్రజాస్వామ్యానికి దూరంగా ఉంచాలి. 20వ శతాబ్దం లోనూ రాజరికాలనూ, నియంతృత్వాలనూ చలాయించాలని చూసే స్థానిక పాలకులకూ ఆ ధోరణి నచ్చింది.

చమురు సంపదపై ఆధిపత్యం కోసం ఇరాన్‌లో ప్రజాస్వామ్యాన్ని బలి పెట్టటానికి అమెరికా ఏ మాత్రం వెనుకాడలేదు. రాజరికపు అధికారాలకు కత్తెర వేయాలనే డిమాండుతో ఇరాన్ ప్రజలు 1906లోనే ఉద్యమించారు. టెహరాన్ వీధులను ఆందోళనలతో హోరెత్తించారు. ప్రజల ఒత్తిడితో ఆనాటి రాజు షా మొజాఫర్ అద్-దిన్‌కు నేషనల్ అసెంబ్లీని (పార్లమెంట్) ఏర్పాటు చేయక తప్పలేదు. కొత్త రాజ్యాంగమూ రూపొందింది. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందూ ఆ తర్వాత ఏర్పడిన అల్లకల్లోల పరిస్థితుల్లో 1921లో రెజాఖాన్ పహ్లవీ అధికారాన్ని చేపట్టి రాజుగా(షా) ప్రకటించుకున్నాడు. అప్పటికి 20 ఏళ్ల ముందే బ్రిటన్‌కు చెందిన వ్యాపారవేత్తకు ఇరాన్‌లో చమురు అన్వేషణపై గుత్తాధిపత్యాన్ని కట్టబెట్టారు. భారీగా ఉన్న చమురు నిల్వలను వెలికితీసి అమ్మటానికి ఆంగ్లో-ఇరానియన్ కంపెనీ ఏర్పడింది. పేరులో ఇరానీ ఉన్నా లాభాల్లో ఇరాన్ ప్రభుత్వానికి దక్కేది చాలా తక్కువ. అందుకే చమురు సంపదపై గుత్తాధిపత్యంతో విపరీత లాభాలను ఆర్జిస్తున్న ఆంగ్లో-ఇరానీ కంపెనీని జాతీయం చేయాలని ప్రజలందరూ కోరుకున్నారు. ఆ ప్రజాకాంక్షకు ప్రతీకగా నిలిచిన వారిలో నేషనల్ ఫ్రంట్‌కు నాయకుడైన ముహమ్మద్ మొసాద్దేగ్ ప్రముఖుడు. ప్రపంచ బ్యాంకు అంటేనే అమెరికాకు అనుకూలం. అట్లాంటి ఆ బ్యాంకు ఇచ్చిన లెక్కలే చమురు దోపిడీని బట్టబయలు చేశాయి. 1914--1951 మధ్య 3.64 బిలియన్ డాలర్ల లాభాన్ని ఆంగ్లో-ఇరానియన్ కంపెనీ పొందింది. ఇరాన్ ప్రభుత్వానికి వచ్చింది 50 మిలియన్ డాలర్లు మాత్రమే. వనరులున్న దేశానికి కంటే మూడు రెట్లు (1.5 బిలియన్ డాలర్లు) బ్రిటన్‌కు పన్నుల రూపంలో దక్కింది. చమురుపై గుత్తాధిపత్యాన్ని తొలగించటం ఆ నాటి రాజకీయాలకు కేంద్ర బిందువైంది. మొసాద్దేగ్‌ను ప్రధానిని చేయాలని పార్లమెంట్ రెజాషాపై ఒత్తిడి తెచ్చింది. గత్యంతరం లేక దానికి ఆమోదం తెలిపారు. చమురును జాతీయం చేయాలని పార్లమెంట్ ఏకగ్రీవంగా తీర్మానించింది. దీంతో బ్రిటన్, అమెరికాలు ఉలిక్కిపడ్డాయి. ఇరాన్ చమురు బయటకు వెళ్లకుండా బ్రిటన్ ఆంక్షలు విధించింది. జాతీయం చేసినందుకు నష్ట పరిహారం ఇస్తామన్నా ఆంగ్లో-ఇరానియన్

కంపెనీ అంగీకరించలేదు. చమురుకు తోడు ఇతర ఆర్థిక ఆంక్షలనూ బ్రిటన్ విధించింది. ఆంక్షలు ఇరాన్‌ను కుంగదీయటం మొదలు పెట్టాయి. వేలాది మంది ఉద్యోగాలను కోల్పోయారు. విసిగిపోయిన మొసాద్దేగ్ ఒక దశలో రాజీనామా చేసినా ప్రజలు ఆందోళనలు చేసి మళ్లీ అధికారాన్ని కట్టబెట్టారు. చమురు రంగం జాతీయం చేయటానికే మొసాద్దేగ్ పరిమితం కాలేదు. చాలా సంస్కరణలనూ తీసుకువచ్చారు. వెట్టి చాకిరీని నిర్మూలించారు. భూస్వాములపై 20 శాతం పన్నులు వేశారు. నిరుద్యోగ భృతిని ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సౌకర్యాలను మెరుగు పరచారు. రాజకీయ స్వేచ్ఛను కల్పించారు. మహిళా హక్కులకు రక్షణ ఇచ్చారు.

ప్రజాస్వామ్యం ఇరాన్‌లో అట్లా బలపడుతున్న తరుణంలో ఆపరేషన్ అజాక్స్ పేరుతో మొసాద్దేగ్ ప్రభుత్వాన్ని కూల్చటానికి అమెరికా, బ్రిటన్‌లు పావులు కదిపాయి. పార్లమెంటు అధికారాల్ని కుదించి షాకు అడ్డు లేకుండా చేయటానికి అలజడులు లేవదీశాయి. ప్రజా ప్రతినిధులకు లంచాలు ఇచ్చారు. అమెరికా, ఇరాన్ ప్రసార సాధనాల్లో మొసాద్దేగ్‌కు వ్యతిరేకంగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కమ్యూనిస్టు పార్టీతో మొసాద్దేగ్‌కు సంబంధాలు ఉన్నాయంటూ ఆరోపణలను ఎక్కుపెట్టారు. మత పెద్దలకు సీఐఏ ఏజెంట్లు మారుపేర్లతో ఫోన్లు చేసి భయపెట్టారు. బాంబులు పెట్టి ఒక మతపెద్ద నివాసాన్ని పేల్చివేశారు. డబ్బులిచ్చి వీధి రౌడీలతో విధ్వంసం సృష్టించారు. వందల్లో ప్రజలు చనిపోయారు. దేశంలో చెలరేగిన అల్లకల్లోలం అంతా మొసాద్దేగ్ వల్లేనని నమ్మించేలా భయానక వాతావరణాన్ని సృష్టించారు. చివరిగా మిలటరీలో తమ అనుకూల శక్తుల్ని ఊసిగొల్పి ప్రధానమంత్రిని జైల్లో పెట్టించారు. ఇరాన్‌లో అట్లా ప్రజాస్వామ్యం గొంతు నులిమేశారు. అప్పట్లో ఇరాన్‌లో సీఐఏ ఏజంటుగా పనిచేసిన డాన్ విల్బర్ అవన్నీ కళ్లకు కట్టినట్లుగా తన నివేదికల్లో రాశారు. ఆపరేషన్ అజాక్స్ తర్వాత 1979 వరకూ అమెరికా అండతో షా పూర్తి నియంతృత్వాన్ని ఏర్పరచారు. చమురుపై కొత్త ఒప్పందం కుదిరింది. ఆంగ్లో-ఇరానీ కంపెనీ పేరు బ్రిటిష్ పెట్రోలియంగా మారింది. 40 శాతం షేర్లు బ్రిటిష్ కంపెనీకి దక్కితే మరో 40 శాతం షేర్లను అయిదు అమెరికన్ కంపెనీలు పంచుకున్నాయి. మిగతా 20 శాతం షేర్లు ఫ్రెంచ్, డచ్ కంపెనీలకు వెళ్లాయి. 25 ఏళ్ల షా పాలనలో వైట్ రెవల్యూషన్ పేరుతో చేపట్టిన చర్యలు అసమానతలను విపరీతంగా పెంచాయి. విపక్ష నాయకులను జైళ్లలో కుక్కారు. అమెరికా నుంచి ఆయుధాలను లెక్కలేనట్లుగా కొన్నారు. 1972-76 మధ్య 10 బిలియన్లను ఆయుధాల కోసం ఖర్చు పెట్టారు. వ్యవసాయంలో యాంత్రీకరణతో రైతులకు ఉపాధి పోవటంతో నగరాలకు వలస వచ్చారు. అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాల సరుకుల దిగుబడులతో స్థానిక ఉత్పత్తులూ వ్యాపారాలూ దెబ్బ తిన్నాయి. మతసంస్థల భూములను స్వాధీనం చేసుకోవాలని చూడటంతో అలజడి మొదలైంది. ఇవన్నీ కలిసి ఇస్లామిక్ విప్లవానికి దారితీశాయి. నిజానికి ఇస్లామిక్ విప్లవం గొడుగు కింద ప్రజాస్వామ్య, లౌకిక శక్తులన్నీ ఏకమై ఉద్యమాన్ని నడిపాయి. అయతొల్లా ఖొమేనీ చేతిలోకి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొద్దికాలం ప్రజాస్వామ్య పార్టీల ప్రతినిధులకు ప్రభుత్వంలో ప్రాతినిధ్యం ఉండేది. ఆ తర్వాత మొదలైన ఇరాక్-ఇరాన్ యుద్ధంతో అంతా మారిపోయింది. అమెరికా అండతో ఎనిమిదేళ్లు సాగిన ఆ యుద్ధంనాటి పరిస్థితులను ఉపయోగించుకుని లౌకిక ప్రజాస్వామ్య పార్టీలనూ, నేతలనూ.. కార్యకర్తలనూ బలహీన పర్చటమూ, హతమార్చటమూ విపరీతంగా జరిగింది. దీంతో అయతొల్లా ఖొమేనీ ఆధిపత్యానికి అడ్డు లేకుండా పోయింది.

వరుసగా జరిగిన ఈ పరిణామాలన్నిటినీ గుర్తు చేసుకుంటే ఈనాటి ఇరాన్ పరిస్థితికి అమెరికా నిర్వహించిన పాత్ర ఏమిటో స్పష్టంగానే తెలుస్తుంది. ప్రజాస్వామ్యాన్ని కాలరాసి వేయటానికీ మతవాద రాజకీయ వ్యవస్థ ఉక్కు చట్రంలో ఇరాన్ నలిగిపోవటానికీ అమెరికానే రంగాన్ని సిద్ధం చేసింది. స్వలాభం, పశ్చిమాసియా ఆధిపత్యం కోసం ఒకనాడు ఒక ఘోర చరిత్రను సృష్టించి ఇప్పుడో కొత్త చరిత్రకు ఇరానీయులకు అవకాశం ఇస్తున్నామంటూ ప్రకటించటం అమెరికాకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. ఎన్నో దేశాలు ప్రజాస్వామ్య సమాజాల కోసం, స్వతంత్ర నిర్ణయాల కోసం, వనరులపై సొంత అజమాయిషీ కోసం కొత్త చరిత్రను సృష్టించటానికి ప్రయత్నాలు చేసిన చోటల్లా అమెరికానే వాటిని తుంచివేసింది. 1893లో హవాయి దీవులను స్వాధీనం చేసుకోవటంతో మొదలై 2003లో ఇరాక్‌పై దండయాత్ర వరకూ అమెరికా పాల్పడిన చర్యలూ దారుణాల వివరాలన్నీ స్టీఫెన్ కింజర్ రాసిన 'ఓవర్‌త్రో' పుస్తకంలో విపులంగా ఉన్నాయి. 110 ఏళ్ల కాలంలో 14 చోట్ల తను అనుకున్నట్లుగా బలవంతంగా ప్రభుత్వాలను మార్చింది. అందులో 1953 నాటి ఇరానూ ఉంది. ఎక్కడా ప్రజాస్వామ్యం పాదుకోలేదు. అస్థిరత్వం, నియంతృత్వాలు, సంక్షోభాలే ఏర్పడ్డాయి. తేడా అల్లా ఒక్కటే. అప్పుడు అవి చాలా వరకూ ఆ దేశాలకే పరిమితమయ్యాయి. ఇప్పుడు ఇరాన్‌పై బాంబుల దాడితో అవి పశ్చిమాసియానంతా కమ్ముకుంటున్నాయి. ఇరాన్ ప్రజల సంగతేమో కానీ అమెరికా నిర్హేతుక యుద్ధం అన్ని దేశాలకూ కొత్త చరిత్రకు అవకాశం ఇస్తోంది. అమెరికా ఆధిపత్యాన్నీ అపసవ్య ధోరణులనూ సామ్రాజ్యవాద తత్వాన్నీ ఎదుర్కోవటం అనివార్యమయ్యేలా రంగాన్ని సిద్ధం చేస్తోంది. ఇంతకుమించి చరిత్ర ఇస్తున్న గొప్ప అవకాశం మరొకటి ఉంటుందా ? ❑

**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

# విదేశాంగ నీతిలో తప్పటడుగులు..



- సి.రామచంద్రయ్య

'మేము నిటారుగా నిల్చుంటాం. ఎవరి ముందూ తలవంచం. మా మిత్రులందరికీ స్నేహహస్తం అందుబాటులో ఉంటుంది. మా వ్యవహారాల్లో ఎవరి జోక్యాన్ని సహించం'. 1982లో నాటి భారత ప్రధాని ఇందిరాగాంధీ అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్య ఇది. భారత్‌ను అమెరికా శిబిరంలో చేరాలని ప్రెసిడెంట్ రీగన్ చేసిన ప్రతిపాదనకు ఇందిర నిష్కర్షగా చెప్పిన సమాధానం అది. ఆమె ఈ మాటల్ని ఎక్కడో అనలేదు. తన అమెరికా పర్యటనలో, సాక్షాత్తు రోనాల్డ్ రీగన్ సమక్షంలోనే అమెరికా, రష్యాల మధ్య సాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధంలో-తాము ఎవరి పక్షమూ వహించబోమని, దౌత్యపరంగా తమది తటస్థ వైఖరి అని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు ఇందిర.

దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకొని, అటల్ బిహారీ వాజపేయి వరకు, మధ్యలో దేశ ప్రధానులుగా కాంగ్రెస్ పార్టీ వారున్నా, కాంగ్రెసేతర పార్టీలకు చెందిన వారెవరున్నా.. భారతదేశ విదేశాంగ విధానం సుదృఢంగా అలీన విధానం (నాన్ అలైన్డ్) గానే కొనసాగింది. నిజానికి ఆనాటి భారత్ నేటి మాదిరిగానే ప్రబల ఆర్థికశక్తిగా లేదు. పేదరికం, అవిద్య, నిరుద్యోగం వంటి ఎన్నో సామాజిక, ఆర్థిక రుగ్మతలతో దేశం సతమతమవుతోంది. అయినప్పటికీ అన్న వస్త్రాల కోసమో, అణ్వాయుధాల కోసమో భారత్ ఎవరి ముందూ తలవంచలేదు. దేశాన్ని ఎవరు ఏలుతున్నా.. వారు ఏకపక్షంగా తమకు తోచినట్టుగా నిర్ణయాలు తీసుకోలేదు. సొంత పార్టీ నేతలను, దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీల నేతలను కలుపుకుని అందరి సలహాలు, సూచనల మేరకు విదేశాంగ విధానాన్ని తీర్చిదిద్దారు. ప్రధానంగా దేశ ప్రయోజనాలు, మరీ ముఖ్యంగా ప్రపంచ మానవాళి శాంతి సౌభాగ్యాలకు దోహదం చేసే విదేశాంగ విధానాన్ని అనుసరించారు. కొన్ని సందర్భాలలో విదేశాంగనీతిలో రాజీపడవలసిన అనివార్యత ఏర్పడినా.. దేశ ప్రయోజనాల్ని ఎవరూ ఎన్నడూ పణంగా పెట్టలేదు. ఫలితంగానే నిన్నమొన్నటి వరకూ.. 'భారత' కీర్తి ప్రతిష్ఠల్ని అంతర్జాతీయంగా సమున్నత స్థాయికి తీసుకువెళ్లగలిగారు.

అయితే, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో నడుస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కొన్నేళ్లుగా అనుసరిస్తున్న ఏకపక్ష విదేశాంగ విధానంతో అంతర్జాతీయంగా మన దేశ ప్రతిష్ఠ మసకబారింది. దేశ ప్రయోజనాలు దెబ్బ తింటున్నాయి. భారతదేశం అనుసరించే విదేశాంగ విధానాన్ని ఒకప్పుడు వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి (స్ట్రాటజిక్ అటానమీ)గా చెప్పుకొనేవారు. దానివల్లనే దక్షిణాసియా దేశాలకు భారత్ ప్రాంతీయ నాయకత్వం వహించే స్థితికి చేరింది. కానీ, నేడు భారత విదేశాంగ విధానంలో స్పష్టత లోపించింది. ప్రత్యర్థి దేశాలకంటే వెనుకబడిపోయింది. అంతర్జాతీయంగా అనేక అవకాశాలు కోల్పోయింది. చివరకు-నేడు భారత్ ఎవరిపక్షం ఎందుకు వహిస్తున్నదో, దానివల్ల సాధిస్తున్న ప్రయోజనాలేమిటో చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి.

'ఎలాంటి స్నేహితులు ఉండాలో ఎంచుకొనే అవకాశం మీకు ఉంది. కానీ పొరుగున ఎవరు ఉండాలో నిర్ణయించడం మీ చేతుల్లో ఉండదు' అనే వారు అటల్‌బిహారీ వాజపేయి. ఆ కారణంగానే ఒక్క పాకిస్థాన్ మినహా మిగతా పొరుగు దేశాలతో వాణిజ్య, దౌత్య, సాంస్కృతికపరంగా చక్కటి సంబంధాలు నెలకొల్పడానికి ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. భారత్ తనకు మించిన స్థాయిలో నేపాల్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, శ్రీలంక, మాల్దీవులకు అన్ని రకాలుగా సాయం చేసింది.

అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్‌లను దాదాపుగా ఒంటిచేత్తో పునర్నిర్మాణం చేసింది. అఫ్ఘానిస్థాన్ పార్లమెంట్ భవనం నిర్మాణం మొదలుకొని రోడ్లు, బ్రిడ్జిలు, టెలిఫోన్ వ్యవస్థ వరకు అనేక రంగాలలో సాయం చేసింది. 1971-72లో తూర్పు పాకిస్థాన్ విముక్తమై బంగ్లాదేశ్‌గా అవతరించడానికి పాకిస్థాన్‌తో యుద్ధమే చేసిన భారత్.. ఆనాడు బంగ్లాదేశ్ శరణార్థులకు చోటిచ్చింది. వారి ఆకలి దప్పులు తీర్చడానికి దేశ ప్రజలపై అదనపు పన్నులు వేసింది. శ్రీలంకలో వేర్పాటువాదాన్ని అణచడానికి భారత్ తన సైన్యాన్నే (ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్-ఐపీకేఎఫ్) పంపింది. పొరుగు దేశాలైన మయన్మార్, మాల్దీవులకు సైతం సాయపడింది. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా.. ఇదొక నిరంతర ప్రక్రియలా కొనసాగింది.

నేడు 'నైబర్ హుడ్ ఫస్ట్' కాస్తా.. 'నైబర్ హుడ్ ఫర్‌గెట్'గా మారింది. భారత్‌ను ద్వేషించే దేశాలలో పాకిస్థాన్ సరసన బంగ్లాదేశ్ చేరిపోయింది. బంగ్లాదేశ్ పూర్తిగా చైనా చెప్పు చేతల్లోకి వెళ్లిపోయింది. హసీనా ప్రభుత్వ పతనం అనంతరం బంగ్లాదేశ్‌లో చైనా భారీగా పెట్టుబడులు పెట్టింది. మోంగ్లా ఓడ రేవును, తీస్తా నదీ ముఖద్వారాన్ని చైనా అభివృద్ధి చేస్తోంది. నేపాల్, శ్రీలంక, మాల్దీవులతో సైతం భారత్ సంబంధాలు

అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఏదో సామెత చెప్పినట్లు.. సొమ్మూ పోయి, శని పట్టడానికి కారణం – మన దౌత్య నీతిలో వచ్చిన మార్పే! పొరుగు దేశాలతో పరస్పర సహకారం, గౌరవం ఇచ్చిపుచ్చుకుంటూ స్వప్రయోజనాలను కాపాడుకోవలసిన దౌత్య విధానంలో రాజకీయాలు జొరబడడం వల్ల.. సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. బంగ్లాదేశ్‌లో అవామీలీగ్ నేత షేక్ హసీనాతో అనుబంధం పెంచుకోవడం వల్ల అమెను వ్యతిరేకించే బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ చైనాకు దగ్గరయింది. అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ అధినేత తారిక్ రెహ్మాన్ చైనాకు తమ దేశపు తలుపులు బార్లా తెరిచాడు. అమెరికా విషయంలో కూడా ప్రధాని నరేంద్రమోదీ ఈ విధంగానే వ్యవహరించారు. ట్రంప్‌ను గెలిపించాలని ఆ దేశం వెళ్లి ఇండియన్ డయాస్పోరాకు పిలుపునిచ్చారు. పోనీ ట్రంప్ ఆ మేరకు నరేంద్రమోదీ పట్ల, భారత్ పట్ల కృతజ్ఞత చూపించాడా అంటే అదీలేదు. భారత్‌పై ఏకపక్షంగా టారిఫ్‌లు భారీగా విధించాడు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలుపై ఆంక్షలు విధించాడు. ఇరాన్ నుంచి చమురు దిగుమతి చేసుకోరాదని అంతకు ముందే హెచ్చరించాడు. పైగా, అమెరికా ఆంక్షలకు తలొగ్గిన ఫలితంగా.. భారత మార్కెట్లను అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు ముంచెత్తబోతున్నాయి. దాంతో, భారత రైతాంగం పరిస్థితి ప్రశ్నార్థకం కావడం ఖాయం.

ఇటీవల విశాఖలో జరిగిన నేవీ ఫీట్‌లో పాల్గొని స్వదేశానికి బయలుదేరిన ఇరాన్ ఓడను హిందూ మహాసముద్రంలో అమెరికా అత్యంత అమానుషంగా ముంచేసిన ఘటనపై భారత్ నోరు మెదపలేదు. తమ అతిథిని ఆ విధంగా చేయడమేమిటని అమెరికాను ప్రశ్నించలేదు. హిందూ మహా సముద్రంలో దొంగచాటుగా అమెరికా తన జలాంతర్గాములను మోహరిస్తే దానిని తప్పని ఖండించలేదు. ఇక, ఇరాన్ అధినేత ఖొమేనీ హత్య జరిగిన ఆరు రోజుల అనంతరం భారత్ దౌత్యాధికారి ఒకరు ఢిల్లీలోని ఇరాన్ కాన్సులేట్‌కు వెళ్లి మొక్కుబడి సంతాపం తెలిపి వచ్చారు. ఈ దాడి ఘటనపై మన దేశాధినేత నోరు మెదపకపోవడం ఆశ్చర్యం. ఇరాన్ వద్ద అణ్వస్త్రాలు ఉండి ఉంటే.. ఈ పాటికే వాటిని ప్రయోగించి ఉండేది. ఆయా దేశాలను నాశనం చేయడానికి అమెరికా బూచీగా చూపించే అంశం–అణ్వాయుధాలు కలిగి ఉండడం. దీనిని కూడా ఇండియా ప్రశ్నించలేకపోయింది. అన్నిటికంటే ముఖ్యంగా.. ఇరాన్‌తో యుద్ధానికి సిద్ధపడిన ఇజ్రాయెల్ దేశంలో, మన ప్రధాని నరేంద్రమోదీ పర్యటించడమే ఆశ్చర్యం. ఇజ్రాయెల్‌ను పర్యటించిన ఏకైక భారత ప్రధాని ఇప్పటివరకు ఒక్క మోదీయే. ఈ పర్యటనలో ప్రధాని మోదీ.. హమాస్‌తో ఇజ్రాయెల్ జరిపిన యుద్ధంలో చనిపోయిన 1,219 ఇజ్రాయెలీలకు సంతాపం వ్యక్తం చేశారేతప్ప, ఇప్పటివరకు అసువులు బాసిన 70 వేల మంది పాలస్తీనీయుల పట్ల చుక్క కన్నీరు కార్చలేకపోయారు.

**మోదీ ప్రభుత్వం అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠ గురించి మాట్లాడటం లేదు. ముఖ్యంగా–నెల రోజుల పాటు రష్యా నుంచి చమురు కొనుగోలు చేసుకోవడానికి భారత్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుమతి ఇవ్వడం గురించి అధికార పార్టీకి చెందిన వారెవరూ నోరు మెదపకపోవడం సిగ్గుచేటు. ప్రస్తుతం ఇరాన్‌పై సాగుతున్న అమెరికా, ఇజ్రాయెల్ దాడి నేపథ్యంలో నరేంద్రమోదీ అనుసరిస్తున్న మౌనం దేనికి సంకేతం?! విదేశీ విధానంలో కేంద్ర ప్రభుత్వం వేస్తున్న తప్పటడుగులు, తప్పుడు అడుగులకు దేశం చెల్లించే మూల్యం ఏ మేరకు ఉంటుందో ఊహించడం కష్టం.** ❑

## మన సార్వభౌమాధికారానికే సవాలు

**(5వ పేజీ తరువాయి)**

సామ్రాజ్యవాదం నమ్ముతోంది. అందువల్లే ఈ విధంగా వ్యవహరిస్తోంది.

అమెరికా విదేశాంగ మంత్రి (సెక్రటరీ ఆఫ్ స్టేట్) మార్కో రూబియో కొంతమంది యూరోపియన్ దేశాల నేతలతో ఇటీవల జరిపిన సమావేశంలో మళ్లీ వలస పాలనా కాలానికి మళ్లడమే పరిష్కారం అని ప్రతిపాదించాడు. కమ్యూనిజం కారణంగా, కమ్యూనిస్టుల మద్దతుతో జరిగిన వలస విముక్తి పోరాటాల కారణంగా "ఘనమైన పాశ్చాత్య సంస్కృతి" ఇటీవలి కాలంలో నష్టపోయిందని, ఈ నష్టాన్ని మళ్లీ భర్తీ చేసుకోవాలని, అంటే మళ్లీ వలస పాలనా కాలానికి వెళ్లాలని అతగాడు చెప్పాడు. మూడవ ప్రపంచ దేశాలను మళ్లీ తమ పాదాక్రాంతం చేసుకోవాలని ఇంతకన్నా సూటిగా ఎవరూ చెప్పరు కదా.

మొదట ఈ ప్రతిపాదన పట్ల కొంత అపనమ్మకం వ్యక్తం చేసినా, యూరప్ దేశాల నేతలు మొత్తానికి దానిని అంగీకరించారు. స్పెయిన్ మినహా తక్కిన యూరప్ దేశాలేవీ ఇరాన్ మీద అమెరికా–ఇజ్రాయిల్ చేసిన దాడిని వ్యతిరేకించలేదు. అందుచేత మనకి ఒక విషయం స్పష్టం అవుతోంది. మూడవ ప్రపంచ దేశాలు సాధించుకున్న విజయాలను, పురోగతిని వమ్ము చేసి మళ్లీ వలసపాలనా కాలానికి తీసుకుపోడానికి సామ్రాజ్యవాద దేశాలు కలిసికట్టుగా గట్టి ప్రయత్నాన్ని చేయబోతున్నాయి. ❑

**(ప్రజాశక్తి సౌజన్యంతో)**

# దేశం కోసం ధర్మం కోసమా ట్రంప్‌నకు గులాంగిరి ?



- డాక్టర్ దేవరాజు మహారాజు

గత పన్నెండేళ్లుగా సాగుతున్న నేటి ఈ బీజేపీ రామ రాజ్య పాలనలో దేశ నాయకులు రూ.250 లక్షల కోట్లు అప్పు చేసి, దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా మళ్లించారట ! దేశంలో నల్ల ధనం మూడు రెట్లు పెంచి తమ నిర్వాకం ప్రదర్శించుకున్నారట ! 35 వేల కిలోల బంగారం అమ్మేసి దేశాన్ని ధనిక దేశంగా మార్చారట ! 50 లక్షల కోట్ల రుణమాఫీ కేవలం తమ గుజరాతీ మార్వాడీలకే చేయించారంటే మాటలా? 16 లక్షల కోట్ల లంచం ఎస్.బి.ఐ.-ఎలక్ట్రోల్ బాండ్ల ద్వారా తీసుకుని అవినీతిని అడ్రసు లేకుండా చేశారట ! లక్షలాది కంపెనీలు మూతపడేలా చేసి, దేశాన్ని ప్రగతి పథంలో నిలబెట్టారట ! ప్రభుత్వ పాఠశాలలు ఎందుకని వేల సంఖ్యలో వాటిని మూసేయించి విద్యను కొనసాగిస్తున్నారట! నిరుద్యోగాన్ని దేశంలో అత్యధికంగా పెంచి, ప్రపంచ స్థాయిలోనే మొదటి స్థానం దక్కించుకున్నారట ! అలాగే తమ శక్తి కొద్దీ పేదరికాన్ని పెంచి పోషిస్తున్నారు. ఈ విషయం ఏ దేశ ప్రభుత్వం కూడా మన దేశ ప్రభుత్వంతో పోటీ పడలేదని ఘంటాపథంగా చెప్పొచ్చునట ! డాలర్‌కన్నా రూపాయి ఎంతగా పైకెగసిందో అందరికీ తెలిసిన విషయమే కదా ? డాలర్ ఒక్కటయితే మన రూపాయలు 92 కంటే ఎక్కువ ! భారత్ ధనిక దేశమని రుజువు చేయడానికే మన పాలకులు అధిక ధరలు, అధిక పన్నులు విధించి రొమ్ము విరుచుకుంటున్నారు. దేశ పౌరుల సహనశీలత పెంచడానికే కదా జీఎస్టీలతో సొమ్ము దోపిడీ చేస్తున్నదీ ! దేశ సంపదలను, వనరులను, సంస్థలను, అన్నింటినీ తమ గుజరాతీ కార్పొరేట్లకు దోచిపెట్టి ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచిందీ ప్రభుత్వం ! ఇలా నేటి ఆరెస్సెస్ - బీజేపీ ప్రభుత్వం సాధించిన 'అధోగతి ప్రగతి'కి ఉదాహరణలు ఎన్నయినా చెప్పుకోవచ్చు. అంతా దేశం కోసం? ధర్మం కోసమే ? అయ్య బాబోయ్ !!

ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి నిర్దోషులని కోర్టు వారిని విడుదల చేసింది. కేంద్ర సంస్థలయిన ఈడీ, సీబీఐలను దుర్వినియోగం చేసిన కేంద్ర ప్రభుత్వం ఇక ఇప్పుడు ఎక్కడ ముఖం దాచుకుంటుంది ? శాస్త్రవేత్త, మెగసెసే అవార్డు విజేత సోనమ్ వాంగ్ చుక్ వీరి నిర్వాకం వల్లే అనవసరంగా జైల్లో గడుపుతున్నాడు. రామ్ రహీమ్ అనే వీరి మిత్రుడు ఒక రేపిస్ట్, పేరుకే జైలు శిక్ష అనుభవిస్తూ 40-40 రోజులు బెయిల్‌పై బయట తిరగనిస్తున్నారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం వారు న్యాయాన్ని అన్యాయమని ముద్రవేస్తారు. అన్యాయమే న్యాయమని ప్రకటిస్తున్నారు. బీహార్‌లో దేశ ప్రధాని ఎన్నికల ప్రసంగాలు విని వారి బీజేపీ మాజీ నేత యశ్వంత్ సిన్హా ఇలా అన్నారు. "మోడీ ఎన్నికల ప్రసంగాలు-ఆయన ఒక నిరక్షరాస్యుడని, వీధి భాష మాటాడే వ్యక్తి అని తెలియజేశాయి!" కర్నాటక అప్పు 5.5 లక్షల కోట్లు అనేది తీవ్రంగా పరిగణించాల్సిన విషయమే కానీ, నరేంద్రమోడీ ఈ దేశం అప్పు పదకొండేళ్లలో 400 శాతం పెంచాడు - ఇది మాత్రం చాలా తేలికగా తీసుకోవాల్సిన విషయమే ! వేల ఏళ్ల నుండి ఈ దేశాన్ని పీడిస్తున్న బ్రాహ్మణిజం ఇప్పుడు రూపం మార్చుకుని, ఆర్ఎస్ఎస్ అనే వంద తలల విషనాగులా తన ప్రభావం చూపుతూ ఉంది. నిజానికి బీజేపీ వారు హిందూయిజాన్ని పాటించరు. తమ ఆత్మన్యూనతా భావానికి అనేక రకాలుగా పేర్లు మార్చి పెట్టుకుంటారు. వాలం ట్రైన్ డేని - మాతా పితా దివస్‌గా మార్చారు. క్రిస్మస్‌ను తులసి పూజా దివస్‌గా చేసుకున్నారు. బక్రీద్‌ను - జంతువులను రక్షించే దినంగా మలుచుకున్నారు. రామనవమి అంటే మసీదుల ముందు డోలు వాయిస్తూ డాన్సులు చేసే దినంగా మార్చుకు న్నారు. వాళ్ల పండగలు వాళ్లు జరుపుకోరు. వేరే వాళ్లని జరుపుకోనివ్వరు. అదీ వాళ్ల ప్రత్యేకత !

"ఉత్తరప్రదేశ్ విద్వేష రాజకీయాలకు, నేర సామ్రాజ్యానికి కేంద్రంగా తయారైంది. ఇది రాష్ట్రానికి ప్రమాదకరం" అని ఆ రాష్ట్రంలోని 104 మంది మాజీ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కలిసి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు ఉత్తరం రాశారు. వీళ్లంతా దేశద్రోహులని మరి ఆయన వీళ్లందరిని జైళ్లలో వేయిస్తాడేమో చూడాలి ! 2026 జనవరి 6న జమ్మూ కశ్మీర్‌లోని రేసి జిల్లాలో ఉన్న శ్రీమాతా వైష్ణోదేవి మెడికల్ ఇనిస్టిట్యూట్‌ను (ఎస్ఎంవీడీఎంఐ) బీజేపీ అనుబంధ విద్యార్థి సంఘాలు అల్లర్లు సృష్టించి మూసివేయించాయి. మూతపడ్డాక సంతోషంగా సంబరాలు జరుపుకున్నాయి. విద్యా సంస్థ మూసేయించి సంబరాలు జరుపుకోవడం బహుశా ప్రపంచంలో ఇదే మొదటి ఉదంతమై ఉంటుంది. జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఉమర్ అబ్దుల్లా ఈ చర్యను తీవ్రంగా నిరసించాడు. అక్కడ అసలు కారణమేమంటే ముస్లిం విద్యార్థులే అందులో అధికంగా మెడికల్ సీట్లు సంపాయిస్తున్నారట.

మెరిట్‌లో నిలవలేని బీజేపీ అనుబంధ యువకులు సీట్లు తమకు రావడం లేదని నిరంతరం అల్లర్లు సృష్టించడం ప్రారంభించారు. చివరకు విజయవంతంగా మూయించి పండగ

చేసుకున్నారు. ఎలాగైతేనేం ముస్లిం వర్గాన్ని దెబ్బతీశారు కదా? అదీ వారి ఘనత ! ముస్లిం విద్యార్థులు ప్రతిభావంతులైనా దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే ఆర్థిక స్థోమత ఉండకపోవచ్చు. ఉన్న ఊరిలో మెడికల్ కాలేజి ఉన్నఫళంగా మూతపడడం వల్ల ప్రతిభ గల విద్యార్థులంతా ఇబ్బందుల్లో పడ్డారు. అల్లర్లు సృష్టించిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుబంధ విద్యార్థులకు ఇబ్బంది లేదు. వారు జై శ్రీరామ్ నినాదంతో ఎక్కడైనా, ఎవరినైనా బెదిరించి బతకగలరు. ఏమైనా వారు చేసేదంతా దేశం కోసం-ధర్మం కోసమే కదా ? ఫామ్ హౌస్‌లో మైనర్ బాలికలతో వ్యభిచారం నిర్వహిస్తున్న మేఘాలయ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెర్నార్డ్ మారక్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ ఫామ్ హౌస్‌లో ఉన్న ఐదుగురు మైనర్ బాలికలను కాపాడి, 73 మందిని అరెస్ట్ చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. దేశం కోసం-ధర్మం కోసం ! మొత్తానికి మొత్తంగా హిందూ పవిత్ర గ్రంథాలన్ని తీసి చదవండి.

ఎక్కడా ఎప్పుడూ ఏ రాక్షసుడూ బలత్కారం చేయలేదు. ఇప్పటి దాకా ఆ విషయం గమనించకపోతే - ఇక ఇప్పుడైనా తిరగేసి తెలుసుకోండి ! ఇక దేవతల సంగతి చెప్పేదేముందీ ? స్వంత బిడ్డలనే వదిలిపెట్టలేదు. పైగా పదహారు వేల మందితో రాసక్రీడలాడాడని ఆరాధిస్తున్నారు కదా ? ఆ దేవతల అడుగుజాడల్లో నడుస్తున్న ఈ కాలపు భక్తజనం ఇలా తమ ఆరాధ్య దేవతల్ని అనుసరిస్తున్నారన్న మాట! "అణగారిన వర్గాల మహిళలను రేప్ చేస్తే పుణ్యం లభిస్తుందీ, తీర్థ యాత్రలకు వెళితే లభించే ఫలితం లభిస్తుంది. అందుకే, వారు అనాగరికంగా, మోటుగా ఉన్నా అందంగా లేకపోయినా లైంగిక దాడులు జరుగుతున్నాయి" అని అన్నాడు మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక ఎమ్మెల్యే - ఫూల్‌సింగ్. దుర్మార్గంగా ఎవరు మాట్లాడినా మనం నిరసించాల్సిందే! "ఆడపిల్ల పుడితే నష్టం - మగ పిల్లవాడు పుడితే లాభం" అనేది బీజేపీ మనువాద భావజాలం! "రాజస్థాన్‌లో బీజేపీ బడ్జెట్ అంటే యవ్వనంలో మగబిడ్డ పుట్టినంత లాభదాయకమైంది. గతంలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆడపిల్ల పుట్టినంత నష్టదాయకమైంది!" అని అసెంబ్లీలో ప్రకటించారు. రాజకీయ పార్టీలు వారి రాజకీయాలేవో వారు మాట్లాడుకోవచ్చు. కానీ, ఆడ పిల్ల పుట్టుకను తక్కువ చేసి చూపడమెందుకూ? బీజేపీ నాయకులు వారి మనువాద భావజాలాన్ని ఎక్కడపడితే అక్కడ ప్రదర్శిస్తూనే ఉంటారు. మూర్ఖుణ్ణి ఎవరో వచ్చి "మూర్ఖుడా!" అని పిలవాల్సిన పనిలేదట. వాడికి వాడే తన నైజం బాహాటంగా ప్రదర్శించుకుంటాడట. 1919లో బ్రిటీష్ వాళ్లు కలకత్తా హైకోర్టులో బ్రాహ్మణుల్ని న్యాయమూర్తులుగా నియమించేవారు కాదు. కారణం ఏమంటే - బ్రాహ్మణులైన వారు చట్టపరమైన తీర్పులు ఇవ్వకుండా, కులం ఆధారంగా నిర్ణయాలు తీసుకుని, తీర్పులిస్తారని బ్రిటీష్ వారికొక అభిప్రాయముండేదట. ఆ అభిప్రాయానికి బలం చేకూర్చే ప్రకటనే ఇటీవల ఒక దేశ నాయకుడు చేశాడు. "ఈ రోజు కాకపోతే రేపు భారతదేశం హిందూ దేశమైపోతుంది. అనుమానమే లేదు - అయితే అప్పుడు రాజ్యాంగంలో మొదటి సూత్రం ఇలా ఉంటుంది - వేద వేదాంగ పారంగతుడైన వాడికే న్యాయమూర్తిగా అక్కడ కూర్చుని తీర్పులిచ్చే అర్హత ఉంటుంది!". అశ్వమిత్ గౌతమ్ అనే పద్నాలుగేళ్ల బాలుడిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. చేసిన తప్పేమిటంటే, ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో అతను ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాడు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సామాజిక అంశాలను లేవనెత్తాడు. అంతే !! ప్రశ్నకు వణికిపోయే ఈ ప్రభుత్వం, ఒక బాలుడికి భావవ్యక్తీకరణ స్వేచ్ఛ అవసరమా? అని అనుకుంది. అందుకే ఎఫ్ఐఆర్ దాకా పోయింది.

ఎవరైనా సరే, బాల్య దశలో వున్న బాలికలను లైంగిక వేధింపులకు గురి చేస్తే చైనాలో మరణశిక్ష విధిస్తారు. జిన్‌పింగ్ ప్రభుత్వం అనుసరిస్తున్న కఠినమైన విధానం అది. మరి మన దేశంలో తమది సనాతన ధర్మమని గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ నాయకులే బాలికలను లైంగికంగా వేధిస్తున్నారు. ప్రజలు తిరగబడితే, మళ్లీ వారి కార్యకర్తలే రోడ్లెక్కి తమ నాయకులను విడిచి పెట్టాల్సిందేనని ఊరేగింపులు తీస్తుంటారు. ముస్లింల రంజాన్ పండగ సందర్భంగా వారి అత్యవసర వస్తువులపై సుంకాలు మొత్తానికి మొత్తంగా ఎత్తేసింది-చైనా ప్రభుత్వం. మరి మన దేశం ? ద్వేష భావనలు పెంచి పోషిస్తూ, ఎక్కడికక్కడ వారిపై దాడులు చేసే పనిలో తలమునకలై ఉంది.

సిక్కు మతానికి చెందిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ముస్లిం మతానికి చెందిన డాక్టర్ అబ్దుల్ కలాం రాష్ట్రపతి, అదే మతానికి చెందిన హమీద్ అన్సారీ ఉప రాష్ట్రపతి. అప్పటి రక్షణ మంత్రి క్రైస్తవ మతస్థుడైన ఆంటోనీ. ఆ రోజుల్లో ఏ మతానికి చెందిన దేవుళ్లు గానీ, దేశపౌరులు గానీ ప్రమాదంలో లేరు. హిందూ దేవాలయాలు ప్రమాదంలో లేవు. హిందువులు అసలే ప్రమాదంలో లేరు. కానీ, గత పన్నెండేళ్లుగా హిందూ ప్రధాని, హిందూ హోం మంత్రి, హిందూ రాష్ట్రపతి, హిందూ ఉప రాష్ట్రపతి, హిందూ రక్షణ మంత్రి, హిందూ ముఖమంత్రులు, గవర్నర్లు అయినా మరెందుకో "హిందువులు ప్రమాదంలో ఉన్నారు" అనే ప్రచారం విస్తృతంగా జరుగుతూ ఉంది. హిందూ మతోన్మాదుల దుష్ప్రచారం అలాగే ఉంటుందని వదిలేయలేం ! ఈ దేశ పౌరులే పూనుకుని-విద్వేష ప్రచారాల నుండి దేశాన్ని కాపాడాలి ! మత కొట్లాటల నుండి దేశాన్ని కాపాడాలి ! ఒక సముదాయాన్ని టార్గెట్ చేయడం నుండి దేశాన్ని కాపాడాలి.

కార్పొరేట్ల కబంధ హస్తాల నుండి దేశాన్ని కాపాడాలి! ఎక్కడా, ఎందులోనూ లొంగిపోకుండా **(మిగతా 21వ పేజీలో)**

# అంతు లేని అమెరికా అమానుషాలు

- డాక్టర్ పి.మిత్ర

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేస్తున్నాయి. ఇరాన్ అగ్ర నాయకులను హతమార్చాయి. చిన్నారులపై బాంబులు వేయడంతో సహా ఇరాన్ ప్రజలను పలు విధాల భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇదంతా ఉద్దేశ పూర్వకంగా చేసిందేనని ఈ భయానక అమానుషాలను చూస్తే అనిపిస్తోంది. పాఠశాలలు, ఆసుపత్రులు, శరణార్థుల శిబిరాలపైన బాంబులు వేసి, మూకుమ్మడి హత్యలు చేయడం ఇజ్రాయెల్‌కు పరిపాటి. ఇరాన్‌లోనూ అటువంటి ఘోరాలు చేస్తున్నా ఇరానియన్లు తమను విమోచన ప్రదాతలుగా ఆహ్వానిస్తారని అమెరికా – ఇజ్రాయెల్ ద్వయం విశ్వసిస్తోంది.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 80 సంవత్సరాల్లో, అనేక దేశాలలో ప్రభుత్వాల మార్పునకు అమెరికా ప్రయత్నించింది. ఈ క్రమంలో సంభవించిన ఏ ఒక్క యుద్ధంలోను అమెరికా గెలవలేదు. ఊహకందనంత మారణ హోమం తర్వాత అమెరికా తోక ముడుచుకుని పారిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వియత్నాం, ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికాకు ఎదురైన పరాజయాలే అందుకు ఉదాహరణలు. నిన్న గాక మొన్న వెనెజువెలా అధ్యక్షుడు మదురో, ఆయన భార్యను కిడ్నాప్ చేసి అమెరికాకు తీసుకువెళ్లారు. ఆ చర్య అమెరికా దురహంకారానికి ప్రతీక. సద్దాం హుస్సేన్‌ను భయంకరంగా ఉరితీశారు. లిబియా అధినేత గడాఫీని నడిరోడ్డు మీద హతమార్చారు. ఒసామా బిన్ లాడెన్‌ను అమెరికా సైనికులు కాల్చి చంపారు. ప్రపంచ ప్రజలు ఈ ఘటనలను టెలివిజన్‌లో చూశారు. తమ ఆధిపత్యాన్ని సవాల్ చేసిన ప్రతి ఒక్కరినీ నిర్దాక్షిణ్యంగా అంతమొందిస్తామని ఆ చర్యల ద్వారా ప్రపంచ దేశాలను అమెరికా హెచ్చరించింది.

తొలుత తమకు నమ్మకస్తుడైన మిత్రుడిగా ఉండి, ఆ తరువాత తమ ప్రయోజనాలను దెబ్బ తీసినందుకు ఇరాక్ పాలకుడు సద్దాం హుస్సేన్ మెడ విరగ్గొట్టారు. అమెరికా సమకూర్చిన ఆయుధాలను కుర్దులకు వ్యతిరేకంగా సద్దాం ప్రయోగించాడు. వారిని ఊచకోత కోశాడు. ఆ హత్యాకాండను ఆపేందుకు అమెరికా ఎలాంటి ప్రయత్నం చేయలేదు. పైగా అమెరికా విషవాయువులను తయారుచేసే యంత్రాంగాలనూ సమకూర్చింది. కుర్దులకు వ్యతిరేకంగా జరిగిన అమానుష హత్యాకాండకు సద్దాం మాత్రమే బాధ్యుడు కాదు. అతడిని ప్రోత్సహించిన అమెరికా అధ్యక్షులు రీగన్, బుష్ (సీనియర్) కూడా బాధ్యులే.

లిండన్ జాన్సన్, జనరల్ వెస్ట్‌మోర్‌ల్యాండ్, రాబర్ట్ మెక్‌నమారా, రిచర్డ్ నిక్సన్ వియత్నాంలో జరిగిన దారుణాలకు పరోక్షంగా ప్రత్యక్షంగా కారకులే. మరి ఆ పెద్ద మనుషులను ఎందుకు ఉరి తీయలేదు ? కనీసం వీళ్లవరి మీద కేసులు కూడా నమోదు కాలేదు కదా. పాట్రిస్ లుముం, సాల్వడార్ అలెండే (చిలీ), చేగువేరా (క్యూబా) మొదలైన నాయకుల హత్యలు; ఇండోనేసియాలో కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, లక్షలాది కార్యకర్తలు, మద్దతుదారుల హత్యలు ; వియత్నాం, కంబోడియా, లావోస్ ప్రజల దారుణ హత్యలు సీఐఏ పర్యవేక్షణలోనే జరిగాయి. తాలిబాన్‌కు మద్దతు ఇచ్చినందుకు, అల్‌ఖైదాను సృష్టించినందుకు బాధ్యులైన అమెరికా అధ్యక్షులను ఉరి తీశారా ? ఆఫ్ఘనిస్థాన్ మొత్తాన్ని నాశనం చేసి మరీ నిష్క్రమించారు కదా.

సరే, పాలస్తీనియన్ల రక్తం తమ చేతులకు అంటని అమెరికా అధ్యక్షుడు ఒక్కరైనా ఉన్నారా ? ఎంత మంది నియంతలను అమెరికా తన అక్కున చేర్చుకోలేదు ? మార్కోస్ (ఫిలిప్పీన్స్), సమోజా(నికరాగ్వా), బాటిస్టా(క్యూబా), సుహార్తో (ఇండోనేషియా) మహా నరహంతకులు. వీరందరినీ వాషింగ్టన్ ప్రభువులు సమాదరించారు. సీఐఏ పర్యవేక్షణలో వారికి రక్షణ కల్పించారు. లక్షలాది ప్రజల హత్యలకు బాధ్యులైన ఈ నరహంతకులే అమెరికాకు స్నేహితులు! బాగ్దాద్‌లో అమలు పరిచిన న్యాయసూత్రాలను అమెరికా అధ్యక్షులకూ వర్తింపజేస్తే వారిలో ప్రతి ఒక్కరూ ఉరి శిక్షకు అర్హులే.

చిలీ అధ్యక్షుడు పినోచెట్ కనీసం 30 వేల మంది మేధావులను హతమార్చాడు. ప్రెసిడెంట్ జార్జ్ బుష్ (సీనియర్), జేమ్స్ బేకర్ సీఐఏ హెడ్ ఆఫీస్ నుంచి చిలీలో జరిగిన మారణహోమాన్ని నేరుగా పర్యవేక్షించారు. బాగ్దాద్ సూత్రం ప్రకారం పినోచెట్, అతని జనరల్స్‌ను కనీసం 200 సార్లు ఉరి తీయాల్సింది. 1970 నుంచి 2000 వరకు అమెరికా అధ్యక్షులు, సీఐఏ అధికారులూ ఉరికంబం ఎక్కి ఉండాల్సింది. ఇది వినడానికి ఎంత భయంకరంగా ఉన్నా ఈ 'న్యాయ' సూత్రాన్నే ప్రపంచమంతటికీ అమెరికా వర్తింపజేసింది. అమెరికా నుంచి నిరంతర మద్దతును పొందిన ఏరియల్ షారోన్, **(మిగతా 29వ పేజీలో)**

# మోదీ జీ.. 'జాతీయ అవమానం' అంటే ఏమిటో మీకు వివరిస్తా

- రాజ్‌దీప్ సర్ దేశాయ్



- 1.మణిపూర్ బీజేపీ ఎమ్మెల్యే వాంగ్జిన్ వాల్ట్ 2023 జాతి ఘర్షణల సమయంలో తీవ్ర గాయాలతో మరణించారు. నేటి వరకు, దాడి చేసిన వారిలో ఎవరినీ అరెస్టు చేయలేదు, విచారించలేదు - ఇది జాతీయ అవమానం.
- 2.రాజస్థాన్‌లో, మాజీ బీజేపీ ఎంపీ ముస్లిం మహిళలు తనకు ఓటు వేయరని వారికి ఇచ్చిన దుప్పట్లను తిరిగి వెనక్కి తీసుకున్నారు - ఇది జాతీయ అవమానం.
- 3.దేశ రాజధానిలో, ముస్లిం ఇంటి పేరు ఉన్నందుకు పీహెచ్‌డీ చేసిన ఒక వ్యక్తికి ఒక ఇంటి యజమాని ఇల్లు అద్దెకు ఇవ్వడానికి నిరాకరించాడు - ఇది జాతీయ అవమానం.
- 4.ఒడిశాలో, మధ్యాహ్నం భోజనం వండే అతను దళితుడు కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపబోమంటూ బెదిరిస్తున్నారు - ఇది జాతీయ అవమానం.
- 5.దేశ రాజధాని ఢిల్లీలో, అరుణాచల్ మహిళలు జాతి వివక్షలకు, అవమానాలకు గురవుతున్నారు. ఈశాన్య రాష్ట్రాల పౌరులు పదే పదే జాతి వివక్షకు గురవుతున్నారు - ఇది జాతీయ అవమానం.
- 6.ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్ట్రెచర్లు అందుబాటులో లేకపోవడంతో ఒక యువకుడు అనారోగ్యంతో ఉన్న తన తండ్రిని భుజాలపై మోసుకెళ్లాల్సి వచ్చింది - ఇది జాతీయ అవమానం.
- 7.ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి తన రాష్ట్రంలో బెంగాలీ మాట్లాడే ముస్లింలపై ఆర్థిక బహిష్కరణకు పిలుపునిచ్చాడు - ఇది జాతీయ అవమానం.
- 8.లడఖ్ ప్రజల తరపున గొంతు విప్పినందుకు సోనమ్ వాంగ్‌చుక్‌ను జైలులో పెట్టారు - ఇది జాతీయ అవమానం.
- 9.కాశ్మీర్ లోయలోని జర్నలిస్టులను కేవలం వ్యాసాలు రాసినందుకు జైలు శిక్ష విధిస్తామని బెదిరిస్తున్నారు - ఇది జాతీయ అవమానం.
- 10.నిరసన తెలిపే సిక్కు రైతులను ఖలిస్తానీలుగా ముద్ర వేస్తారు - ఇది జాతీయ అవమానం.
- 11.ఫాదర్ స్టాన్ స్వామి వంటి 80 ఏళ్ల పాస్టర్‌ను ఉగ్రవాద నిరోధక చట్టాల కింద అరెస్టు చేసి గిరిజన హక్కుల కోసం నిలబడినందుకు అతను నీళ్లు తాగేందుకు సిప్పర్‌ను కూడా కోల్పోతారు - ఇది జాతీయ అవమానం.
- 12.బజరంగ్ దళ్ కార్యకర్తలు క్రిస్మస్ వేడుకలపై దాడి చేసి తప్పించుకున్నారు - ఇది జాతీయ అవమానం.
- 13.జిమ్ యజమాని మహమ్మద్ దీపక్ ఒక భారతీయ ముస్లిం తరపున నిలబడినందుకు అతనిని టార్గెట్ చేశారు - ఇది జాతీయ అవమానం.
- 14.దారుణమైన అత్యాచారం, హత్య కేసుల్లో దోషులు జైలు నుండి విడుదలైన వెంటనే వారికి VHP దండలు వేస్తుంది - ఇది జాతీయ అవమానం.
- 15.రామ్ రహీమ్‌కు తన ప్రభావం, అధికారం కారణంగా పదే పదే పెరోల్ మంజూరు చేయబడుతుంది - ఇది జాతీయ అవమానం.
- 16.సోషల్ మీడియా పోస్ట్‌లో దేవదూషణ చేశాడనే ఆరోపణలతో కన్హయ్య లాల్ లాంటి దర్జీని హత్య చేయడం - ఇది జాతీయ అవమానం.
- 17.శక్తివంతమైన వ్యక్తులను వ్యంగ్యంగా చిత్రీకరించినందుకు ఒక స్టాండ్-అప్ కమెడియన్‌ను అరెస్టు చేయడం - ఇది జాతీయ అవమానం.
- 18.మన న్యాయవ్యవస్థ జైలు కాదు. బెయిల్ అనే దాని సూత్రాన్ని పాటించదు - ఇది జాతీయ అవమానం.
- 19.మహారాష్ట్రలో అప్పుల పాలైన రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు - ఇది జాతీయ అవమానం.
- 20.హిట్ అండ్ రన్ కేసులో సంపన్న కుటుంబానికి చెందిన యువకుడు అతి తక్కువ శిక్షను అనుభవిస్తున్నాడు - ఇది జాతీయ అవమానం.
- 21. లైంగిక వేధింపుల బాధితులు న్యాయం కోసం పోరాటం కొనసాగించాల్సిన పరిస్థితి రావడం జాతీయ అవమానం.
- 22.సమాజం తీవ్ర అసమానతలో కూరుకుపోతుండగా, జనాభాలో అగ్రశ్రేణి 10% మంది జాతీయ ఆదాయంలో 58% కలిగి ఉండటం జాతీయ అవమానం. ❑

# పెట్రో ఉత్పత్తుల కొరత
# రిలయన్స్ కథా కమామీసు

- జి.భార్గవ



యుద్ధం కారణంగా దేశంలో పెట్రోల్ ఉత్పత్తుల కొరత ఏర్పడుతున్నది కాబట్టి, ఈ అనిశ్చిత పరిస్థితుల్లో ప్రజలు ఇంధన పొదుపు పాటించి ప్రభుత్వానికి అండగా నిలబడాలి అని వాట్సాప్ ప్రొఫెసర్లు తమ సూక్తులు మొదలు పెట్టారు. మంచిదే. ప్రజలు ఎలాగూ ఆ పనిచేస్తారు. అయితే రష్యా ఆయిల్ అమ్మకాలపై అమెరికన్ ముఠా విధించిన నిషేధాల కారణంగా రష్యా చాలా తక్కువ ధరకు తన ముడి చమురును భారత్ వంటి దేశాలకు అమ్మింది. 2022 నుంచి 2025 వరకూ సుమారు 30% డిస్కౌంటుతో రష్యా ముడిచమురు అమ్మింది. ఈ డిస్కౌంట్ సేల్ వల్ల భారత ప్రజలకు చాలా తక్కువ ధరకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ లభించి ఉండాలి. కానీ అదేమీ జరగలేదని, ధరలు ఏ మాత్రం తగ్గలేదని మనకు తెలుసు. మరి ఈ డీల్ వల్ల అత్యధికంగా లాభం పొందింది ఎవరు ? ఇంకెవరు మన ఢిల్లీ విదూషక బాద్షా ఆంతరంగిక గుజరాతీ పోషకుడైన ముఖేష్ అంబానీ. జామ్‌నగర్‌లోని తన ఆయిల్ రిఫైనరీ ద్వారా ఆయన సంపాదించిన అతిశయ లాభం (windfall profit) గురించిన కొన్ని లెక్కలు ఇలా ఉన్నాయి. చదవండి.

**1 బ్యారెల్ ముడి చమురు :** 159 లీటర్లు. రోజుకు ప్రాసెస్ అయ్యే పరిమాణం : 7,00,000 బ్యారెల్స్.. అంటే 700,000 × 159 లీటర్లు = సుమారు 11.13 కోటి లీటర్ల ముడి చమురు. చమురు ప్రధానంగా Reliance Industries కంపెనీకి చెందిన Jamnagar Refineryలో శుద్ధి చేయబడుతుంది.

**2. ముడి చమురు ధర (రూపాయల్లో) :** ఒక బ్యారెల్ ముడి చమురు అంతర్జాతీయ మార్కెట్లో సుమారు : $ 80 (డాలర్లు).. డాలర్ విలువ రూ.83.. అంటే.. $ 80 × రూ.83 = 6,640.. ఒక బ్యారెల్ ధర రూ.6,640.. రోజుకు దిగుమతైన మొత్తం ముడి చమురు విలువ : 700,000 × రూ.6,640.. అంటే రోజుకు రూ.465 కోట్లు

**3.రష్యా చమురు డిస్కౌంట్ వల్ల లాభం :** రష్యా యుద్ధం తర్వాత చమురు $20–30 డిస్కౌంట్‌తో అమ్మింది. సగటుగా : $25 డిస్కౌంట్ అంటే, $25 × రూ.83 = రూ.2,075.. ఒక బ్యారెల్‌పై రూ.2,075 తక్కువ ధర.. రోజుకు మొత్తం లాభం : 700,000 × రూ.2,075 = రూ.145 కోట్లు. అంటే ముడి చమురు కొనుగోలు ఖర్చులోనే రోజుకు రూ.145 కోట్లు ఆదా.


**4. ఒక బ్యారెల్ చమురు నుంచి వచ్చే ఇంధనం :** సాధారణంగా ఒక బ్యారెల్ నుంచి.. పెట్రోలు 45%, డీజిల్ 28–30%, జెట్ ఫ్యూయల్ 10%, LPG మరియు ఇతర ఉత్పత్తులు 15%. రోజుకు 700,000 బ్యారెల్స్ నుంచి పెట్రోలు సుమారు 5 కోటి లీటర్లు, డీజిల్ సుమారు 3.2 కోటి లీటర్లు, జెట్ ఫ్యూయల్ సుమారు 1.1 కోటి లీటర్లు, LPG మరియు ఇతరాలు సుమారు 1.8 కోటి లీటర్లు.

**5. ఈ ఇంధనం విలువ (రూపాయల్లో) :** పెట్రోలు 5 కోటి లీటర్లు × రూ.72 = రూ.360 కోట్లు రోజుకు. డీజిల్ 3.2 కోటి లీటర్లు × రూ.80 = రూ.256 కోట్లు రోజుకు. మొత్తం (పెట్రోలు + డీజిల్) రూ.360 + రూ.256 = రూ.616 కోట్లు రోజుకు.. జెట్ ఫ్యూయల్, LPG వంటి ఇతర ఉత్పత్తులు కలిపితే ఇంకో రూ.100–150 కోట్లు విలువ ఉంటుంది. అంటే మొత్తం ఉత్పత్తి విలువ : రూ.700–రూ.750 కోట్లు రోజుకు.

**6. క్లుప్తంగా అర్థం చేసుకుంటే :** రోజుకు కొనుగోలు చేసే ముడి చమురు సుమారు రూ.465 కోట్లు తయారయ్యే ఇంధనం విలువ రూ.700–750 కోట్లు. రిఫైనింగ్ లాభం రూ.235–రూ.285 కోట్లు రోజుకు.. రష్యా చమురు డిస్కౌంట్ వల్ల అదనపు ప్రయోజనం రూ.145 కోట్లు రోజుకు.. అంటే, రష్యా నుంచి తక్కువ ధరకు చమురు కొనుగోలు చేసి శుద్ధి చేసి అమ్మితే : రోజుకు సుమారు రూ.200–300 కోట్లు లాభం వచ్చే అవకాశం ఉంది. అంటే సంవత్సరం మొత్తానికి ఇది రూ. 70,000 – రూ.1,00,000 కోట్ల వ్యాపార పరిమాణం అవుతుంది. ఈ విధంగా జూలై, ఆగస్టు 2022 నుంచి నవంబరు 2025 వరకూ అంబానీ చమురు కంపెనీ మూడున్నరేళ్లపాటు రష్యన్ డిస్కౌంట్‌ను ఉపయోగించుకుంది. కనీసం రెండు లక్షల యాభై వేల కోట్ల నుంచి మూడు లక్షల కోట్ల రూపాయల వరకు లాభాలు సంపాదించింది. కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాల కారణంగా, ప్రైవేట్ కార్పోరేట్ అనుకూల విధానాల కారణంగా ఈ డిస్కౌంటు లాభం పబ్లిక్ రంగ చమురు కంపెనీలకు లభించలేదు. భారతీయ వినియోగదారులకు ఎలాంటి ధరల తగ్గింపు జరగలేదు. ఇప్పుడు యుద్ధం వల్ల చమురు ధరలు పెరిగి, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరిగే అవకాశం ఉన్నప్పుడు.. అప్పనంగా లక్షల కోట్ల లాభాలు సంపాదించిన రిలయన్స్, నయారా వంటి కార్పోరేట్ సంస్థలు దేశం కోసం ఏ త్యాగం చేయవా ? వారిపై అత్యవసర పరిస్థితుల పన్ను వేసి ఆ డబ్బుతో కోట్లాది మంది సామాన్య భారతీయులను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? ❑

# పలస్తీనాలో యూదులు !

**1935లో గాంధీజీ రాసిన వ్యాసం** - ఎం.కె.గాంధీ



పలస్తీనాలో అరబ్బుల-యూదుల అంశంపై, జర్మనీలో యూదుల ఊచకోతపై నా అభిప్రాయం తెలియజేయాలని నాకు చాలా ఉత్తరాలు వచ్చాయి. ఈ క్లిష్టమైన అంశంపై కొంత జంకుతోనే నా అభిప్రాయాలు తెలియజేయడానికి సాహసిస్తున్నాను. యూదుల మీద నాకు సానుభూతి ఉంది. దక్షిణాఫ్రికాలో ఉండగా వారిని సన్నిహితంగా చూశాను. వారిలో కొందరు నాకు జీవితకాల సహచరులైపోయారు. ఇలాంటి మిత్రుల ద్వారానే దీర్ఘకాలంగా యూదులు అనుభవించిన వేధింపులు, క్షోభ గురించి నాకు తెలిసింది. వారిని క్రైస్తవులు అంటరాని వారిగా చూసేవారు. క్రైస్తవులు యూదులను అంటరాని వారిగా చూడడానికి, అంటరాని వారిని హిందువులు చూడడానికి దగ్గరి పోలిక ఉంది. వారితో అమానుషంగా ప్రవర్తించడం కోసం ఈ రెండు మతాల్లోనూ మతసమ్మతి ఉన్నట్టు చిత్రీకరించారు. కొందరు యూదులు నాకు మిత్రులైనందు వల్లే కాకుండా వారి విషయంలో నాకు సానుభూతి ఉండడానికి విశ్వజనీనమైన ఉమ్మడి కారణం ఒకటి ఉంది. అయితే నాకు సానుభూతి ఉన్నంత మాత్రాన న్యాయం ఏదో తెలుసుకోలేనంతగా నా కళ్లు మూసుకుపోలేదు. తమకు ఒక దేశం ఉండాలన్న యూదుల కోరిక నన్ను అంతగా ఆకట్టుకోలేదు. దీనికోసం బైబిల్ నుంచి సాక్ష్యాధారాలు వెతుకుతారు. పలస్తీనాకు వచ్చిన తరవాత వారిలో తమకు ఓ దేశం కావాలన్న మంకుతనం బాగా పెరిగింది. ఈ భూగోళం మీద ఉండే ఇతరుల్లాగా వారు తాము జన్మించిన, ఉపాధి చూసుకున్న, జీవనోపాధిని చూసుకున్న చోటనే తమ దేశంగా ఎందుకు భావించరు ? ఇదే అర్థంలో పలస్తీనా అరబ్బులదే! అంటే ఇంగ్లాండు ఇంగ్లీషు వారిదైనట్టుగా, ఫ్రాన్స్ ఫ్రెంచి వారిది అయినట్టుగా, అరబ్బుల మీద యూదులను రుద్దడం తప్పే కాదు అమానుషం కూడా !!

ఏ నీతి సూత్రం ఆధారంగా చూసినా పలస్తీనాలో ప్రస్తుతం జరుగుతున్న దాన్ని సమర్థించలేం. దీనికోసం ఇచ్చే ఆదేశాలకు యుద్ధాన్ని మించిన ధర్మబద్ధత ఏమీలేదు. అరబ్బుల గౌరవాన్ని తగ్గిస్తే పలస్తీనాను యూదులకు పాక్షికంగానో, సంపూర్ణంగానో అప్పగించేయవచ్చు అనుకోవడం మానవాళి మీద కొనసాగించే నేరమే. దీనిబదులు యూదులు ఎక్కడ పుట్టి పెరిగినా వారిని న్యాయంగా పరిగణించడం మహత్తరమైన మార్గం అవుతుంది. ఫ్రాన్స్‌లో పుట్టిన యూదులు సైతం, ఫ్రాన్స్‌లో పుట్టిన వారు ఫ్రెంచి వారైనంతగా అక్కడ పుట్టిన యూదులు కూడా ఫ్రెంచివారే. యూదులకు ఒక దేశం లేకపోతే, పలస్తీనానే తమ దేశం అని పట్టుబడితే, తాము ఏ దేశాలలో అయితే స్థిరపడ్డారో అక్కడి నుంచి తరిమేస్తే సహిస్తారా ? లేదా వారు ఎక్కడబడితే అక్కడ ఉండడానికి రెండు దేశాలు కావాలా ? తమకు ఒక దేశం కావాలన్న ఆరాటం జర్మనీ నుంచి యూదులను తరిమి వేయడాన్ని సమర్థించడానికే ఉపయోగపడుతుంది. అయితే జర్మనీలో యూదులను వేధించిన తీరుకు సాటి అయింది చరిత్రలో మరో ఉదంతమే లేదు. హిట్లర్ వెర్రిగా ప్రవర్తించినట్టు ఏ నియంతా ప్రవర్తించ లేదు. హిట్లర్ చాలా కసిగా యూదులను వేధిస్తున్నాడు. అంటే ఆయన ఇతరులను, సమరశీలమైన జాతీయతా వాదాన్ని సమర్థించడానికి నూతనోత్సాహంతో ఈ పని చేస్తున్నాడు. కొత్త మతోన్మాదాన్ని ప్రవేశపెడ్తున్నారు. ఇలాంటి స్థితిలో ఎంతటి అమానుషమైనా మానవతావాదంగా చెలామణి అయిపోతుంది. దీనికి ప్రస్తుతం భవిష్యత్తులో కూడా గౌరవం ఉంటుంది. పూర్తిగా పిచ్చెత్తినట్టు, అత్యంత నిర్భయంగా ప్రవర్తించే యువత ఆ మొత్తం జాతిని నమ్మలేనంతటి క్రౌర్యంతో ఆవరిస్తోంది. మానవత్వం పేరుతో ఇంతకన్నా సమర్థనీయమైన యుద్ధం ఏదైనా ఉంటే ఒక జాతినంతటినీ వేధించుకు తినడాన్ని నిరోధించడానికి జర్మనీపై యుద్ధంకన్నా సమర్థనీయమైంది ఏమీ లేదు. కానీ నాకు ఏ రకమైన యుద్ధంలోనూ నమ్మకం లేదు. అందువల్ల అలాంటి యుద్ధం మంచి చెడ్డలు చర్చించడం నా ఊహలోనూ, పరిధిలోనూ లేదు.

యూదులను వేపుకు తిన్నందుకు జర్మనీపై యుద్ధం చేయలేకపోయినా జర్మనీతో సంబంధం మాత్రం కుదరదు. న్యాయం కోసం, ప్రజాస్వామ్యం కోసం నిలబడుతున్నామని చెప్పున్న ఒక జాతి ఈ రెండిటికీ బద్ధ శత్రువు అయితే దానితో మైత్రి ఎలా కుదురుతుంది ? లేక ఇంగ్లాండ్ సకల విషయాల్లోనూ సాయుధ నియతృత్వం వేపు మొగ్గుతోందా ? ఎలాంటి కపటమూ, బలహీనత లేకుండా మానవత్వం ముసుగులో సమర్థంగా హింసకు పాల్పడవచ్చో జర్మనీ నిరూపిస్తోంది. తన నగ్న స్వరూపాన్ని ప్రదర్శిస్తూ ఎంత వికృతంగా, దుర్భరంగా ప్రవర్తించవచ్చునో జర్మనీ రుజువు చేస్తోంది. ఇలాంటి వ్యవస్థీకృత, నిస్సిగ్గుతో కూడిన వేధింపును యూదులు ప్రతిఘటించగలరా? వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునే మార్గం ఏమైనా ఉందా? నిస్సహాయంగా, నిర్లక్ష్యంగా, ఒంటరితనం అనుభవించకుండా ఉండడం

సాధ్యమా ? నాకు సాధ్యమేననిపిస్తోంది. భగవంతుడి అస్తిత్వాన్ని నమ్మే ఏ వ్యక్తి అయినా ఒంటరిగా, నిస్సహాయంగా మిగిలిపోన క్కర్లేదు. యూదుల యెహోవా క్రైస్తవుల దేవుడికన్నా, ముస్లింలు లేదా హిందువుల దేవుడికనా భిన్నమైన వాడు కాదు. ఆ దేవుడు అందరికీ సమానమే. అద్వితీయుడే. వర్ణించనలవి కాని వాడే. కానీ యూదులు, దేవుడికి ఒక వ్యక్తిత్వం అంటగడ్తారు. ఆయనే తమ ప్రతి చర్యనూ సమర్థిస్తాడనుకుంటారు. అందువల్ల వారు నిస్సహాయులుగా ఉండిపోనక్కర్లేదు. నేను జర్మనీలో పుట్టి, అక్కడే నా జీవనోపాధి చూసుకున్నవాడిని అయి ఉంటే, జర్మనీ ఎంత శక్తిమంతమైంది అయినప్పటికీ జర్మనీయే నా దేశం అని గట్టిగా నినదించేవాడిని. సవాలుచేసేవాడిని. లేక నన్ను కాల్చేయమని లేదా చీకటి కూపంలో పడవేయమని కోరేవాడిని. కానీ బహిష్కరణను, వివక్షాపూరిత వ్యవహారాన్ని ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించే వాడిని కాదు. ఆ పని చేయడానికి తోటి యూదులకోసం ఎదురు చూడనక్కర్లేదు. చివరకు అందరూ నా దారికే వస్తారు అన్న విశ్వాసం ప్రదర్శించేవాడిని.

**పలస్తీనాలో యూదుల గురించి ఒక్క మాట**

వారు తప్పుడు దారిలో ప్రయాణిస్తున్నారనడానికి నాకు ఏ మాత్రం సందేహంలేదు. బైబిల్ భావన ప్రకారం పలస్తీనా అనేది భౌగోళికమైంది కాదు. అది వారి మనసుల్లో ఉంది. కానీ భౌగోళికంగా పలస్తీనా తమ దేశం అని యూదులు అనుకునేట్ట యితే బ్రిటిష్ వారి తుపాకీ నీడన ఆ పని చేయనక్కర్లేదు. మతపరమైన చర్యను తుపాకులు లేదా బాంబుల సహాయంతో చేయకూడదు. అరబ్బుల మన:పూర్వక సమ్మతితోనే వారు ఆ పనిచేయాలి. వారు అరబ్బుల హృదయాలను మార్చాలి.

అరబ్బుల హృదయాలపై రాజ్యమేలే దేవుడే యూదుల హృదయాలపైనా రాజ్యమేలుతాడు. తమ మతపరమైన ఆంకాంక్షల ఆధారంగా వారు ప్రపంచం అభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మార్చాలనుకుంటారు. అరబ్బులకు నచ్చచెప్పడానికి వందలాది మార్గాలున్నాయి. అయితే దీనికి వారు బ్రిటిష్‌వారి తుపాకీ నీడను విడనాడాలి. ఇప్పటికే ఏ పొరపాటు చేయని ప్రజలను బ్రిటిష్ వారితో కలిసి అరబ్బులను విపరీతంగా లూటీ చేశారు. అరబ్బుల అకృత్యాలను నేను సమర్థించడం లేదు. వారు తాము నమ్మిన దాని కోసం ప్రతిఘటించాలనుకుంటే అహింసామార్గాన్ని అనుసరించ వలసింది. తమ దేశాన్ని నిష్కారణంగా ఆక్రమించుకున్నారు అనుకున్నట్టయితే అహింసామార్గాన్ని ఎంచుకోవలసింది. అయితే తప్పొప్పులు అన్న సర్వజనామోదయోగ్యమైన భావనలకు అనుగుణంగా అనేక దురాగతాలను ఎదుర్కొన్న అరబ్బుల ప్రతిఘటనకు వ్యతిరేకంగా మాట్లాడలేం !. తాము దేవుడు నియమించిన వాళ్లం అని చెప్పుకునే యూదులు అహింసా మార్గాన్ని అనుసరించి ప్రపంచంలో తమస్థానం ఏమిటో నిరూపించుకోవాలి. దేవుడు తమను నియమించాడు అన్న అంశాన్ని రుజువు చేసుకోవాలి. పలస్తీనా సహా అన్ని దేశాలూ యూదులకు తమ దేశాలే. అయితే అది దురాక్రమణ ద్వారా కాకుండా, ప్రేమాభిమానాలు, సేవాభావం వల్ల సాధించింది అయి ఉండాలి. ఒక మిత్రుడు నాకు సిసిల్ రోత్ రాసిన మానవ నాగరికతకు యూదులు చేసిన దోహదం మీద ఒక గ్రంథం పంపించారు. ప్రపంచ సాహిత్యాన్ని, కళలను, సంగీతాన్ని, నాటకాన్ని, విజ్ఞాన శాస్త్రాన్ని, వైద్యాన్ని, వ్యవసాయాన్ని సుసంపన్నం చేయడానికి యూదులు ఏం చేశారో ఆ గ్రంథంలో ఉంది. వారికి సంకల్ప బలమే ఉంటే పశ్చిమ దేశాలు తమను వెలివేయడాన్ని అంగీకరించకూడదు. లేదా తమను అసహ్యించుకోవడాన్ని, మద్దతివ్వడాన్ని అంగీకరించకూడదు. దేవుడు నియమించిన వారే అయితే ప్రపంచం గుర్తింపు పొందడానికి ఎవరి ముందూ లొంగి ఉండవలసిన అవసరంలేదు. అహింసాయుతమార్గం ద్వారా తాము ఇంతకు ముందు చేసిన దానికన్నా మానవాళికి ఎక్కువచేసి చూపించవచ్చు. ❑

**(పలస్తీనా నడిగడ్డపై యూదులకు దేశం ఏర్పాటుచేయడానికి పదమూడేళ్లముందే 1935లో గాంధీజీ రాసిన వ్యాసం. బి.దివికుమార్ ప్రజా సాహితి)**

---

# దేశం కోసం ధర్మం కోసమా ట్రంప్‌నకు గులాంగిరి ?

**(14వ పేజీ తరువాయి)**

అమ్ముడుపోకుండా దేశాన్ని కాపాడాలి!! దేశ నాయకులు ఎవరి వెంట ఉన్నారో వారి వికాసమే చూసుకుంటున్నారు గనక- ఇక "సబ్ క సాత్! సబ్ క వికాస్!!" నినాదం మానెయండని చెప్పాలి! దేశం కోసం ధర్మం కోసం-ఇక చెప్పక తప్పదు - సరే, ఇప్పుడు ప్రపంచం యుద్ధంలో మునిగి ఉంది. ట్రంప్, నెతన్యాహూ దేశాధినేతలుగా కాకుండా, అంతర్జాతీయ గూండాలుగా వ్యవహరిస్తున్నారు. సార్వభౌమాధికారం గల ఇతర స్వతంత్ర దేశాల అంతర్గత విషయాలలో జోక్యం చేసుకుని దాడులు చేయడం ఏం న్యాయం ? ఇక, భారత్-ఇరాన్‌ల మధ్య సంబంధం వేల ఏళ్ల నాటిది. అన్నింటినీ పక్కకు నెట్టి తన స్వార్థ ప్రయోజనాల కోసం.. దేశాన్నీ, దేశ పౌరుల భవిష్యత్తును ట్రంప్‌కు నజరానాగా సమర్పించి, గులాంగిరి చేస్తున్న మోడీని చారిత్రక ఉత్తమ మూర్ఖ ప్రధానిగా గుర్తించినా పరవాలేదని అనుకుంటున్నారా మన దేశ పాలకులు ? ❑

# కార్పొరేట్ సంపదలో సామాన్యులకు భాగస్వామ్యం



- చలసాని వెంకటరామారావు

**భా**రతదేశ పన్నుల వ్యవస్థ (ప్రత్యక్ష, పరోక్ష పన్నులు, జి.ఎస్.టి.) ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చడం ద్వారా దేశ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, సామాజిక సంక్షేమాన్ని అందించడం, దేశ రక్షణ, ప్రజలకు విద్య, ఆరోగ్య సేవలు అందించడం, అత్యవసర, ఆపద కాలంలో ప్రజలను ఆదుకోవడం వంటి చర్యలకు ఉపయోగపడుతుంది. దేశంలో ఆర్థిక అసమానతలను అంతం చేయడం లక్ష్యంగా సంపన్న వర్గాలపై పన్నులు ఎక్కువగా విధించి పేద వర్గాలను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడంలో ఇది తోడ్పడుతుంది. భారతదేశ స్వాతంత్ర్యానంతరం ప్రణాళికాబద్ధమైన ఆర్థిక విధానం ద్వారా పంచవర్ష ప్రణాళికలను రూపొందించి వివిధ రంగాలలో అభి వృద్ధికి కృషి చేయటం జరిగింది. పన్నుల విధానం ద్వారా సేక రించిన నిధులతో దేశ రక్షణతోపాటు పలు రంగాలలో ప్రధానం గా పారిశ్రామిక, వ్యవసాయ రంగాలలో, మౌలిక వసతుల కల్పనలో, ప్రాజెక్టుల నిర్మాణంలో ఎంతో పురోగతిని సాధించాం. దీనివల్ల అసమానతలను తగ్గించే ప్రయత్నం సాగింది.

1991 ఆర్థిక సంస్కరణల తరువాత భారత ఆర్థిక వ్యవస్థలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. 1991 నాటికి భారతదేశంలో ఒకే ఒక్క బిలియనీరు ఉంటే మూడు దశాబ్దాల సంస్కరణల పుణ్యమా అని నేడు 162 మంది బిలియనీర్లు ఉద్భవించారు. అంటే సంస్కరణ ఫలితాలు కొద్ది మంది సంపన్నుల చేతులలోకి వెళ్లి దేశంలో ఆర్థిక అసమానతలు రోజు రోజుకు వృద్ధి చెందుతున్నాయి. ప్రభుత్వ విధానాలు సైతం సంపన్నులు మరింత సంపన్నులు కావటానికి తోడ్పడుతు న్నాయి. కార్పొరేట్ సంపద నిరంతరం పెరుగుతూనే ఉన్నది. ఈ పెరుగుదల ఆర్థిక వ్యవస్థలోని అన్ని వర్గాలకు సమానంగా పంపిణీ జరగక కొద్ది మంది పెట్టుబడిదారుల, సంపన్నుల జేబులలోకే చేరుతున్నది. దీనివల్ల సంపద కేంద్రీకరణ జరిగి అసమానతలకు దారి తీయటం, కొన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో జీవించటం జరుగుతున్నది. ఈ క్రమంలోనే కొన్ని కార్పొరేట్ గ్రూపులు అదాని, అంబానీ, టాటా వగైరాలు అపార సంపదకు అధిపతులుగా ఎదిగారు. ఒక్క అదానీ ఆదాయమే రోజుకు 1600 కోట్ల రూపాయలు ఉందంటే దీని తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. స్టాక్ మార్కెట్లు, కంపెనీల లాభాలు, పెట్టుబడులు, ప్రభుత్వ విధానాలు కార్పొరేట్ సామ్రాజ్యాల నిర్మాణానికి తోడ్పడుతున్నది. 2026 జనవరి నాటి తాజా లెక్కల ప్రకారం కార్పొరేట్ సంపద ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోగా, వేతన జీవులు, కార్మికులు, సాధారణ ప్రజలు చాలీచాలని ఆదాయాలతో కనీస అవసరాలు తీరక ఇబ్బందులకు గురవుతున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన ముఖేష్ అంబానీ కుటుంబం 9.6 లక్షల కోట్ల సంపదతో అగ్రస్థానంలో ఉంది. గౌతమ్ అదానీ కుటుంబం 8.2 లక్షల కోట్ల సంపదతో తరువాతి స్థానంలో ఉంది.

2026 నాటికి భారతదేశంలో కార్పొరేట్లపై ఎటువంటి సంపద పన్ను లేదు. 2015-16లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్పొరేట్లపై సంపద పన్ను రద్దు చేశారు. ఆదాయంపై అంటే లాభాలపై మాత్రమే వారు పన్ను చెల్లిస్తారు. పెట్టుబడుల ప్రోత్సాహం పేరుతో పన్నులు తగ్గించారు. దేశీయ కంపెనీలు ఎటువంటి రాయితీలు కోరకుంటే 22 శాతం పన్ను చెల్లించ వచ్చు. సర్‌ఛార్జీ, సెస్ కలిపి 25.17 శాతం మాత్రమే పన్ను ఉంటుంది. 2019 తర్వాత స్థాపించిన నూతన తయారీ కంపెనీలలో 15 శాతం మాత్రమే పన్ను వసూలు చేస్తారు. సర్‌ఛార్జీ, సెస్‌లతో కలిపి ఇది 17.16 శాతం మాత్రమే అవుతుంది. ఈ రాయితీలన్నీ పెట్టుబడుల ప్రోత్సాహం పేరుతో కల్పించినా పెట్టుబడులు మాత్రం నామమాత్రంగానే వచ్చి ప్రభుత్వ ఆదాయానికి తీవ్ర గండి ఏర్పడింది. ఎంతో లాభాలు గడిస్తున్న కార్పొరేట్ కంపెనీలు తమ లాభాలలో 2 శాతం సామాజిక బాధ్యతగా ప్రజా సంక్షేమానికి వినియోగించాల్సి ఉన్నా ఆచరణలో దానికి భిన్నంగా జరుగుతున్నది. 2015కు పూర్వం ఉన్న పాత విధానం ప్రకారం 400 కోట్ల రూపాయల లోపు టర్నోవరు ఉంటే 25 శాతం, ఆపైన ఉన్న వారు 30 శాతం పన్ను చెల్లించాల్సి ఉండేది. ఇతర పన్నులను కూడా కలిపితే కార్పొరేట్లు వారి ఆస్తులపై కాకుండా వారి లాభాలపైన గరిష్టంగా 25 శాతం నుండి 35 శాతం వరకు పన్నులు చెల్లించేవారు.

ఒకపక్కన కార్పొరేట్ శక్తుల ఆదాయం రోజుకు వేలకోట్ల రూపాయలు ఉంటే ఒక వ్యవసాయ కూలీ ఆదాయం సరాసరిన 33 రూపాయలు మాత్రమే వుంది. సగటు భారతీయ వ్యవసాయ కార్మికుని ఆస్తి మాత్రం రెండు లక్షల రూపాయలకు పరిమితమై వుంది. ఆకలి సూచీలో మన దేశం 121 దేశాలలో 107వ స్థానంలో ఉంది. చైనా, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్‌లు మనకన్నా మెరుగైన స్థాయిలో ఉన్నాయి. 80 ఏళ్ల స్వాతంత్ర్యం

తర్వాత నేటికీ మధ్యాహ్న భోజన పథకం ద్వారా పోషక విలువలను గ్రహించే స్థితిలో మన పిల్లలు ఉన్నారు. ఒకపక్కన సంపన్న దేశంగా ఎదుగుతున్నామని అంతర్జాతీయ వేదికలపై మన పాలకులు గప్పాలు కొట్టుకుంటున్నా వాస్తవ పరిస్థితులలో పేద దేశంగానే మనం మిగిలిపోయాం. సంపన్నుల వద్ద అపార సంపద పోగుపడటం అంటే శ్రమ శక్తి, దోపిడీకి గురవుతున్న దన్న మాటే. మనదేశంలో తాండవిస్తున్న ఈ దరిద్రానికి కారణం కార్పొరేట్లు, పాలక వర్గాలు మాత్రమే. ఇంత విస్తృతంగా లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ ఇంకా పని గంటలు పెంచాలని, కార్మికులు ఇంకా ఒళ్లు వంచి పనిచేయాలని కోరుతున్నారు. కార్మికులకు చట్టపరమైన రక్షణ తగ్గించాలని, అందుకు ఇప్పుడు వున్న కార్మిక చట్టాలను మార్చాలని ఒత్తిడి చేస్తున్నారు. కార్పోరేట్ల ఒత్తిడి ఫలితంగా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ నాలుగు ట్రిలియన్ డాలర్ల నుండి 16 ట్రిలియన్ డాలర్లవైపు పయనిస్తున్నదని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు కార్పొరేట్ బాండ్ మార్కెట్ 2024 ఆర్థిక సంవత్సరంలో 43 లక్షల కోట్లు ఉండగా అది 2030 నాటికి 100-120 లక్షల కోట్ల వరకు పెరుగుతుందని అంచనా ఉన్నా వారికి వేసే పన్నులు గణనీయంగా తగ్గిస్తున్నారు. 2024 ఆర్థిక సంవత్సరం నాటికి 53.4 శాతానికి వ్యక్తిగత ఆదాయపు పన్ను పెరిగితే, అదే సమయంలో కార్పొరేట్ పన్నులు 61.9 శాతం నుంచి 46.6 శాతానికి తగ్గాయి. మొత్తం దేశ జనాభాలోని 10 శాతం పైభాగం వారి వద్ద 77 శాతం సంపద పోగుపడింది. ఆక్స్ ఫాం నివేదిక ప్రకారం 2017లో సృష్టించిన 73 శాతం సంపద ఒక శాతం ఉన్న అత్యంత సంపన్నుల చేతికి చేరింది. ప్రపంచంలో కటిక పేదవారైన 670 మిలియన్ ప్రజలలో సగం మంది సంపదలో కేవలం ఒక శాతం పెరుగుదల మాత్రమే కనిపిస్తున్నది. భారత రిజర్వ్ బ్యాంక్ నివేదిక ప్రకారం దేశంలో కార్పొరేట్ పన్నులను అధిగమించి వ్యక్తిగత పన్నులు అధికంగా వసూలు చేయబడుతున్నాయి. కానీ 2020-21లో 2.5 ట్రిలియన్ రూపాయలుగా ఉన్న కంపెనీల లాభాలు 2024-25 నాటికి 7.1 ట్రిలియన్ రూపాయలకు పెరిగింది. అయినా జి.డి.పి. వృద్ధి మందగించి 2024-25లో 6.5 శాతానికి పడిపోయింది.

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ కాలంలో 35 శాతం కార్పొరేట్ పన్ను ఉండేది. మోదీ హయాంలో 2019 సెప్టెంబరు నుంచి 25.17 శాతానికి తగ్గించి రాయితీ కల్పించారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు 1.45 లక్షల కోట్లు పన్ను వసూలు నష్టం జరిగింది. కార్పొరేట్లు మాత్రం లాభాలతో సంబరాలు చేసుకున్నారు. 70 శాతం దేశ సంపద తమ చేతుల్లో పెట్టుకున్న కార్పోరేట్లు కేవలం 30 శాతం పన్నులు మాత్రమే చెల్లిస్తున్నారు. మిగిలిన 70 శాతం పన్నులు ప్రజలు చెల్లిస్తున్నారు. అయినా ప్రభుత్వం గత పదేళ్లుగా కార్పొరేట్లకు 16 లక్షల కోట్లు బ్యాంకుల నుంచి రుణమాఫీ చేయించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా వారికి ధారాదత్తం చేశారు. ఇదే "కాకులను గొట్టి గ్రద్దకు పెట్టడం" అంటే. భారతదేశంలో మొదటిసారి మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో కంపెనీలపై సూపర్‌టాక్స్ పేరుతో పన్నులు విధించారు. అప్పటి నుంచి క్రమానుగతంగా పన్నుల విలువ పెంచారు. కానీ గత దశాబ్ద కాలంగా కార్పొరేట్ల సేవలో తరిస్తున్న మోదీ ప్రభుత్వం పన్నులను తగ్గిస్తున్నది. 2025లో పన్నుల తగ్గింపు వల్ల లక్ష కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. భారతదేశంలో ఆదాయపు పన్ను, సంపద పన్ను, బహుమతి పన్ను, సర్వీస్ టాక్స్, క్యాపిటల్ గెయిన్స్ పన్ను, సెక్యూరిటీ ట్రాన్సాక్షన్‌పై పన్ను, కార్పొరేట్ పన్నులను ప్రత్యక్ష పన్నులుగా వసూలు చేస్తున్నారు. ఇంకా అనేక రూపాలలో పరోక్ష పన్నులు, ఇతరేతర పన్నుల రూపంలో ప్రభుత్వం ఆదాయం గడిస్తున్నది. కానీ పాలకుల అసంబద్ధ విధానాల వల్ల జాతీయ ఆదాయాన్ని ఎంతో కోల్పోతుంది. పన్నుల పేరుతో సామాన్యులను వేధించే పాలకులు బడా కార్పొరేట్లు వేల కోట్ల ఎగవేతకు పాల్పడినా, బ్యాంకులను మోసగించి విదేశాలకు పారిపోయినా మిన్నకుంటున్నది. దీనివల్ల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కుంటుపడిపోతున్నది. దీనితో సంక్షేమ పథకాల అమలు కోసం ప్రభుత్వాలు సైతం అప్పులు చేస్తున్నాయి. వేల కోట్ల రూపా యలు ప్రతి సంవత్సరం విదేశీ సంస్థలకు వడ్డీల రూపంలో చెల్లిస్తూ ప్రజావసరాలను, మౌలిక సౌకర్యాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. అనేక ప్రభుత్వ పథకాలు నిధులు లేక మూలన పెడుతున్నారు. అందువలన ప్రభుత్వం పన్నులు తగ్గించి, పేద, మధ్యతరగతి ప్రజలపై పన్నులు పెంచే విధానాన్ని మానుకోవాలి. కార్పొరేట్ పన్నులను గతంలోని స్థాయికి తీసు కు వెళ్లి అదనంగా సమకూరే నిధులను పేదల సంక్షేమానికి వినియోగించాలి. కార్పొరేట్‌లు అపార లాభాలను ఆర్జిస్తున్నా వారికి విస్తృతంగా రాయితీలు కల్పించడం, వారికి వ్యవసాయ యోగ్యమైన సారవంతమైన భూములు కట్టబెట్టడం సమంజసం కాదు. ఈ అసంబద్ధ విధానాలను పాలకులు మార్చుకోకపోతే ప్రజా ప్రతిఘటనను ఎదుర్కోవలసి వస్తుంది. ప్రజాగ్రహం ముందు ఎంతటి బలవంతులైనా తల వంచవలసిందే. మన దేశంలో పరిస్థితులు ఇలా ఉంటే 2026 జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా 400 మంది ప్రపంచ అత్యంత సంపన్నులు 24 దేశాలకు చెందిన వారు 'టైమ్ టు విన్' పేరుతో తమపైన భారీగా పన్నులు విధించాలని డిమాండ్ చేశారు. సూపర్ రిచ్ - మిగిలిన మానవాళి మధ్య పెరుగుతున్న అంతరం వల్ల ప్రపంచం అగాధంలోకి వెళుతున్నదని, **(మిగతా 34వ పేజీలో)**

# సన్నగిల్లుతున్న సామాజిక న్యాయం



- దడాల సుబ్బారావు

నేడు అంతర్జాతీయ సామాజిక న్యాయ దినం. ప్రపంచవ్యాప్తంగా జరపాలని ఐక్యరాజ్యసమితి పిలుపు. 2007 నవంబర్ 26వ తేదీన ఐరాస అంతర్జాతీయ సామాజిక దినం నిర్వహించాలని తీర్మానించగా 2009 నుంచి పాటించడం జరుగుతున్నది. అంతర్జాతీయంగా వివిధ దేశాల మధ్య సంఘీభావం నెలకొల్పడం, సామరస్య వాతావరణం సాధించడం, వివిధ దేశాల మధ్య సమాన ప్రాతిపదికపై సంబం ధాలు నెలకొల్పడం ప్రపంచ సామాజిక న్యాయదినం లక్ష్యం. ఐరాస ప్రకటనలో ఆర్థికాభివృద్ధి అనేది అంతరం పెంచకుండా ఉండాలని, సామాజిక న్యాయ సాధనకు దోహదపడాలని పేర్కొన్నారు. "సమాజం అందరిది" అని ప్రకటించి కొందరికి మాత్రం ఆధిపత్యం ఉండకూడదు. పౌరులందరికీ ఎటువంటి వివక్షత చూపకుండా సామాజిక న్యాయం కల్పించాలి.

ఐరాస ప్రకటన ఆధారంగా అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) సామాజిక న్యాయం అమలుకై కార్మికవర్గం పట్ల అనుసరించవలసిన పద్ధతుల గూర్చి చర్చించింది. ప్రపంచీకరణ అమలవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికవర్గం తన హక్కులు కాపాడుకోవడం కోసం పాటు పడాలని చెప్పింది. ప్రాథమిక అంశాలైన విలువలు, స్వేచ్ఛ, వ్యక్తి గౌరవం, భద్రత, ఆర్థిక సామాజిక పురోభివృద్ధి విషయంలో ఎటువంటి వివక్షత పాటించకుండా సామాజిక న్యాయం అమలయ్యేలా చూడాలని పేర్కొన్నది. దీని అమలుకు ప్రభుత్వం, యాజమాన్యం, కార్మిక సంఘాలు నిరంతరం కృషి చేయాలని 2008 జూన్ 10న 182 మంది సభ్యులతో సమావేశమైన ఐఎల్ఓ విధాన పత్రాన్ని ఆమోదించింది. ఐఎల్ఓ 1999 నుంచి కార్మికవర్గం పని పరిస్థితులపై కొన్ని లక్ష్యాలను నిర్దేశించింది. ప్రపంచీకరణ వేగంగా అమలవుతున్న ఈ స్థితిలో అనుసరించవలసిన పద్ధతుల గూర్చి చర్చించింది. రోజురోజుకూ పరిశ్రమల్లో ఆధునిక యంత్రాలు ప్రవేశపెట్టడం, కంప్యూటరైజేషన్ చేయడం వల్ల వస్తున్న ఇబ్బందులపై చర్చించింది. వస్తు సేవల వినియోగం, పెట్టుబడి వేగంగా చలామణి అవుతున్న పరిస్థితుల్లో శ్రామిక మహిళల, కార్మికుల శ్రమపై పెరుగుతున్న ఒత్తిడి గూర్చి చర్చించింది. రోజు రోజుకు ఆర్థిక అసమానతలు పెరుగుతూనే ఉన్నాయి. పెరుగుతున్న నిరుద్యోగాన్ని అరికట్టడం, పేదరిక నిర్మూలన పట్ల వివిధ దేశాలు తీసుకోవాల్సిన చర్యల గూర్చి ఈ సమావేశం చర్చించింది. 1998లో ఐఎల్ఓలో జరిగిన చర్చల్లో కార్మికుల హక్కులు, వాటి అమలు గూర్చి చర్చించింది. కార్మికుణ్ణి సరుకుగా చూడకూడదని, పెరుగుతున్న పేదరికం ప్రగతికి అవరోధంగా మారుతున్నని చెప్పింది. ఇదే సమావేశంలో కార్మికులు సమావేశాలు నిర్వ హించుకునే హక్కు, సమిష్టి బేరసారాల హక్కు, నిర్బంధంగా కార్మికులతో పనిచేయిం చడం పట్ల వ్యతిరేకత, బాల కార్మికులు పనిచేయకుండా నిషేధం, శ్రమను గౌరవించడం మొదలగు హక్కులను కాపాడాలని తీర్మానించింది. అంతేగాక లింగ వివక్షత లేకుండా చూడడం, స్వదేశంలోని పౌరులకు హక్కుల అమలు, వలస కార్మికులు, ప్రజల మధ్య తేడా లేకుండా చూడాలని ఇది పేర్కొన్నది. ఐరాస స్త్రీ పురుష వివక్షను తీవ్రంగా నిరసించింది. వయస్సు, జాతి, మతం, సంస్కృతి విషయాల్లో వివక్ష చూపకూడదని పేర్కొన్నది. సంఘీభావం, సామరస్యం, సమానత్వం ఆధారంగా వివిధ దేశాల మధ్య సంబంధం నెలకొల్పాలని సూచించింది. ఐరాస, ఐఎల్ఓ ప్రకటనలు చూస్తే సామాజిక న్యాయం అమలవుతున్నట్లుగా, కార్మిక సమస్యలన్నీ పరిష్కారమై మరే సమస్యలు లేనట్లుగా కనిపిస్తుంది. అంతేగాకుండా ప్రపంచ దేశాల మధ్య సామరస్య వాతావరణం ఏర్పడినట్లుగా కనిపిస్తుంది. కానీ వాస్తవం ఏమిటి? ప్రకటనలకు, ఆచరణకు మధ్య ఆమడదూరం ఉంది. ఐరాస సూచనలు గానీ, ఐఎల్ఓ సూచనలు గానీ ఏ దేశం తీవ్రంగా పట్టించుకోవడం లేదు. ప్రపంచీకరణ వివిధ దేశాల్లో వేగంగా అమలవుతున్నది. దీనివల్ల కార్మికులు అనేక విధాలుగా కష్టాల పాలౌతున్నారు. యాంత్రీకరణ పెరగడం వల్ల ఉపాధి కోల్పోతున్నారు. పర్మినెంటు ఉద్యోగాల స్థానంలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు పెరిగిపోతున్నాయి. పని పరిస్థితులు మాత్రం దుర్భరంగా తయారవుతున్నాయి. వేతనాలు పెరుగడం లేదు. నిరంతరం పెరుగుతున్న ధరల కోరల్లో కార్మికులు, సామాన్య ప్రజలు చిక్కుకుపోతున్నారు. పెరుగుతున్న నిరుద్యోగంతోపాటు కార్మికుల జీవన ప్రమాణాలు క్షీణించిపోతున్నాయి. ఈ స్థితిలో సామాజిక న్యాయం ఏవిధంగా అమలవుతుంది. సామాజిక న్యాయం అమలుకు ఎవరు బాధ్యత తీసుకోవాలి ? ఐరాస, ఐఎల్ఓ సూచనలు చేస్తాయి తప్ప అమలు చేయని దేశాలపై చర్య తీసుకునే అధికారం వీటికి లేదు. బాల కార్మికులతో పని

చేయించరాదనే చట్టం నేటికీ మన దేశంలో అమలు కావడం లేదు. చట్టం చేసిన ప్రజాప్రతినిధులే తమ గృహాలు, పొలాలు, పరిశ్రమల్లో బాల కార్మికులతో పని చేయిస్తున్నారు. పిల్లలతో నిర్బంధంగా పనిచేయిస్తూ, వెట్టి చాకిరీ చేయిస్తూ సరిగ్గా పని చేయలేదనే నెపంతో పిల్లలను చిత్ర హింసలపాలు చేస్తున్న అనేక ఘటనలు ప్రతి రోజూ చూస్తూనే ఉన్నాం. మన దేశంలో పద్నాలుగు సంవత్సరాల పిల్లలకు నిర్బంధ ఉచిత విద్య అమలు చేయాలని చట్టం ఉంది. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ చట్టాన్ని అమలు చేయాలనే చిత్తశుద్ధి లోపించింది. నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్య మనం నెరిపినట్లయితే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలింపబడుతుంది కదా! అప్పుడు కొంత వరకు సామాజిక న్యాయం అమలవుతుంది. మరి దీనికి చర్యలేవి? “సమాజం అందరిదీ” అని చెప్పడం అంటే సమాజం కొందరికి మాత్రమే సంబంధించినది కాదు అని. పౌరులందరి పట్ల ఎటువంటి వివక్షా చూపకూడదని సామాజిక న్యాయం అమలులో ఒక సూత్రంగా ఐరాస పేర్కొన్నది. పౌరుల పట్ల లింగ వివక్ష, జాతి, మత విభేదాలు చూపకుండా ఉండాలని, ప్రజల సంస్కృతిని గౌరవించాలని సామాజిక న్యాయ సూత్రాలలో పేర్కొన్నారు. కానీ ఈ సూత్రాలు ఘోరంగా ఉల్లంఘించబడుతున్నాయి. ఇటీవల మన దేశంలో జరుగుతున్న పరిణామాలు సామాజిక న్యాయ సూత్రాలను దిక్కరించడమే కాక వెక్కిరించే విధంగా మతోన్మాద శక్తులు ప్రవర్తిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి పేర్కొన్న విధంగా మన దేశంలో సామాజిక న్యాయం అమలు కావాలంటే ఏ కులమైనా, ఏ మతమైనా పరస్పరం సోదర భావంతో మెలగాలి. దీనినే మన దేశంలో భిన్నత్వంలో ఏకత్వం అని పిలుస్తున్నాము.

ఆరెస్సెస్ నాయకత్వంలోని బిజెపి, ఎన్డీఏ కూటమి ఢిల్లీ గద్దె మీద అధిష్టించిన తరువాత కుల ఘర్షణలు, మత ఘర్షణలు విపరీతంగా పెచ్చరిల్లుతున్నాయి. ప్రపంచమంతా గ్లోబలైజేషన్ అమలులో భాగంగా శాస్త్ర విజ్ఞానం వైపు పరుగులు పెడుతుంటే మన దేశంలో ఆరెస్సెస్, బిజెపి మతోన్మాదాన్ని తలకెత్తుకున్నాయి. దభోల్కర్, పన్సారే, కల్బుర్గి లాంటి హేతువాద, అభ్యుదయ సాహితీవేత్తలను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు. అంతేకాదు విజ్ఞానానికి నిలయమైన విశ్వ విద్యాలయాల్లో మతోన్మాద చర్యలతో అల్లకల్లోలం సృష్టిస్తున్నారు. మొన్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఏబివిపి, కేంద్ర మంత్రులు బండారు దత్తాత్రేయ, స్మృతి ఇరానీ చర్యల వల్ల రీసెర్చ్ స్కాలర్ వేముల రోహిత్ ఆత్మహత్య చేసుకున్నాడు. నిన్న ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఏబివిపి, ఆరెస్సెస్ గూండాలు సృష్టించిన విధ్వంసం వల్ల నేడు విద్యార్థి లోకం అలజడితో హోరెత్తుతున్నది. మరోపక్క ఆరెస్సెస్ మైనార్టీ మతస్తులైన ముస్లిం, క్రైస్తవ సోదరులపై అరాచకంగా దాడులు చేస్తూ ప్రాణాలు బలిగొంటోంది. ఇటువంటి చర్యలను ఖండిస్తున్న లౌకిక వాదులను, అభ్యుదయ వాదులను పాకిస్థాన్ ఏజెంట్లుగా చిత్రీకరించి వారిపై దాడులకు ఉసిగొల్పుతున్నారు. ఈ విధంగా దేశంలో మత ఉద్రిక్తతలను సృష్టిస్తున్న అరాచక పాలనలో సామాజిక న్యాయం అమలౌతుందా?

దేశంలో నేటికీ అట్టడుగు కులాలైన దళితులు అగ్ర కులాలతో సమానంగా హక్కులను అనుభవించలేక పోతున్నారు. రాజ్యాంగంలో ఎటువంటి వివక్షా పౌరుల పట్ల చూపరాదని పేర్కొన్నా నేడు బిజెపి ప్రభుత్వం దళితుల పట్ల వివక్షత ప్రదర్శిస్తూనే ఉన్నది. దళిత స్త్రీలపై అత్యాచారం చేసి హత్య చేయడం, దళితులపై దాడులు చేసి చంపేయడం రోజూ జరుగుతూనే ఉన్నది. 2014లో దళితులపై దాడులు దాదాపు 45 వేలకుపైగా జరిగాయంటే దళితుల పరిస్థితి ఎంత హీనంగా ఉందో అర్థమౌతుంది. ఒక మనిషిని మరొక మనిషి సమానంగా చూడలేని దౌర్భాగ్య పరిస్థితి ఉన్న మన దేశంలో సామాజిక న్యాయం అమలవుతుందని ఆశించడం అత్యాశే అవుతుంది. లింగ బేధం చూపరాదని, మహిళల పట్ల గౌరవ భావంతో మెలగాలని, మహిళా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఒక పక్క ఐరాస, మరో పక్క ఐఎల్ఓ పదేపదే ఘోషిస్తున్నాయి. మన దేశంలో బిజెపి పాలకులు స్త్రీని పూజించాలని, గౌరవించాలని చెబుతూనే ఇతర మత స్త్రీలపై అతి కర్కశంగా దాడులు, అత్యాచారాలను ప్రోత్సహి స్తున్నారు. స్త్రీల వస్త్ర ధారణపై దాడులు చేస్తూ కిరాతక మూకలు చేస్తున్న అత్యాచారాలకు స్త్రీల వస్త్రధారణే కారణమంటూ స్త్రీని ముద్దాయిగా చూపెడుతున్నారు. ఒక పక్క స్త్రీని దేవతగా కీర్తిస్తూ మరో పక్క ఇతర మత స్త్రీలను కించపరుస్తూ హీనంగా చిత్రీకరిస్తున్నారు.

ఇటువంటి ముష్కరుల పాలనలో సామాజిక న్యాయం అమలౌతుందా? స్త్రీలకు రక్షణ దొరుకుతుందా? ప్రపంచ సామాజిక న్యాయం దినోత్సవం సందర్భంగా ఐరాస, ఐఎల్ఓ చేసిన ప్రకటనలు, తీర్మానాలు మన దేశంలో అమలు కావాలంటే మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోరుకునే శక్తులందరినీ విశాల ఐక్య ప్రాతిపదికపై సమీకరించవలసి ఉంది. భావ ప్రకటనా స్వేచ్ఛ, వ్యక్తి స్వాతంత్ర్యం పరిరక్షింపబడినప్పుడే సామాజిక న్యాయం కొంతవరకైనా అమలవుతుంది. అందు కోసం మనమందరం పాటుపడాలి. మతోన్మాద, విచ్ఛిన్నకర శక్తుల కు వ్యతిరేకంగా మత సామరస్యం, జాతి సమైక్యత కాపాడు కోవడం సామాజిక న్యాయ సాధనలో ఒక భాగమే. ❑

# ప్రజాస్వామ్యం-సామాజిక న్యాయం



- లలితానంద ప్రసాద్

ఇవి రెండు జంట పదాలు. ఒక దాని అస్తిత్వం మరో దానిపై ఆధారపడి ఉంటుంది. ఇవి పరస్పర ఆధారాలు. అనుసంధానాలు. ప్రభావితలు. రెండోది మొదటి దానికి గుండె కాయ. ఎక్కడైనా గుండె కాయ సరైన ఉండాల్సిన రీతిలో లేకుంటే ఆ ప్రజాస్వామ్యానికి అంతం సమీపించి ప్రేత కళ ఆవరించినట్లు అవుతుంది. ఆధునిక పాలనా పద్ధతులలో అత్యుత్తమమైనదిగా భావించే ప్రజాస్వామ్యం ఊపిరి అంతా అక్కడ నెలకొన్న సామాజిక న్యాయంపైన ఆధారపడి ఉంటుంది. మిగతావన్నీ ఎన్ని ఎంతగా ఉన్నా దీనికి సాటిరావు. సాధారణంగా వివిధ మాధ్యమాల ద్వారా సామాజిక న్యాయం సంబంధించి ఆర్థిక కోణాలలో పలు రూపాల సమాచారం లభిస్తుంది. అది తప్పనిసరిగా ఎంతో ఆవశ్యకత కలిగినది. వాటితోపాటు ఇతర అంశాలని తగినంత పరిగణలోకి తీసుకునే ప్రయత్నం ఈ వ్యాసం.

ప్రజాస్వామ్య పునాదులుగా అందరూ అభివర్ణించే 'సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వాలు' అన్నీ ఈ సామాజిక న్యాయం ద్వారానే లభిస్తాయి. లాభిస్తాయి. అందరికీ అందుబాటులోకి వస్తాయి. ఈ మూడింటిలో ఏ ఒకటి సాధించాలన్న లేక మూడు సంయుక్తంగా సాధించి ప్రజాస్వామ్యం పరిణత స్థాయిలో పరిఢవిల్లాలన్నా అందుకు సామాజిక న్యాయం తప్పనిసరి. ప్రజాస్వామ్యంలో సామాజిక న్యాయం అంతటి కీలక మౌలిక స్థానం కలిగి ఉన్నది. సామాజిక న్యాయం అంటే ఎక్కడైనా ఆ దేశ పౌరుల మధ్య పరస్పరం ఎలాంటి వివక్షత లేకుండా ఉండటం. అది వ్యక్తిగతంగాను, సామాజికంగాను, వ్యవస్థగతంగాను, ప్రభుత్వపరంగా, మనిషికి మనిషికి మధ్య, ఎలాంటి వివక్షత అది జాతి, కుల, మత, ప్రాంత, వర్ణ, వర్గ, ఉన్నత/నిమ్న, భాష, లింగ, తెగల వగైరా పేర్లతో, వీటిలో ఏ ఒకటి లేక ఏ కొన్ని నెలకొన్నా అక్కడ సమానత్వం ఉండదు. ఆధిపత్యం వివిధ రూపాల రాజ్యం ఏలుతుంది. ఇది సమానత్వాన్ని సమాధి చేస్తుంది. అక్కడ 'సమానత్వం' అనేది కేవలం ఒకే ఒక 'ఓటు' విలువకు సంబంధించి తప్ప మరి ఎక్కడ ఎందులోనూ ఉండదు. కనిపించదు. ఎప్పుడైతే సమానత్వం కొరవడి మనుషులు రెండుగా విడిపోయి పెత్తనం చెలాయించే వారుగా కొందరు దానికి బలి పశువులయ్యే వారుగా మరికొందరు ఉంటున్న అవాంఛిత పరిస్థితులలో ఇక వారికి స్వేచ్ఛ ఎక్కడిది? బ్రతికినంత కాలం ఇక అట్టడుగు వారంతా బిక్కుబిక్కుమంటూ బ్రతకాల్సిందే. స్వేచ్ఛకు సంబంధించి సుప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్త నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ మాటలు స్మరణకు వస్తాయి. వారి ప్రకారం ఎన్ని లోపాలున్నా అత్యంత నాగరిక పాలనా విధానం ప్రజాస్వామ్యం మాత్రమే. గత కొన్ని సంవత్సరాలుగా ఇది ఎంత వాస్తవమో వారి స్వానుభవంలోనే యావత్ భారతానికి గాక ప్రపంచాన్ని అంతటికి వెల్లడయ్యింది. అలాంటి దుర్భర పరిస్థితులలో ఇక సౌభ్రాతృత్వం అనేది కనీసం ఊహించడానికి అయిన ఆస్కారం ఎక్కడిది ? పైగా వ్యక్తిగతంగా పూర్తిగా కుటుంబానికి పరిమితం అవ్వాల్సిన నమ్మకాలు, విశ్వాసాలు, వాటి తాలూకు బహు క్రతువులు విను వీధుల్లోకి ఎగబడి తెగబడి విరగబడి కరాల నృత్యం చేస్తూ ఉంటే ఇక సౌభ్రాతృత్వానికి ఊపిరి ఆడేది ఎక్కడ ?

అసలు ఈ చరాచర జగత్తులో ఈ 'వివక్షత' తన సొంత జాతికి చెందిన వారిపై చూపటం కేవలం మనిషికే సాధ్యం. రకరకాల పేర్లతో, రూపాలతో, సాటి మనిషి పట్ల రాగ ద్వేషాలతో, సమస్త మానవ నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చి, మేధో వికాసాన్ని మంట కలిపి, నాగరికతను నగుబాటు చేయటం కేవలం విజ్ఞాన ఖనిజం మానవునికే సాధ్యమైంది. అత్యంత సూక్ష్మ క్రిములు నుండి అతిపెద్ద హిప్పోపోటామస్, ఏనుగుల వరకు ఏ ఒక్కటైనా తనకు చెందిన సహ ప్రాణిపై ఇంతగా మనిషిలాగా వివక్షత చూపిస్తున్నాయా? ఎంతో భయంకరమైనవి క్రూరమైనవిగా భావించే వాటికి లేని ఈ వివక్షత ఎంతో మేధావంతుల మనీ విర్ర వీగే మనిషికి ఎందుకు ఉండాలి ? ఎవరు ఎక్కడ ఏ రూపంలో వివక్షత పాటించిన వారు వాటికన్నా హీనులమని మర్చిపోరాదు. వారిని చూసి వన్య మృగాలు, పశుపక్ష్యాదులు, క్రిమి కీటకాలు, జలచరాలు సిగ్గుపడటంలో తప్పులేదు. అందుకు వాటిని తప్పు పట్టలేము.

ప్రాథమిక అంశాలను కొన్నిటిని సునిశితంగా పరిశీలిస్తే సామాజిక న్యాయ రాహిత్యానికి కారణమైన వివక్షతకు ఆస్కారం కనిపించదు. ఎవరి పుట్టుక వారి చేతుల్లో ఉండదు. అందరూ సాధారణంగానే జన్మిస్తారు. వారి వారి కుటుంబం నేపథ్యం వాతావరణం అనుగుణంగా, వనరులు అవకాశాలు వగైరా కారణంగా పైకొచ్చి రాణిస్తారు. కొందరికి అందుకు విరుద్ధమైన పరిస్థితులు ఉండటంలో ఆశ్చర్యం లేదు. నిజమైన సామాజిక న్యాయం అంటే విరుద్ధ, అననుకూల పరిస్థితులను కూడా సానుకూల పరిచి అందరికీ అవకాశాలు సమంగా ఉండేటట్లు చూడటం. తద్వారా సమస్త వనరులు అందరికీ అందుబాటు

లోకి తీసుకురావటం. ఆయా స్థల కాలాలలో నెలకొన్న అటు వంటి రాజకీయ, సాంస్కృతిక, సాంకేతిక, చారిత్రక, శాస్త్రీయ కారణాలతోపాటు అక్కడి వ్యవస్థల/నాయకత్వ/మేధావుల నైతికత ప్రమాణాలు/ ఆచరణలపై అక్కడి సామాజిక న్యాయ ప్రమాణాలు ఆధారపడి ఉంటాయి. వీటన్నిటిని సానుకూల/ ప్రతికులాలతో అధిగమించి మనిషి అంతిమంగా గమ్యం చేరుతాడు. అన్ని విడిచి అందరిలాగే నిష్క్రమిస్తాడు. ఈ మధ్యకాలంలో ఎవరు ఏ రీతిలో తమ తమ విలువైన కాలాన్ని, జ్ఞానాన్ని, శ్రమను, సంపద ను తమ కుటుంబంతోపాటు పరుల కొరకు వినియోగిస్తారనే దానిపై వారి జీవన సార్థకత ఆధారపడి ఉంటుంది.

ఇక్కడ గమనించాల్సింది ఒక్క రాకపోకల విషయంలోనే కాక అనేక ఇతర విషయాలలోను అందరికీ సామ్యం ఉంది అన్ని వేళల్లో, అన్ని కాలాల్లో, అన్ని ప్రాంతాల్లో. అవి బాహ్య అంతర శారీరక నిర్మాణం, వివిధ ప్రక్రియలు, రసాయనాల సమ్మేళనం, ధర్మాలు, లక్షణాలు. ప్రకృతి ప్రసాదించిన వనరులు. అందుబాటులోని కాలం. భావోద్వేగాలు ఉద్భవించే మూలాలు. వాటి ప్రదర్శన, సృజనాత్మక సామర్థ్యం, ప్రతిస్పందనలు, రసాస్వాదనలు. ఇవన్నీ అందరిలో వివిధ స్థాయిలో ఉంటాయి. వాటి వినియోగంలో కొందరు రాణిస్తారు మరి కొందరు రాణించకపోవచ్చు. అంతమాత్రం చేత ఒకరు మరొకరి కన్నా ఎలా అధికులు అవుతారు ? ఇంకొందరు అల్పులు అవుతారు? ఈ ఆధిక్యత భావనే కొందరిలో అహంకారానికి/ అభిజాత్యా యానికి దారితీస్తుంది. అదే సందర్భంలో రెండవ వారిలో ఆత్మన్యూనత భావానికి బాటలు వేస్తుంది. వీటికి అతీతంగా మానవీయ సమభావం సమధర్మం సహజీవనం ఆశయంగా ఆదర్శంగా 'అందరం సమానం' అని జ్ఞానాన్ని బాలలకు చిన్నప్పటి నుంచి కలిగించగలిగితే కొంతకాలానికి అయినా ఎంతగానో పాతుకుపోయినట్టు కనిపిస్తున్న ఈ ఆధిక్యత, ఆత్మన్యూనతా భావాలకు స్వస్తి పలకవచ్చు. ఉత్తరోత్తర అది నిదానంగానైనా సామాజిక న్యాయానికి పరిణత ప్రజాస్వామ్యా నికి దారితీస్తుంది.

సామాజిక న్యాయం సాధించాలంటే బాహ్య సృజనాత్మక విధానాలతోపాటు వ్యక్తిగతంగాను 'సహనం' అనే సంస్కృతి అల వాడాలి. హింస హింసను ప్రేరేపించిన విధంగా విద్వేషం విద్వేషాన్ని ప్రేరేపిస్తుంది అని మరచిపోరాదు. అది అంతిమంగా ప్రతీకారానికి దారితీస్తుంది. అంతిమంగా పరస్పర హననం జరుగుతుంది. ఇది ఎవరికీ ఎన్నటికీ శ్రేయస్కరం కాదు. సర్వత్రా సమభావం సమధర్మం, సహ జీవనం నెలకొల్పటానికి అనువైన వాతావరణం కొరకు ఎలాంటి వివక్షతకు తావివ్వని వికాస వంతమైన వ్యక్తిత్వ నిర్మాణం కలిగి ఉండాలి. తమ పరిసరాలలో ప్రత్యక్ష, పరోక్ష సంబంధితులందరూ అందుకు ఎల్లవేళలా పూనుకుని ప్రయత్నించాలి. సామాజిక న్యాయం అనేది ఎల్లవేళలా సర్వకాల, సార్వజనీన మానవీయ లక్షణాలైన దయ, ప్రేమ, కరుణ, సేవ, త్యాగం, నైతికత వంటి మహోన్నత మానవీయ గుణాల్ని అంతకంతకు పెంపొందించేదిగా ఉండాలి. అది సర్వకాల సర్వావస్థలలో బాధితుల పట్ల, దుఃఖితుల పట్ల, అవ్యక్త వేదనా పరుల పట్ల, అనగారిని వారి పట్ల సంపూర్ణ బాధ్యత వహించగలిగేదై ఉండాలి. ఆ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చ గలిగే శక్తి సామర్థ్యాలతోపాటు చిత్తశుద్ధి కలిగి ఉండాలి.

రాజ్యాంగం ద్వారా ఏర్పాటైన ప్రభుత్వాలే ఆ రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన న్యాయవ్యవస్థపై జులుం ప్రదర్శించటం వలన ఇక ఈ దేశంలో దేనికైనా ఎవరికైనా ఏ ఆపద వచ్చినా ఎవరికి మొర పెట్టుకోవాలో తెలియని దుస్థితి నెలకొని ఉంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తి బదిలీ విషయంలో, అనేక సందర్భాల్లో ఇది స్పష్టమైంది. రాజ్యాంగం ప్రసాదించిన నిష్పాక్షిక సర్వాధికారాలు తుంగలో తొక్కి తమ స్వీయ ప్రతిష్టను ఫణంగా పెట్టి ఎన్నికల సంఘ నిర్మాణాన్ని, ఎన్నికల ప్రక్రియను ఎంతగా ఆబాసుపాలు చేసినా/చేస్తున్న ఎన్నికల కమిషన్ ఉన్న దేశంలో సామాజిక న్యాయం ఎలా సాధించాలి? కాపాడాలి? రక్షించాలి? ఎల్లప్పుడు ప్రజల పక్షాన స్థిరంగా నిలబడి అణగారిన ప్రజా సమూహం కొరకు పనిచేయాల్సిన మీడియాలో అధిక భాగం కార్పొరేట్ వలలో చిక్కి ఏలినవారి సేవలో తరిస్తున్న తరుణంలో ఇక ఈ రకరకాల వివక్షతల విశ్వవ్యాప్త విషపు కోరల పరిష్వంగంలో విలవిలలాడుతున్న కోట్లాది మంది అణగారిన ప్రజలకు దిక్కె వరు? దేశీయ ఆర్థిక / వాణిజ్య, దీర్ఘకాల, బహుళ, సామాజిక, అనంత ప్రయోజనాల్ని అపరిమితంగా తాకట్టుపెట్టి దాసోహం అంటూ ఏకపక్ష ఒప్పందాలకు ఆమోదం నిరంతరం తెలుపుతున్న ఏ దేశమైనా అది స్వతంత్ర దేశమేనా ? అది స్వతంత్ర ప్రభుత్వమేనా? ఇక అక్కడ ప్రజాస్వామ్యం ఎక్కడ? అక్కడ ప్రజలు వారిని ఎన్ను కుంది ఇందుకేనా ? ఒక బానిస దేశానికి దీనికి తేడా ఏమైనా ఉందా ? వారంతా ప్రాతినిధ్యం వహిస్తున్నది వారి వారి పదవికి / ప్రభుత్వానికే కాదు. ఆ దేశ ప్రజలందరి తరపున అనేది విస్మరించరాదు. ఎలాంటి పరిస్థి తుల్లో వారి ఆత్మ గౌరవానికి భంగం కలుగరాదు. అప్పుడే అది ఒక బానిస దేశం కాకుండా స్వతంత్ర దేశంగా మన కలుగు తుంది. అలాంటి ప్రజాస్వామ్యంలోనే నిజమైన సామాజిక న్యాయం లభిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా నాయకత్వ నాణ్యత లేమి అపరిమితంగా ఉంది. పర్యవసానంగానే సర్వత్ర అరాచ కం అంతకంతకు ప్రబలడంతోపాటు ఏపీస్టన్ ఫైల్స్‌లో దాదా పు 30 లక్షల పేజీలలో నానారకాల దురంతాలు/ దురాగతాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇవి, ఇలాంటి అంశాల వాస్తవాలు ప్రామాణికంగా పరిగణలోకి తీసుకుంటారని సామా జిక న్యాయ దినోత్సవ సంద ర్భంగా విజ్ఞులు అందరూ ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభిస్తారని ఆశిద్దాం. ❑

# ఎప్‌స్టీన్ ఫైల్స్ .. వ్యవస్థల పతన గాథ

\- కృష్ణ కానూరి

ఎప్‌స్టీన్ ఫైల్స్... సంచలనం కాదు.. వ్యవస్థల శవ పరీక్ష!" జెఫ్రీ ఎప్‌స్టీన్.. ఇది కేవలం ఒక నేరగాడి పేరు కాదు. చట్టాన్ని చుట్టచుట్టి జేబులో పెట్టుకున్న ఒక వికృత వ్యవస్థకు చిహ్నం. ఫిబ్రవరి 2026 నాటికి వెలుగులోకి వచ్చిన 6 మిలియన్ల పేజీల పత్రాలు, మనం గొప్పగా చెప్పుకునే 'నాగరిక లోకం' ముసుగును చీల్చి పారేస్తున్నాయి. ఇవి కేవలం అరాచకాల జాబితా కాదు. అధికారం ఉంటే అమానుషత్వాన్ని కూడా అలంకారంగా మార్చుకోవచ్చని నమ్మే 'ఎలైట్' వర్గాల అంతర్గత డైరీ. ధనం ముందు న్యాయదేవత కళ్లు గంతలు కట్టుకున్న వైనానికి, పెట్టుబడిదారీ సమాజం సృష్టించిన ఈ 'మృగ సామ్రాజ్యం' ఒక నిలువెత్తు సాక్ష్యం. ఇది గతం గురించి చెబుతున్న కథ కాదు.. మన భవిష్యత్తుకు ఇస్తున్న భయంకరమైన హెచ్చరిక!

## చీకటి సామ్రాజ్యపు క్రూరత్వం

ఈ ముసుగు వెనుక జరిగిన హింస కేవలం లైంగిక వేధింపులకే పరిమితం కాలేదు. అది శారీరక చిత్రహింసల (Extreme Violence) పర్వం. వెలుగులోకి వచ్చిన ఫోటోలు, వీడియోలు చూస్తుంటే.. నాగరికత ముసుగులో ఎంతటి అడవి మృగాలు దాగి ఉన్నాయో అర్థమవుతుంది. రష్యన్ బ్యాలెరినా ఓల్గా వంటి వారి అదృశ్యం, విచారణలో దొరికిన అస్థిపంజరాల ఛాయాచిత్రాలు ఈ నెట్‌వర్క్ ఎంతటి క్రూరమైనదో, ఎంతటి అమానుషమైనదో చాటి చెబుతున్నాయి. సాక్ష్యాలను మాయం చేయడం, అడ్డు వచ్చిన వారిని అంతం చేయడం ఈ వ్యవస్థకు వెన్నతో పెట్టిన విద్య. ఈ భయానక వాస్తవాలు మనకు ఇస్తున్న హెచ్చరిక ఒక్కటే అధికారం, అపరిమితమైన సంపద జవాబుదారీతనం లేనిచోట అమానుషత్వానికి అడ్డదారిగా మారుతాయి. మన మౌనం ఈ మృగాలకు మరో బాధితురాలిని ఎరగా వేయడమే అవుతుంది.

## పిరమిడ్ తరహాలో పసిమొగ్గల వేట

ఎప్ స్టీన్ కేవలం ఒక నేరగాడు మాత్రమే కాదు, అమాయకత్వాన్ని దోచుకోవడానికి ఒక క్రూరమైన 'బిజినెస్ మోడల్'ను రూపొందించిన మృగం. నిరుపేద కుటుంబాలకు చెందిన మైనర్ బాలికల నిస్సహాయతను గుర్తించి, వారికి పెద్ద మొత్తంలో డబ్బు ఎర వేసి తన వికృత సామ్రాజ్యానికి హంటింగ్ గ్రౌండ్‌గా మార్చుకున్నాడు. అంతటితో ఆగక, ఆ బాలికలనే పావులుగా వాడుకుంటూ, మరికొంత మంది మైనర్లను తన వద్దకు తీసుకువచ్చేలా ఒక అమానుషమైన 'పిరమిడ్ పద్ధతి'కి తెరతీశాడు. స్నేహం పేరుతో, డబ్బు ఆశ చూపి ఒక పసిబిడ్డ ద్వారా మరో పసిబిడ్డను ఈ నరక కూపంలోకి లాగడం నాగరిక సమాజం ఊహించలేనంతటి వికృత పరిణామం. ఒక అబద్ధం వెనుక మరో అబద్ధాన్ని అల్లి, వ్యవస్థల కళ్లు గప్పి చేసిన ఈ వికృత వేటలో వేలాది జీవితాలు ఛిద్రమైపోయాయి.

ఎప్‌స్టీన్ తన ప్రైవేట్ దీవిని, విలాసవంతమైన భవనాలను కేవలం భోగ విలాసాల కేంద్రాలుగా కాదు. అమాయకత్వాన్ని బలి తీసుకునే కబేళాలుగా మార్చేశాడు. తొమ్మిదేళ్ల పసిబిడ్డ నుంచి నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడపిల్లల వరకు.. ప్రతి ఒక్కరిని ఈ 'ఎలైట్' మృగాలు కేవలం అనుభవించే "వస్తువులుగా", ప్రాణం లేని "ఫర్నిచర్"లాగా పరిగణించడం మానవ నాగరికతకే ఒక మాయని మచ్చ. సభ్య సమాజం తలదించుకునే అత్యంత ఘోర విషాదం. మానవత్వంపై చెరిగని గాయంలా మిగిలిన దారుణం.

## న్యాయం ఎవరి కోసం?

విచారణ సంస్థలైన ఎఫ్.బి.ఐ, న్యాయ శాఖ తీరు చూస్తుంటే, చట్టం కేవలం సామాన్యుడిని అణచివేసే ఆయుధంగానే కనిపిస్తోంది. శక్తివంతుల పేర్లను 'రెడాక్ట్' (మరుగున పరచడం) పేరుతో తొలగించి, బాధితుల వేదనను నడి రోడ్డుపై పడేయడం వ్యవస్థల నైతిక పతనానికి పరాకాష్ట. డొనాల్డ్ ట్రంప్, బిల్ క్లింటన్ వంటి అగ్రరాజ్య నేతల పేర్లు వందలసార్లు వినిపించినా, విచారణ సంస్థలు వారిని తాకడానికి కూడా భయపడుతున్నాయంటే అవి పాలకుల 'జేబు సంస్థలుగా' మారిపోయాయని అర్థమవుతోంది. 2008లోనే నేరగాడని తేలినా, మరో దశాబ్దంపాటు ఎప్ స్టీన్ యథేచ్ఛగా అరాచకాలు కొనసాగించగలిగాడంటే, అది వ్యవస్థల మందకొడితనం కాదు.. అతనికి అధికార కేంద్రాల నుంచి అందిన అపవిత్ర రక్షణ కవచం. ఇది న్యాయంపై సామాన్యుడికి ఉన్న చివరి నమ్మకాన్ని కూడా బలితీసుకుంటోంది.

## 'గేట్స్' పర్యటన - ఆతిథ్యమా ? ఆందోళనకరమా ?

అంతర్జాతీయంగా ఎప్‌స్టీన్ ఫైల్స్ చిచ్చు రేపుతున్న వేళ, ఫిబ్రవరి 2026లో బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్ పర్యటన దేశీ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. మైక్రోసాఫ్ట్

వ్యవస్థాపకుడికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 'రెడ్ కార్పెట్' పరిచి ఘనస్వాగతం పలకడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2008లో మైనర్ల అక్రమ రవాణా కేసులో ఎప్‌స్టీన్ దోషిగా తేలిన తర్వాత కూడా, 2011 నుంచి గేట్స్ అతనితో పదేపదే సమావేశమవ్వడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఎప్‌స్టీన్ ఫైల్స్ రాసిన ఈమెయిల్స్‌లో గేట్స్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వికృత కోణాలు, అక్రమ సంబంధాలు, చివరకు తన భార్య మెలిండాకు తెలియకుండా యాంటీబయోటిక్స్ ఇవ్వాలనే ప్రస్తావనలు ఉండటం జుగుప్స కలిగిస్తోంది. "భారతదేశాన్ని ఒక ప్రయోగశాలగా (Laboratory), భారతీయులను గినియా పిగ్స్‌లా గేట్స్ భావిస్తున్నారు" అంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలు సామాన్యులను ఆలోచింపజేస్తున్నాయి.

**అధికారం ముందు తలవంచిన నైతికత..**

**మన బిడ్డల భద్రత ఎవరి బాధ్యత?**

ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో గేట్స్ పేరు, అతనితో ఉన్న అపవిత్ర బంధం వెలుగులోకి వచ్చిన తరుణంలో.. మన ప్రభుత్వాలు అవేవీ పట్టనట్టుగా అతనికి 'రాజ మర్యాదలు' చేయడం వ్యవస్థల నైతిక పతనానికి నిదర్శనం. గేట్స్ ఫౌండేషన్ బాలికల సాధికారత కోసం పనిచేస్తున్నామని చెబుతున్నా, దాని అధిపతే ఒక పిల్లల వేటగాడితో (Child Molester) స్నేహం చేయడంపై సభ్య సమాజం మండిపడుతోంది. "సొంత భార్యే అసహ్యించుకుని విడాకులు ఇచ్చేంతటి మురికి సంబంధాలు ఉన్న వ్యక్తికి, మన పాలకులు పెద్దపీట వేయడం మన బిడ్డల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడమే" అని మేధావులు హెచ్చరిస్తున్నారు. కేవలం టెక్నాలజీ, పెట్టుబడుల పేరుతో ఇలాంటి 'వివాదాస్పద ఎలైట్ వర్గాలను' ప్రోత్సహించడం అంటే.. మన నైతిక విలువలపై రాజీ పడటమే. అధికార కేంద్రాల్లోకి ఇలాంటి వ్యక్తుల చొరబాటును నిరోధించకపోతే, రేపు న్యాయం కేవలం ధనవంతుల జేబులో బందీగా మారుతుంది. డబ్బు మూటల కంటే బిడ్డల భవిష్యత్తే ముఖ్యం! పాపపు చరిత్ర ఉన్న వారికి 'రాజమర్యాదలు' చేయడం మన నైతిక పతనానికి నిదర్శనం. ప్రశ్నించే సమాజమే-నేరగాళ్లకు సింహస్వప్నం!"

**నిఘా నీడలో నీచ క్రీడ..**

**ఎప్‌స్టీన్ వెనుక మొసాద్ 'హనీ ట్రాప్' కుట్ర**

ఫిబ్రవరి 2026 నాటి ఎఫ్‌బీఐ నివేదికలు ఒక భయంకరమైన కోణాన్ని ఆవిష్కరిస్తున్నాయి. జెఫ్రీ ఎప్‌స్టీన్ కేవలం ఒక నేరగాడు మాత్రమే కాదు. అతను ఇజ్రాయెల్ నిఘా సంస్థ 'మొసాద్' కోసం పనిచేసిన ఒక శిక్షణ పొందిన గూఢచారి అనే ఆరోపణలు పెను సంచలనం సృష్టిస్తున్నాయి. కోట్లాది డాలర్ల విలువైన ఆ విలాసవంతమైన దీవి, ప్రైవేట్ జెట్‌లు ఒక సామాన్యుడికి ఎలా సాధ్యం? అనే ప్రశ్నకు సమాధానం-అది ఒక దేశం పన్నిన వ్యూహం కావొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికన్ సెలబ్రిటీలు, రాజకీయ ఉద్దండులు ఆ దీవిలో చేసిన వికృత చేష్టలను రికార్డ్ చేసి, వారిని బ్లాక్‌మెయిల్ చేయడం ద్వారా అగ్రరాజ్యాన్ని తన గుప్పిట్లోకి తెచ్చుకోవడానికి ఇజ్రాయెల్ ఈ 'హనీ ట్రాప్' వేదికను వాడిందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇజ్రాయెల్ సైనిక సంస్థలకు ఎప్‌స్టీన్ నిధులు సమకూర్చడం, మాజీ ప్రధాని ఎహుద్ బారక్ వంటి వారితో సన్నిహిత సంబంధాలు నెరపడం ఈ అనుమానాలను నిజం చేస్తున్నాయి.

**యూరోప్‌ను కుదిపేస్తున్న 'సిగ్గు చేటు' ఫైల్స్ :**

ఎప్‌స్టీన్ ఫైల్స్ కేవలం అమెరికాకే పరిమితం కాలేదు. అవి యూరప్ ఖండాన్ని, ముఖ్యంగా నార్వే వంటి శాంతియుత దేశాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఇవి కేవలం నేరాలు కావు, మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఒక అంతర్జాతీయ నేర సామ్రాజ్యపు కుట్రలను (Crimes against Humanity) నిపుణులు అభివర్ణిస్తున్నారు. నార్వే మాజీ ప్రధాని థోర్బ్‌జోర్న్ జగ్ల్యాండ్, నోబెల్ కమిటీ మాజీ అధిపతి వంటి ఉన్నత వ్యక్తులు ఎప్‌స్టీన్ నేరస్థుడని తెలిసినా అతనితో సాన్నిహిత్యం నెరపడంపై 'తీవ్ర అవినీతి' ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మరీ ముఖ్యంగా, నార్వే రాజకుటుంబానికి చెందిన క్రౌన్ ప్రిన్సెస్ మెట్టె-మారిట్ అమానుష నేరగాడైన ఎప్‌స్టీన్‌తో స్నేహం చేయడం ఆ దేశ గౌరవాన్ని మంటగలిపింది. రాజవంశంపై ప్రజలకున్న అపారమైన నమ్మకాన్ని ఈ ఫైల్స్ బద్దలు కొట్టాయి. ఓస్లో ఒప్పందాల వెనుక ఉన్న కీలక దౌత్యవేత్తలకు ఎప్‌స్టీన్ తన వీలునామాలో 10 మిలియన్ డాలర్లు వదిలివెళ్లడం చూస్తుంటే, అధికారం వెనుక ఉన్న 'చీకటి లావాదేవీల' లోతు అర్థమవుతోంది.

**అంతర్జాతీయ విస్తరణ, అగ్రనేతల అసలు ముఖచిత్రం ! :**

ఒక వైపు వరల్డ్ ఎకనామిక్ ఫోరం (WEF) చీఫ్ బోర్గే బ్రెండే వంటి ప్రపంచ ఆర్థిక వేత్తలు, మరోవైపు దుబాయ్ లాజిస్టిక్స్ దిగ్గజం అహ్మద్ బిన్ సులయెం వంటి కుబేరులు ఎప్‌స్టీన్ వలలో చిక్కుకోవడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. "ఎప్‌స్టీన్ శక్తివంతులైన వ్యక్తులను ఒక సేకరణలా (Frequent flyer points) పోగుచేసుకున్నాడు" అన్న విశ్లేషకుల మాటలు అక్షర సత్యం. ఈ ప్రభావం భారతదేశాన్ని తాకింది. 2017 ప్రధాన మంత్రి మోదీ ఇజ్రాయెల్ పర్యటనలో ఎప్‌స్టీన్ జోక్యం ఉందన్న ఆరోపణలు దేశంలో రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. పారదర్శకత లేని అధికార కేంద్రాలు, నైతికత లేని రాజకీయ సంకల్పం కలిసి అభాగ్యులైన బాలికల జీవితాలతో ఎంతటి క్రూరమైన వ్యాపారం చేశాయో చెప్పడానికి ఈ పాపపు పద్దులే

నిదర్శనం. ప్రతిష్ఠాత్మకమైన పదవుల్లో ఉండి అమానుష నేరగాళ్లతో విందులు చేసిన ఈ 'ఎలైట్' వర్గాల నైతిక పతనం, రేపు ప్రపంచ వ్యవస్థల భవిష్యత్తునే ప్రశ్నార్థకం చేస్తోంది.

**దేశ భద్రతకే ముప్పు !**

ప్రపంచాన్ని శాసించే దేశాధినేతలు, మేధావులు ఒక గూఢచారి పన్నిన పద్మవ్యూహంలో చిక్కుకోవడం నైతిక పతనానికే కాదు, ప్రజాస్వామ్య మనుగడకే గొడ్డలిపెట్టు. ఒక విదేశీ నిఘా సంస్థ కోసం మన సొంత నేతలు అమాయక బాలికల జీవితాలను బలిపీఠం ఎక్కించారనే వాస్తవం గుండెను కోసేస్తోంది. ఎప్‌స్టీన్ ద్వారా ఇజ్రాయెల్ తన అంతర్జాతీయ ప్రయోజనాల కోసం రష్యా వంటి దేశాలతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకోవడం, మన నాయకుల 'గుట్టు'ను ఆయుధంగా మార్చుకోవడం చూస్తుంటే.. అధికారం ఎంతటి నీచానికైనా ఒడిగడుతుందని అర్థమవుతోంది. ఇది కేవలం వ్యభిచార కూపం కాదు, వ్యవస్థలను కూల్చేసే ఒక భయంకరమైన రాజకీయ కుట్ర. ఈ నిజాన్ని గుర్తించి మనం మేల్కొనకపోతే, దేశ భవిష్యత్తు అజ్ఞాత శక్తుల చేతుల్లో బందీగా మారిపోతుంది.

**రాజకీయ సంకల్పం మారకపోతే..**

**మన బిడ్డల భవిష్యత్తు శూన్యం !**

ఎప్‌స్టీన్ ఫైల్స్ కేవలం గతంలో జరిగిన నేరాల రికార్డులు కావు. అవి మన భవిష్యత్తుకు ఇస్తున్న మరణ శాసనాలు. డబ్బుతో న్యాయాన్ని, వ్యవస్థలను, చివరకు మనుషులను కూడా కొనవచ్చనే 'పెట్టుబడిదారీ కుళ్లు' ఉన్నంత కాలం.. పేదరికం నిరంతరం దోపిడీకి గురవుతూనే ఉంటుంది. కేవలం కొత్త చట్టాలు తీసుకురావడం వల్ల మార్పు రాదు. విచారణ సంస్థలు రాజకీయ రంగును వదిలేసి, స్వతంత్రంగా పనిచేసే 'రాజకీయ సంకల్పం' పుట్టినప్పుడే ఇలాంటి మృగాల సామ్రాజ్యాలు కూలి పోతాయి. మీడియా కూడా టీఆర్పీల వేటను ఆపి, పాలకుల తప్పులను నిలదీసే సాహసం చేయాలి. లేదంటే, ఈ వ్యవస్థాగత వైఫల్యం రేపు మన బిడ్డల ప్రాణాలను మరో మృగం నోటికి అందించే ప్రమాదం ఉంది. మేల్కోవాల్సింది ప్రభుత్వం మాత్రమే కాదు, ప్రశ్నించడం మర్చిపోయిన ఈ సమాజం కూడా!

**పోరాటం వ్యక్తులపై కాదు.. వ్యవస్థపై!**

ఎప్‌స్టీన్ చనిపోయి ఉండవచ్చు. కానీ అతడిని కాపాడిన ఆ 'అపవిత్ర వ్యవస్థ' ఇంకా ఊపిరి పోసుకునే ఉంది. ఎలైట్ వర్గాలకు ఒక చట్టం, సామాన్యుడికి మరో చట్టం ఉన్నంత కాలం మానవత్వానికి రక్షణ లేదు. మూసివేసిన తలుపులు ఎప్పటికీ మూసి ఉండవు. నిజం ఎంత ఆలస్యంగా వచ్చినా దానికి తలుపులు తెరవాల్సిందే. మనం నేడు మౌనం పాటిస్తే, రేపు మరో పేరుతో, మరో రూపంలో ఇలాంటి మృగాలే పుట్టుకొస్తాయి. మౌనం నేరస్తుడికి రక్షణ కవచం.. ప్రశ్నించడమే బాధితుడికి అసలైన న్యాయం! ❑

**(వసంత మేఘం సౌజన్యంతో)**

# అంతు లేని అమెరికా అమానుషాలు

**(21వ పేజీ తరువాయి)**

లెబనాన్‌లోని షటిలా, సబ్రా క్యాంప్‌లలో పాలస్తీనా పౌరులను హత్య చేశారు. 70 ఏళ్లుగా పాలస్తీనా జనాభాపై క్రూరమైన దౌర్జన్యాలకు పాల్పడినందుకు ఇజ్రాయెల్, రక్షణ మంత్రులు లేదా సైనికులు ఎవరూ ఉరితీయబడలేదు.

యూరోపియన్ ప్రభుత్వాలకు, అమెరికన్ మీడియాకు ఈ అమానుష సంఘటనలు ఏవీ కనబడవు. మిత్రరాజ్యాల 'ప్రెసిషన్ బాంబ్స్' వల్ల కాలి, కూలిపోయిన తన ఇంట్లో ముక్కలై వికృతంగా కాలిన మాంసపు ముద్దలుగా గోడలకు అతుక్కుపోయిన తన బిడ్డలను చూసి ఒక ఇరానియన్ తల్లి ఏడుస్తోంది. ఈ బాధ ఇంగ్లీషు లేదా అమెరికన్ తల్లి ఆవేదనకంటే తక్కువైతే ఉండదు. ఇరానియన్ తల్లి ఆంగ్లో-సాక్సన్ యాసలో ఇంగ్లీషులో ఏడవకపోవచ్చు కానీ, బ్లో-డ్రైడ్ హెయిర్, మేకప్, మెనిక్యూర్డ్ గోళ్లతో, సౌకర్యవంతమైన సౌండ్ బైట్‌లతో ఇంగ్లీష్‌లో ఏడవకపోవచ్చు. ఆమె అర్థం కాని విదేశీ భాషలో బుర్ఖా కింద అసహనంగా విలపించవచ్చు. కానీ ఆమె కన్నీళ్లు, వేదన, ఆమె హృదయ విదారకమైన బాధ, ఆమె కోపం అన్నీ అంతే నిజమైనవి, తీవ్రమైనవే. అసలైన విషాదం ఏమిటంటే, స్వేచ్ఛా ప్రపంచం అని పిలవబడే దేశాలు ఆ అమానుషాలను చూస్తూ మౌనంగా ఉండడమే. అమెరికా అజేయమైనది కాదు. సామాన్య ప్రజలే అంతిమ విజయం సాధిస్తారు. మానవాళికి వ్యతిరేకంగా జరిగిన ఈ నేరానికి నిరసనగా ప్రతి అమెరికా కంపెనీ, ఉత్పత్తులను బహిష్కరించాలి. తద్వారా అమెరికా సామ్రాజ్యవాదానికి పగ్గాలు వేయవచ్చు. అమెరికా పరిపాలన, సీఐఏ, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, న్యాయాన్ని స్థాపించడానికి ప్రయత్నించినప్పుడల్లా, వారు కనీసం లక్ష నుంచి 10 లక్షల మందిని చంపారు. బాగ్దాద్‌లో అమలు పరిచిన న్యాయసూత్రాలను అమెరికాకు వర్తింపజేస్తే వాషింగ్టన్‌లోని పెన్సిల్వేనియా అవెన్యూలో మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడిన అమెరికా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సీఐఏ అధికారులు, సైనికాధికారులను ఉరి తీయడానికి తగినన్ని చెట్లు, టెలిగ్రాఫ్ స్తంభాలు లేవు. ముందుగా ట్రంప్‌కు, అతని మిత్రుడు నెతన్యాహుకు ఈ శిక్ష అమలు పరచాలి. ❑

# కారల్ మార్క్స్ :
# ఒక చారిత్రక ప్రవాహం




- రమేశ్ రాంపల్లి

ప్రపంచం మరోసారి యుద్ధాల అంచులపై నిలిచింది. పశ్చిమాసియా మళ్లీ మంటల్లో కాలిపోతోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా చేపడుతున్న దాడులు, వెనిజులా అధ్యక్షుడి అపహరణ వాటి వెనుక దాగి ఉన్న వ్యూహాలు ప్రపంచ రాజకీయాలను ప్రమాదకరమైన ఉద్రిక్తతల దిశగా నడిపిస్తున్నాయి. ఇదే సమయంలో యూరప్‌లో కొనసాగుతున్న రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కూడా అంతర్జాతీయ రాజకీయాలను అస్థిరత వైపు నెడుతోంది. ఇవేమీ మనం మొదటిసారి చూస్తున్న దృశ్యాలు కాదు. చరిత్రను వెనక్కి తిప్పి చూస్తే ఇలాంటివి ఎన్నోసార్లు ప్రపంచాన్ని వణికించాయి. దేశాలు పరస్పరం ఢీకొన్నాయి. లక్షలాది ప్రాణాలు బలయ్యాయి. కొన్ని సందర్భాల్లో ఈ ఘర్షణలు చివరకు ప్రపంచయుద్ధాలుగా మారి, మానవాళిని మహావిపత్తుల్లో ముంచెత్తాయి. ఇలాంటి సందర్భాల్లో ఒక ప్రశ్న తప్పకుండా మన ముందుకొస్తుంది. ప్రపంచం ఎందుకు తరచూ యుద్ధాల దిశగా నడుస్తుంది ? దేశాల మధ్య ద్వేషాలు, సరిహద్దు వివాదాలే దీనికి కారణమా ? లేక ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దాగి ఉన్న వైరుధ్యాలు కారణమా ?

ఈ ప్రశ్నలకు సమాధానం వెతికే ప్రయత్నం మనలను మళ్లీ ఒక మహా మేధస్సు వైపు తీసుకెళ్తుంది. ఆ మేధస్సు పేరు కార్ల్ మార్క్స్ (Karl Marx). యుద్ధాలు, సంక్షోభాలు, అసమానతలు ఇవన్నీ యాదృచ్ఛిక ఘటనలు కావని, అవి సమాజంలోని ఆర్థిక నిర్మాణాలతో ముడిపడి ఉంటాయని శాస్త్రీయంగా వివరించిన మేధావి ఆయన. ఈ ప్రపంచంలో అసమానతలు ఎందుకు ఉత్పన్నమవు తున్నాయి? సంపద ఎందుకు కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమవుతోంది? కార్మికుల శ్రమ ఎందుకు దోపిడీకి గుర వుతోంది? ఆర్థిక వ్యవస్థలు ఎందుకు సంక్షోభాలను ఎదుర్కొం టున్నాయి? ఈ సంక్షోభాలు ఎందుకు యుద్ధాలకు దారితీస్తు న్నాయి? ఇలాంటి ప్రశ్నలకు సమగ్ర సమాధానాన్ని కనిపెట్టే ఒక సరికొత్త దృష్టికోణాన్ని ఆవిష్కరించాడాయన. మార్క్సిజమనే మహోన్నత ఆలోచనా స్రవంతిని ఈ ప్రపంచానికో కానుకగా ఇచ్చాడు. మార్క్సిజానికి హృదయం లాంటిది చారిత్రక భౌతికవాదం (Historical Materialism). సమాజ అభివృద్ధిని వ్యక్తుల సంకల్పాలు కాదు, ప్రధానంగా ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలే నిర్దేశిస్తాయని ఈ సిద్ధాంతం చెబుతుంది.

ఆర్థిక పునాది (economic base) మారినప్పుడు దాని మీద నిర్మితమైన రాజకీయ, న్యాయ, సాంస్కృతిక నిర్మాణాలు



మారక తప్పవు. అందుకే చరిత్రను అర్థం చేసుకోవాలంటే రాజుల కథలకంటే, సమాజంలోని వర్గ సంబంధాలు, ఉత్పత్తి వ్యవస్థల పరిణామాన్ని అధ్యయనం చేయాలనే శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని మనముందుంచాడు మార్క్స్. ఈ ఆలోచనా ప్రయాణంలో మార్క్స్ ఒంటరిగా లేడు. ఆయనకు అత్యంత సన్నిహిత మిత్రుడిగా, సహచరుడిగా ఫ్రెడరిక్ ఎంగెల్స్ (Friedrich Engels) తోడుగా ఉన్నాడు. ఈ ఇద్దరి మేధో భాగస్వామ్యం ఆధునిక చరిత్రలో అత్యంత సృజనాత్మక భావజాలానికి బాటలు వేసింది. పరిశ్రమల విస్తరణతో యూరప్‌లో పెరుగుతున్న కార్మిక వర్గ దోపిడీని వారు అత్యంత దగ్గరగా పరిశీలించారు. ఈ అధ్యయనాల ఫలితంగా వెలువడిందే కమ్యూనిస్టు ప్రణాళిక (The Communist Manifesto). 1848లో వెలువడిన ఈ చారిత్రక పత్రం ప్రపంచ రాజకీయాలలో ఒక గొప్ప మలుపు. ఇది కేవలం ఒక సిద్ధాంత ప్రకటన మాత్రమే కాదు, ఒక రాజకీయ ఆచరణకు పిలుపు. ఈ పత్రంలో ఉన్న రెండు ప్రసిద్ధ వాక్యాలు ప్రపంచ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచాయి. "ప్రపంచ కార్మికులారా ఏకం కండి." "ఇప్పటివరకు ఉన్న సమాజాల చరిత్ర మొత్తం వర్గపోరాటాల చరిత్రే".. ఇవి మార్క్సిజం యొక్క సారాంశానికి ప్రతీకలుగా నిలుస్తాయి. మార్క్స్ సిద్ధాంతాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవాలంటే ఆయన మహత్తర గ్రంథం దాస్ కేపిటల్ (Das Kapital)ను చూడాలి. ఇందులో పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క అంతర్గత నిర్మాణాన్ని విశ్లేషించాడాయన.

పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికుడు తన శ్రమ ద్వారా విలువను సృష్టిస్తాడు. కానీ ఆ విలువలో ఒక చిన్న భాగాన్ని మాత్రమే అతడు వేతనంగా పొందుతాడు. అతను సృష్టించిన

మొత్తం విలువలో ఎక్కువ భాగాన్ని పెట్టుబడిదారుడు లాభంగా స్వాధీనం చేసుకుంటాడు. దీనినే మార్క్స్ "అదనపు విలువ"గా నిర్వచించాడు. ఈ సిద్ధాంతం పెట్టుబడిదారీ వ్యవస్థలోని దోపిడీ స్వభావాన్ని బట్టబయలు చేసింది. ఈ అదనపు విలువ(లాభాల) కోసం పెట్టుబడిదారులు ఉత్పత్తిని నిరంతరం విస్తరించడానికి ప్రయత్నిస్తారు. అదే సమయంలో కార్మికుల శ్రమను మరింత తీవ్రంగా వినియోగించేందుకు ప్రయత్నిస్తారు. దీంతో పెట్టుబడిదారీ వ్యవస్థలో ఒక వైరుధ్యం ఏర్పడుతుంది.

ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. సంపద పెరుగుతుంది. కానీ ఆ సంపద సమాజమంతటికీ సమానంగా చేరదు. అది కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతుంది. అసమానతలకు దారి తీస్తుంది. ఈ ధోరణి నేడు ప్రపంచవ్యాప్తంగా మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితులను ముందుగానే విశ్లేషించిన దార్శనికుడు మార్క్స్. మార్క్స్ ఆలోచనలు 19వ శతాబ్దంలో సిద్ధాంత రూపంలో వెలుగులోకి వచ్చాయి. 20వ శతాబ్దం నాటికి అవి రాజకీయ శక్తిగా రూపుదిద్దు కున్నాయి.ఆ మార్పునకు ప్రధాన కారణం లెనిన్. మార్క్స్ తరువాత ఆయన ఆలోచనలను మరింత ముందుకు తీసుకెళ్లిన వారిలో లెనిన్ అత్యంత ముఖ్యుడు. లెనిన్ పెట్టుబడిదారీ వ్యవస్థలో వచ్చిన కొత్త మార్పులను విశ్లేషించాడు. పారిశ్రామిక పెట్టుబడి, బ్యాంకింగ్ పెట్టుబడి కలిసిపోవడం వల్ల "ఫైనాన్స్ కేపిటల్" ఏర్పడుతుందని ఆయన వివరించాడు.

ఈ ఫైనాన్స్ కేపిటల్ ప్రపంచ మార్కెట్లను ఆక్రమించడానికి పోటీ పడుతుంది.కొత్త మార్కెట్లు, వనరులు, పెట్టుబడి అవకాశాల కోసం దేశాలు పరస్పరం పోటీ పడతాయి. ఈ పోటీ ప్రపంచ రాజకీయాలను ఉద్రిక్తతలతో నింపుతుంది. చివరకు యుద్ధాలకు దారితీస్తుంది. లెనిన్ ఈ దశను "పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క అత్యున్నత దశ – సామ్రాజ్యవాదం"గా నిర్వచించాడు. ఈ నేపథ్యంలోనే 1917లో జరిగిన రష్యన్ విప్లవం (Russian Revolution) ప్రపంచ చరిత్రలో ఒక మహత్తర మలుపుగా నిలిచింది.లెనిన్ సారథ్యంలో రష్యాలో కార్మికవర్గం జార్ రాజ్యాన్ని కూల్చివేసింది. ఒక కొత్త సామాజిక వ్యవస్థ(సోషలిజం)ను నిర్మించేందుకు విప్లవాత్మక ప్రయోగం ప్రారంభమైంది. ఈ విప్లవం ప్రపంచ కార్మిక ఉద్యమాలకు అపూర్వమైన ప్రేరణను ఇచ్చింది. ఈ ప్రభావం కేవలం యూరప్‌కే పరిమితం కాలేదు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య ఉద్యమాలను కూడా తాకింది. సామాజిక న్యాయం, కార్మిక హక్కులు, సంక్షేమ విధానాల వంటి అంశాలు ప్రపంచ రాజకీయాల్లో ముఖ్యమైన చర్చలుగా మారాయి. ఇది మార్క్స్ ఆలోచనల శక్తిని సూచించే ఒక చారిత్రక దశ. కానీ చరిత్ర ఎప్పుడూ సూటిగా ముందుకు సాగదు. సోషలిస్టు ప్రయోగాలు విజయాలు,వైఫల్యాలు రెండింటినీ అనుభవించాయి. అనేక దేశాల్లో రాజకీయ మార్పులు చోటు చేసుకున్నాయి. పలు అంతర్గత సమస్యలు, బాహ్య ఒత్తిడులు, రాజకీయ సంక్లిష్టతలతో సోషలిస్టు దేశాలు అనేక సవాళ్లను ఎదుర్కొన్నాయి. కొన్ని సోషలిస్టు వ్యవస్థలు కూలిపోయాయి కూడా. అయితే ఆ పరిణామాల ఆధారంగా మార్క్సిజానికి కాలం చెల్లిందని చెప్పడం సత్యదూరమే అవుతుంది. ఎందుకంటే మార్క్స్ విశ్లేషించిన పెట్టుబడిదారీ వ్యవస్థలోని వైరుధ్యాలు ఇంకా అదృశ్యమవలేదు. అవి నేటి ప్రపంచంలో మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. మార్క్సిజం యొక్క నిజమైన బలం ఏమిటంటే అది సమాజాన్ని ఉన్నది ఉన్నట్టుగా చూడగలిగే చూపునిస్తుంది. సమాజంలోని సమస్యలను వ్యక్తుల వైఫల్యాలుగా కాకుండా వ్యవస్థలోని వైరుధ్యాలుగా చూడాలని సూచిస్తుంది. ఈ దృష్టికోణమే ఆధునిక సామాజిక శాస్త్రాల అభివృద్ధికి కూడా పునాది వేసింది.

ఆర్థిక శాస్త్రం, రాజకీయ శాస్త్రం, చరిత్ర, సామాజిక శాస్త్రం, ఇలా అనేక రంగాలలో మార్క్స్ ఆలోచనలు ప్రభావం చూపాయి. మార్క్స్ కేవలం తన కాలాన్ని మాత్రమే కాదు. తనకు ముందు, తర్వాత కాలాలను కూడా అర్థం చేసుకునే శాస్త్రీయమైన ఆలోచనలను అందించాడు. అందుకే.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎలా రూపుదిద్దుకుంటుంది ? ఎలా విస్తరిస్తుంది? పెట్టుబడి ఎలా కేంద్రీకృతమవుతుంది? దేశాల మధ్య పోటీ ఎలా తీవ్రమవుతుంది? అనే ప్రశ్నలకు ఇప్పటికీ మార్క్స్ నిలువెత్తు సమాధానంగా నిలిచివున్నాడు. వర్తమాన పరిస్థితులను గమనిస్తే మార్క్స్ విశ్లేషించిన ధోరణులు ఎంత స్పష్టంగా కనిపిస్తున్నాయో అర్థమవుతుంది. ప్రపంచ సంపదలో అత్యధిక భాగం కొద్దిమంది బిలియనీర్ల చేతుల్లోనే కేంద్రీకృతమవుతోంది. అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు అనేక దేశాల ప్రభుత్వాలకంటే ఎక్కువ ఆర్థిక శక్తిని సంపాదించాయి. టెక్నాలజీ సంస్థలు, ఫైనాన్స్ సంస్థలు, గ్లోబల్ పెట్టుబడులు ప్రపంచ మార్కెట్లను శాసిస్తున్నాయి. పెట్టుబడి సరిహద్దులను దాటి సంచరిస్తున్నప్పటికీ, దాని లాభాలు మాత్రం సమాజమంతటికీ సమానంగా చేరడం లేదు. ఈ ధోరణి ప్రపంచ రాజకీయాల్లో కనిపిస్తోంది. వనరులు, మార్కెట్లు, భౌగోళిక ప్రాధాన్యతలపై ఆధిపత్యం కోసం శక్తివంతమైన దేశాలు పరస్పరం పోటీ పడుతున్నాయి. అనేక ప్రాంతాలు ఈ ఆధిపత్య పోటీకి వేదికలుగా మారుతున్నాయి. యుద్ధాలు, ఆంక్షలు, సైనిక కూటములు, వ్యూహాత్మక ఒప్పందాలు.. ఈ పరిణామాలన్నిటినీ గమనిస్తే ఒక సత్యం బోధపడుతుంది. యుద్ధాలు కేవలం రాజకీయ నాయకుల ఆకస్మిక నిర్ణయాల వల్ల రావు. అవి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని లోతైన వైరుధ్యాల నుంచి పుడతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ విస్తరిస్తున్న కొద్దీ మార్కెట్ల కోసం పోటీ పెరుగుతుంది.ఆ ఆధిపత్య పోటీ **(మిగతా 37వ పేజీలో)**

# చరిత్రకారుడి 'ఆసక్తికర సమయాలు'



- డా.జె.రవీంద్రనాథ్

హాబ్స్ బామ్ ఆత్మకథలో ఒక చరిత్రకారుడు చరిత్ర అర్థాన్ని సాధారణంగా, ప్రత్యేకంగా 20వ శతాబ్ది గురించి తెలుసుకునే అన్వేషణ కనిపిస్తుంది. తన జీవితాన్ని 20వ శతాబ్ది చరిత్ర రూపొందించిన దానిగా చూశాడు. చరిత్రను విశాల కాన్వాసు పై చూపడంలో జర్మన్ సమగ్రతను ప్రదర్శించాడు. తాను ఎదుటివారి అంగీకారం, తిరస్కారాలతో నిమిత్తం లేకుండా లోతు అయిన జ్ఞానం, హేతుబద్ధ వివరణ, చారిత్రక అవగాహనలను తన ఆత్మకథ ద్వారా ఇచ్చాడు. మతకలహాలు ఉగ్రవాదం, హింసలతో కూడిన ఈ శతాబ్దంలో చరిత్రకు ప్రత్యేక అర్థం ఉందా లేక మానవ జీవితం గౌరవాన్ని తొక్కేసే అంధ శక్తియా అనేది తెలుసుకోవడం ఎంతో అవసరం.

హాబ్స్ బామ్ 1917 ఈజిప్ట్ లోని అలెగ్జాండ్రియా నగరంలో జన్మించాడు తన తండ్రి పేరు లియోపాల్డ్ హాబ్స్ బామ్. తల్లి నెల్లీ జర్మనీకి చెందిన యూదు జాతీయురాలు.తాను కేం బ్రిడ్జ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ డిగ్రీ పొందాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో సేవ తరువాత తిరిగి వచ్చి 1947లో యూనివర్సిటీ ఆఫ్ లండన్‌కు చెందిన బిర్క్బెక్ కాలేజీలో ఉపన్యాసకుడిగా చేరాడు. తన వృత్తిలో ఎదిగి అక్కడే ఆచార్యుడిగా పనిచేశాడు. బహుభాషా కోవిదుడు. అతని రచనలలో ప్రిమిటివ్ రెబల్స్, బ్యాండిట్స్, ది ఏజ్ ఆఫ్ క్యాపిటల్, ది ఏజ్ ఆఫ్ రెవల్యూషన్, ది ఏజ్ ఆఫ్ ఎక్స్ట్రీమ్స్, ది ఫ్రాక్చర్డ్ టైమ్స్, ఆన్ ఎంపైర్, గ్లోబలైజేషన్ డెమోక్రసీ అండ్ టెర్రరిజం, హౌ టూ చేంజ్ ద వరల్డ్ అనే రచనలు ఎంతో ముఖ్యమైనవి.

తన ఆత్మకథ "ఆసక్తికర సమయాలు"లో తాను ఏ విధంగా యువకుడిగా ఎదిగింది కమ్యూనిస్టుగా మారింది, చివరి దాకా పార్టీ విధేయుడుగా ఉన్నది చెప్పాడు. సోవియెట్ కమ్యూనిస్టు పార్టీ 20వ కాంగ్రెస్‌లో కృశ్చేవ్ చెప్పిన విషయాల తరువాత తాను స్టాలిన్ విమర్శకుడిగా మారింది, ఇతర చరిత్ర కారులతో పరిచయాన్ని, మూడవ ప్రపంచ దేశాల వామపక్ష ఉద్యమాలతో తన అనుబంధాన్ని వివరించాడు. ఇంకా ప్రపంచీకరణ, ఆ తరువాత పరిణామాలు మనకు ఈ పుస్తకంలో గోచరిస్తాయి. అతడు తన్ను తాను రూసో లేక సెయింట్ అగస్టిన్ లాగా జీనియస్‌గా భావించలేదు. తన ఆత్మ కథలో 'ఒప్పుకోళ్ళు' లేక వ్యక్తిగత ఆత్మీయ జీవితం కనిపించదు. తాను సమకాలీన బ్రిటిష్ మార్క్సిస్టు మేధావిగా చరిత్రను వీక్షించాడు.

హాబ్స్ బామ్ తన ఆత్మ కథలో ప్రజా వ్యక్తిత్వం వ్యక్తిగత లేదా అంతరంగిక జీవితంకన్నా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈ విషయంలో ఇతనికి, నెహ్రూకి పోలికలు ఉన్నాయి. ఇద్దరూ సొంత జీవితం కన్నా ప్రజా జీవితానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఇలా రాసే ఆత్మకథ రచయిత తన ఆత్మీయులను గాయపరిచే విధంగా సొంత జీవితాన్ని ప్రకటించడు. తన జీవితంలో సాదా సంఘటనల వల్ల కాక తన పరిమితులను అధిగమించటం లోనే పాఠకులకు ఆసక్తి ఎక్కువనే భావిస్తాడు. తన అంతర్గత జీవితం తెలిపే పనిని కూడా తన జీవిత చరిత్రకారులకు వదులుతాడు. అయితే దీనివల్ల ఆత్మకథకుడి వ్యక్తిత్వ రూపకల్పన గురించి పాఠకులకు అంతగా తెలిసే అవకాశం లేదు. అయితే వస్తుగత సత్యం వ్యక్తిగతాన్ని, వ్యక్తిత్వ లోటుపాట్లను నిర్ణయిస్తుంది అని అనుకునే ఆత్మకథ రచయితలు జీవితాన్ని విడిగా కాకుండా ఒక మ్యాప్‌లాగా చూస్తారు.

హాబ్స్ బామ్ కుటుంబం మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత వియన్నాకు వచ్చింది. అతని తండ్రి లియోపాల్డ్ ఒక ఆదర్శవాది కాగా, తల్లి ఒక మేధావి మరియు రచయిత. తన తండ్రికి లౌక్యం లేకపోవడం, ఆ తర్వాత అతని మృతి వల్ల వారి కుటుంబం ఆర్థికంగా కృంగిపోయింది. అతని తల్లి ట్యూషన్లు చెప్పి, నవలా రచన, అనువాదాలు ద్వారా కుటుంబ పోషణకు కష్టపడింది. బ్రిటీష్ మూలాల వల్ల హాబ్స్ బామ్‌కు పాఠశాలలో ఇతర విద్యార్థుల వలె జాతి వివక్షణ ఎదురుకాలేదు.

అతడి తల్లి అతనికి "నీవు యూదు అయినందున సిగ్గుపడవలసిన పని చేయటం కానీ, చేసినట్లు కనిపించడం కానీ తగదు"ని బోధించింది.హిట్లర్ పూర్వ వియన్నాలో పలువురు మధ్యతరగతి యూదులు ఎవరూ జియోనిస్టులు కాలేదని రచయిత రాశాడు. ఒకనాడు ఉద్యోగాన్వేషణలో విఫలమై ఇంటికి తిరిగి వచ్చిన తండ్రి హఠాత్తుగా చనిపోవడం, ఆ బాధ వల్ల రెండేళ్ల తరువాత రచయిత తల్లి కూడా మృతి చెందటం జరిగింది. ఈ చరిత్రకారునికి వేర్పాటువాదంపై ఆధారపడిన శకలాలైన అస్తిత్వాల మీద నమ్మకం లేదు. తప్పొప్పులు, న్యాయ న్యాయాలు ఏమైనా జాతి బ్యాడ్జెస్ లేదా జాతీయ జెండాల ప్రదర్శన తగదు అని భావించాడు. తన తండ్రి గురించిన అస్పష్టమైన స్మృతులు, తల్లి రోగము, తన పిన తల్లుల చెంత పెరగటం గురించి రాశాడు. అతని తల్లి అతడికి మేధోపర పరిణితి వచ్చినదాకా కమ్యూనిస్టు పార్టీలో చేరరాదని తెలిపింది. తల్లిదండ్రుల తరువాత అతడు తన సోదరి నాన్సీ బాధ్యత

తీసుకున్నాడు. మేధోపర అన్వేషణలు సాగించాడు. ఆ కుటుంబం 1932లో బెర్లిన్ వచ్చినప్పుడు నాజీజం, కమ్యూనిజంల మధ్య ఘర్షణ నడుస్తోంది. తన ఉపాధ్యాయుల కొందరి ప్రభావంతో అతడు కమ్యూనిజం వైపు వెళ్ళాడు. అక్టోబర్ విప్లవం యొక్క స్థిరమైన ప్రభావాన్ని గుర్తించాడు. ఆనాటి చారిత్రక పరిస్థితుల మూలాన రాజకీయ నిబద్ధత కల భవిష్యత్తు వైపు సాగాడు.

ఈ ఆత్మకథలో రచయిత తన తోటి చరిత్రకారులు నాయకులు ప్రముఖుల గురించి రాశారు. 1956లో కృశ్చేవ్ స్టాలిన్‌పై చేసిన విమర్శ తర్వాత పార్టీలోనే కొనసాగాడు. గతంలో కమ్యూనిస్టులుగా ఉండి తరువాత తీవ్ర వ్యతిరేకులుగా మారిన పాత సహచరులకు దూరంగా ఉన్నాడు. ఆయన దృష్టిలో మాజీలు "విఫలమైన దేవుని" సైతాన్‌గా చూశారు. రెండవ ప్రపంచయుద్ధ కాలం ఆ తరువాత ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అటు కమ్యూనిజానికి బాధితుడు లేదా తీవ్ర విమర్శకుడు కాలేదు. ఈ విఖ్యాత చరిత్రకారుని గ్రంథాలు వివిధ దేశాలలోని వామపక్ష వాదులు చదివారు.

హాబ్స్ బామ్ చరిత్ర రచనకు తీసుకున్న విశాల కాన్వాస్, సంఘటనల ఖచ్చితమైన చిత్రణ, తాను నమ్మిన సిద్ధాంతాలలోని లోపాలను ఒప్పుకోవటం, చరిత్ర అర్థం కోసం నిరంతర అన్వేషణల వల్ల కమ్యూనిస్టు చరిత్ర యొక్క ఉత్థాన, పతనాలను ఉద్యమం లోపలివానిగా వివరించాడు. అక్టోబర్ విప్లవ ప్రభావంతో చివరి వరకు సోవియెట్ యూనియన్ అంతర్గత పరిణామాలు ఏమైనా దానికి విధేయుడుగా ఉన్నాడు. ఆత్మ గర్వం తనను పార్టీ వ్యక్తిగా చరిత్రకారుడిగా నిలబడేందుకు దోహదం చేసిందని చెప్పాడు. అయితే తన ఇగోఇజం ను అటు సమర్థించనూ, లేదా కాదనను అని రాశాడు. సోవియెట్ కమ్యూనిజం విచ్ఛిన్నం అవడం, సోషల్ డెమోక్రసీ బలహీనం కావడం వల్ల మతపరమైన, జాతి మూలవాసి వాదం తిరిగి జనించింది. వీటికి అమెరికా మద్దతు దొరికింది. చాలా దేశాల్లో, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాల్లో సంప్రదాయ అర్థంలో శ్రామిక వర్గం మాయమైందనీ, చరిత్ర దిశ అస్పష్ట రూపు దాల్చింది అని రచయిత రాశాడు.

టోనీ జూడ్ట్ తన వ్యాసంలో హాబ్స్ బామ్ గురించి రాస్తూ అతని శైలిలో స్పష్టత ఉందని, ఇతర చరిత్రకారులైన ఈ.పి. థామ్సన్, రేమండ్ విలియమ్స్, క్రిస్టోఫర్ హిల్స్‌లాగా ఇంగ్లీష్ వచనంపై మాస్టర్ గా ఉన్నాడని, అక్షరాస్యుల కోసం అర్థమయ్యే చరిత్ర రాశాడని చెప్పాడు. అతని స్మృతులు సుదీర్ఘమైన 20వ శతాబ్దిని ప్రతిఫలిస్తాయి. ఈయన రష్యాలోని అంతర్గత, బాహ్య నిరసనల పట్ల చూపిన నిశ్శబ్దాన్ని టోనీ విమర్శించారు. అతడు అత్యంత సహజ ప్రతిభాశాలైన చరిత్రకారుడైనా కూడా మన యుగం చూసిన టెర్రర్, అవమానాలను పట్టించుకోలేదని టోనీ అభిప్రాయపడ్డాడు.

హాబ్స్ బామ్ తన ఆత్మకథలో భావ ప్రపంచం గురించి అంతగా పట్టించుకోలేదని పెర్రి అండర్సన్ అనే మార్క్సిస్టు అభిప్రాయపడ్డారు. మరో విమర్శకుడు మిలిబ్రాండ్ చరిత్రను దంత మందిరాల నుంచి ప్రజా జీవితంలోకి హాబ్స్ బామ్ తీసుకుని వచ్చాడు అని రాశారు. ఈయన తన తన మొహంలోకి తేరిపార చూస్తున్న చెడును, క్రూరత్వాన్ని చూడలేకపోయాడని పాల్ జాన్సన్ అనే చరిత్రకారుడు భావించాడు. ఐరోపా కేంద్ర దృక్పథంతో ప్రభావితం ఆయన హాబ్స్ బామ్ యొక్క చారిత్రక అవగాహన రెండవ ప్రపంచ యుద్ధం, ప్రచ్ఛన్న యుద్ధాల పిదప నిరాశగా మారింది. అయితే అతడి అస్పష్టత, సందేహాలు గ్లోబలైజేషన్, వినియోగ వాదాల కాలంలో భారత్, చైనా, క్యూబా ప్రజలకు లేకపోవటంతో ఆ దేశాలు ఇంకా తమ ఆశావాదాన్ని నిలుపుకున్నాయి. ఏది ఏమైనా చరిత్ర రచనలో హాబ్స్ బామ్ స్థానం మాత్రం పదిలంగా ఉంటుంది. ❑

---

# కార్పొరేట్ సంపదలో సామాన్యులకు భాగస్వామ్యం

**(21వ పేజీ తరువాయి)**

సంపన్నులు డబ్బు ద్వారా ప్రజాస్వామ్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వాలను శాసిస్తున్నారని, అందువల్ల వారిపై అధిక పన్నులు విధించి ప్రజారోగ్యం, విద్య కోసం ఖర్చు చేయాలని వారు కోరారు. ప్రపంచంలో బిలియనీర్ల సంఖ్య 3000 మార్కు దాటి పోయిందని, ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్నారని వారు పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదమని వారు పేర్కొన్నారు. సామాన్యుల హక్కులు, రాజకీయ స్వేచ్ఛ కాపాడాలంటే ధనికులపై అధిక పన్నులు విధించాలని వారు చెప్పారు. ఈ నేపథ్యం భారతదేశానికి ఏ మాత్రం మినహాయింపు కాదు. అందువల్ల కార్పొరేట్ రంగంపై మరిన్ని పన్నులు విధించి వారి సంపద పెరుగుదలను కట్టడి చేయాలి. పన్నుల వ్యవస్థను ఆధునీకరించాలి. సామాన్యులపై పన్నుల భారం మినహాయించాలి. అసమాన భారతంలో సమాన అవకాశాలు కల్పించేందుకు ఉన్న అవరోధాలను తొలగించాలి. కార్పొరేట్ సంపదలో సామాన్యులకు భాగస్వామ్యం కల్పించాలి. అందుకు పాలకుల కళ్ళు తెరిపించేందుకు సమరశీల ప్రజా ఉద్యమం నిర్మించాలి. ❑

# పణిక్కర్‌తో నా ప్రయాణం



- వకుళాభరణం రామకృష్ణ

చరిత్రకారుడు కె.ఎన్.పణిక్కర్ సోమవారం కన్నుమూశారు. ఆయనతో నా అనుబంధం సుదీర్ఘమైనది. నేను గ్రాడ్యుయేషన్ వరకూ మా కావలిలో చదివి, పోస్ట్ గ్రాడ్యుయేషన్ వాల్తేరు, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ముగించుకుని, నా మాతృసంస్థ కావలి జవహర్ భారతిలో అధ్యాపక ఉద్యోగం చేశాను. చరిత్రపై అభిలాష పెరిగి, పరిశోధన చేయాలన్న తలంపుతో, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (న్యూఢిల్లీ)లో 1972 జూలైలో ఎం.ఫిల్‌లో చేరాను. జేఎన్‌యూతో ఇది నా పరిచయ ప్రారంభం. చరిత్ర శాఖాధిపతి, ప్రొఫెసర్ రోమిలా థాపర్‌ని కలిస్తే, ఆమె ప్రొఫెసర్ బిపన్‌చంద్రను కలవమన్నారు. ప్రొఫెసర్ బిపన్‌చంద్ర నన్ను ప్రొఫెసర్ సర్వేపల్లి గోపాల్ దగ్గరకు తీసుకెళ్లి పరిచయం చేస్తే, ఆయన నేతృత్వంలో నా పరిశోధన ప్రారంభమైంది. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన బోధన, పరిశోధనలకు పేరుపొందింది. చరిత్ర శాఖను దేశ విదేశాల్లో, వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పేరెన్నికగన్న చరిత్రకారులను అధ్యాపకులను ఆచార్య బిపన్‌చంద్ర, ఆచార్య సతీశ్‌చంద్ర (ఆయన ఆ తర్వాత యూజీసీ చైర్మన్‌గా నియమితులయ్యారు), తమిళనాడు నుంచి ఆచార్య చంపక లక్ష్మి, ఢిల్లీ విశ్వ విద్యాలయం నుంచి ఆచార్య కె.ఎన్.పణిక్కర్ ప్రభృతులను చరిత్ర శాఖలో నియమించారు. వీరందరూ చరిత్రశాఖకు, జేఎన్‌యూకు ఎనలేని పేరు ప్రఖ్యాతులు సమకూర్చారు. నేను పరిశోధన కోసం జేఎన్‌యూలో చేరాను. అయితే నాకు ఫెలోషిప్ లేదు. తమ మాతృభాష కాని, మరొక భాషలో డిప్లొమా చేయాలన్న నిబంధనతో తమిళంలో చేరగా, నా సహ విద్యార్థి తెలుగు ఎంపిక చేసుకుంటే అది బోధించడానికి ఎవరూ లేక, నన్ను అడిగారు. అంగీకరించగా నన్ను చెప్పమన్నారు. దానికి నెలకు రూ.200 ఇచ్చారు. నాకు ఫెలోషిప్‌లేని లోటు ఆ విధంగా తీరింది.

'ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణలు' ఇదీ నా పరిశోధనాంశం. నాకు ప్రొఫెసర్ సర్వేపల్లి గోపాల్ సూపర్‌వైజర్ (వారికి తెలుగు రావడం వల్ల). ఎం.ఫిల్ పూర్తి చేసిన తర్వాత ఆచార్య బిపన్‌చంద్ర తదితరులు 'ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణ'పై పీహెచ్‌డీ చేయమని నన్ను ప్రోత్సహించారు. ఇంటి నుంచి పరిశోధన సాగించాలని నా శ్రీమతి లలిత, ఇతర మిత్రులు, శ్రేయోభిలాషులు



ప్రోత్సహించారు. పీహెచ్‌డీ పరిశోధన సామాజిక అంశం కావడం, ఆ క్రమంలోనే ప్రొఫెసర్ పణిక్కర్ తన పరిశోధనలు చేయడం... దీంతో ఆయనతో పరిచయం గట్టిపడింది. మా మధ్య చర్చలు తమిళ సమాజంపై పరిశోధనలు చేసిన ఆచార్య పణిక్కర్, నా పరిశోధనపై ఆసక్తి చూపి, రెండు ప్రాంతాలపై పరిశోధనల్లోని సామ్యాలు, విభిన్నతలు చర్చించడంతో వారితో సాన్నిహిత్యం పెరిగింది. నేను పీహెచ్‌డీ పరిశోధనా గ్రంథం/థీసిస్ రాస్తున్నప్పుడు వారితో సుదీర్ఘ చర్చలు జరిగేవి. ఇలా నా పరిశోధనాపత్రం రాయడంలో పణిక్కర్ సలహాలు, సూచనలు చోటుచేసుకున్నాయి. ఇలా థీసిస్ రాయడంలో అనేక సందర్భాల్లో నాకు సలహాలు ఇచ్చి, తోడ్పడ్డారు.

ఆ తర్వాత పీహెచ్‌డీ ముగించుకుని కావలి కళాశాలలో చేరాను. నా ఆహ్వానంపై ఆయన కావలికి వచ్చి, రెండు రోజులుండి, 'భారతదేశంలో ఆధునికత'పై ఓ రెండు ఉపన్యాసాలు ఇచ్చారు. అప్పటి నుంచి జేఎన్‌యూ చరిత్రశాఖ నుంచి ఒకరు ఇద్దరు మినహా దాదాపు అందరూ కావలి జవహర్ భారతి కళాశాలకు రావడం, చరిత్రపై సాధికార ఉపన్యాసాలివ్వడం జరిగింది. అదే క్రమంలో కాంగ్రెస్ వార్షిక సభలకు వచ్చినప్పుడు చర్చల్లో పాల్గొని 'ఆంధ్రప్రదేశ్ చరిత్ర'పై ఉపన్యాసాలిచ్చారు. మా ఇద్దరి స్నేహం, రిటైరైన తర్వాత కూడా దూరం నుంచి కొనసాగింది. తెలుగు వారి వంటకాల్లో ఆయనకు ఆవకాయ (ఊరగాయ) అమితమైన ఇష్టం. పణిక్కర్ సహృదయుడు, స్నేహశీలి, చరిత్ర సాధకుడు. వారి స్మృతికి నా నివాళి. ❑

# కె.ఎన్. పణిక్కర్: ఒక మేధో మార్గదర్శి



- ప్రొ॥ అర్చనా ప్రసాద్

అత్యంత సంక్షుభిత కాలంలో సంప్రదాయ మేధావుల వారసత్వం మనకు పోరాటాన్ని కొనసాగించేందుకు తగిన స్ఫూర్తిని, ధైర్యాన్ని ఇస్తుంది. ఆధునిక సాంస్కృతిక,సామాజిక చరిత్రకారులలో అగ్రగణ్యుడైన పణిక్కర్ 89 సంవత్సరాల వయసులో తిరువనంతపురంలో కన్నుమూశారు. ఆయన సుదీర్ఘమైన గొప్ప జీవితం.. సవాళ్లు విసిరే కాలంలో ఒక అధ్యాపకుడు, ప్రజాపక్ష మేధావి ఏ విధమైన పాత్ర పోషించగలడో చూపించేందుకు ఒక ఉదాహరణగా నిలుస్తుంది. కె.ఎన్.పణిక్కర్ 1936 ఏప్రిల్ 26న కేరళలోని గురువాయూరులో జన్మించారు. ఆయన పాలక్కాడ్‌లోని విక్టోరియా కాలేజీలో పట్టభద్రులయ్యారు. అనంతరం రాజస్థాన్ విశ్వవిద్యాలయంలో పోస్టు-గ్రాడ్యుయేషన్, పిహెచ్‌డి పూర్తి చేశారు. ఆయన పెరిగిన కాలం వలస పాలనకు వ్యతిరేకంగా రైతుల పోరాటాలు,కమ్యూనిస్టు ఉద్యమం వేగంగా అభివృద్ధి చెందుతున్న కాలం. ఈ ఉద్యమాల భావజాలం, అనుభవాలు ఆయన జీవితాన్ని, రచనలను గణనీయంగా ప్రభావితం చేశాయి. అయితే బహుశా ఏ ఒక్క అంశం కన్నా ముఖ్యంగా బోధన, పరిశోధన,ఉద్యమాల మధ్య ఉన్న గతితార్కిక, పరస్పరపూరక సంబంధాల ప్రాముఖ్యతను ఇవి ఆయనకు తెలిసేలా చేశాయి.

జెఎన్‌యులోని సెంటర్ ఫర్ హిస్టారికల్ స్టడీస్ (సి.హెచ్.ఎస్)లో నేను విద్యార్థిగా ఉన్నప్పుడు అది నాకు ప్రత్యక్షంగా అనుభవంలోకి వచ్చింది. పణిక్కర్ 1973లో అక్కడ అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేరారు. 1980ల చివరి దశలో, మేము మోడరన్ హిస్టరీ పోస్ట్-గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో చేరేనాటికి పరిస్థితులు చాలా అల్లకల్లోలంగా, గందరగోళంగా ఉన్నాయి. సోవియట్ సోషలిస్టు రష్యాలో నెలకొన్న సంక్షోభం, అంతిమంగా ఆ వ్యవస్థ...పతనం, అలాగే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్-భారతీయ జనతా పార్టీ (ఆర్.ఎస్.ఎస్-బి.జె.పి) దూకుడుగా పుంజుకోవడం వంటి పరిణామాలు సంభవించాయి. ముఖ్యంగా ఎల్.కె.అద్వానీ రథయాత్ర, అయోధ్యలో రామ మందిర నిర్మాణ ఉద్యమం అందుకు ఊపునిచ్చాయి.

ఈ పరిస్థితులు పురోగామి, వామపక్ష విద్యార్థి కార్యకర్తలలో అనిశ్చితినీ, నిరాశనూ కలిగించాయి. అటువంటి నేపథ్యంలో పణిక్కర్ బోధించిన "ఆధునిక భారతదేశ మేధో చరిత్ర" (ఇంటలెక్చువల్ హిస్టరీ ఆఫ్ మోడరన్ ఇండియా) తరగతులు



రెండు విధాలా మా కళ్లు తెరిపించాయి. మొదటిగా, మార్క్సిజం యూరప్‌లో, పశ్చిమ దేశాలలో పుట్టినప్పటికీ, దాని అభివృద్ధి, విప్లవాత్మక ఆధిక్యత వలస వ్యతిరేక ఉద్యమాల మేధో వారసత్వం నుంచే వచ్చిందనేది ఆయన చెప్పిన మొదటి విషయం. కొత్తగా ఎదిగి వస్తున్న చరిత్రకారులకు అమిల్కార్ కాబ్రాల్ రచించిన 'యూనిటీ అండ్ స్ట్రగుల్' వంటి ఆఫ్రికా, దక్షిణ అమెరికా రచనలు పరిచయం చేయడం అదే మొదటిసారి. ఈ విధంగా ఆయన భారతదేశ మేధో చరిత్రను ఇప్పుడు "గ్లోబల్ సౌత్" అని పిలిచే ప్రాంతాల సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలతో అనుసంధానించారు. రెండవది, ఈ తరగతులు కేవలం అకడమిక్ బోధనగానే కాకుండా, మార్క్సిజం అనేది కేవలం వాస్తవాలకు దూరంగా వుండే బోధన, పరిశోధన ద్వారా మాత్రమే కాకుండా ఆచరణాత్మక అన్వయం ద్వారా.. అభివృద్ధి చెందే తీరు మాకు తెలియచెప్పాయి. మూడవది, ఆయన ఎంపిక చేసిన అధ్యయనాంశాల ద్వారా "జ్ఞాన రాజకీయాల" (పాలిటిక్స్ ఆఫ్ నాలెడ్జ్) ప్రాముఖ్యతను చాలా సులభతరంగా విద్యార్థులకు తెలియచెప్పారు.

విశ్వ విద్యాలయాలు, చరిత్ర రచన రెండూ కూడా ఒక పోరాట క్షేత్రంగా భావించడం ముఖ్యమని ఆయన నొక్కి వక్కాణించారు. ఈ పోరాటం ఏ సైద్ధాంతిక భూమిక నుండి మనం ఎంపిక చేసుకుంటామో దానిని బట్టే మనం పీడిత ప్రజలతో ఉన్నామా లేక పీడకుల పక్షాన ఉన్నామా అన్నదాన్ని నిర్ణయిస్తుంది. వాస్తవానికి ఈ పాఠాలు కొత్త విద్యార్థులకు పూర్తిగా అర్థం కావడం కష్టమై వుండొచ్చు. కానీ మాతోపాటు పణిక్కర్ దగ్గర చదివిన అనేక మంది చేపట్టిన పరిశోధనలు, ఉద్యమాల దిశను ఇవే ప్రభావితం చేశాయి. బోధన, పరిశోధన

రాజకీయాలపై పణిక్కర్ దృష్టి కోణం ఆయనను ఒక ప్రజాపక్ష మేధావిగా కూడా తీర్చిదిద్దింది. 1980లలో రామ మందిర నిర్మాణ ఉద్యమ సందర్భంలో ఆర్.ఎస్.ఎస్, బి.జె.పిలు అయోధ్య చరిత్రను వక్రీకరించిన ఒక కరపత్రాన్ని విడుదల చేసి, బాబ్రీ మసీదుకు వ్యతిరేకంగా సామాజిక విద్వేషాలను రెచ్చగొట్టడానికి ప్రయత్నించాయి. సిహెచ్ఎస్ విద్యార్థులు "సాంప్రదాయికత విరోధి ఆందోళన్"లో పాల్గొని మతతత్వ శక్తులను ప్రతిఘటించారు. తమ విభాగం కూడా ఒక స్పష్టమైన వైఖరి తీసుకోవాలని డిమాండు చేశారు. ఈ సమయంలో పణిక్కర్, రొమిలా థాపర్, షిరీన్ రత్నాగర్, నీలాద్రి భట్టాచార్య వంటి ఉపాధ్యాయులు విద్యార్థుల ఈ చురుకైన భాగస్వామ్యానికి మద్దతుగా నిలిచారు. చివరలో సిహెచ్ఎస్ ఒక కరపత్రం విడుదల చేసింది. ఆర్.ఎస్.ఎస్, బి.జె.పి భావజాల అనుకూల మేధావులు జాతీయ పత్రికలలో దీనికి వ్యతిరేకంగా తీవ్రంగా ప్రతిస్పందించారు. వారు విమర్శించిన తీరునుబట్టే మితవాద శక్తులు ఎంత కలవరపడ్డాయో స్పష్టమైంది. దాని పర్యవసానంగా అనేకమంది మేధావులు ఇలాంటి కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేందుకు స్ఫూర్తి, ప్రేరణలు పొందారు. విద్యాసంస్థల నిర్మాణం, రాజకీయ ఉద్యమాలపై ప్రభావం చూపడంలో ప్రగతిశీల రాజకీయాలు, లౌకికత, ప్రజాస్వామ్య విలువల పట్ల ఉన్న నిబద్ధత ప్రధాన పాత్ర పోషించేలా చూడడంలో పణిక్కర్ కీలక పాత్ర పోషించారు.

సఫ్దర్ హష్మీ హత్య అనంతరం,1990ల ప్రారంభంలో పణిక్కర్ సఫ్దర్ హష్మీ మెమోరియల్ ట్రస్ట్ (సహమత్)తో చురుకుగా కలిసి పనిచేశారు. తరువాత ఆయన 'అన్హద్' అనే సంస్థ వ్యవస్థాపక ట్రస్టీలలో ఒకరిగా ఉన్నారు. పరిశోధన,ఉద్యమాల మధ్య ఉన్న గతితార్కిక సంబంధాన్ని అర్థం చేసుకున్న ఆయన,నాడు పెరుగుతున్న ఫాసిస్టు ధోరణులు,మితవాద రాజకీయాలపై తన విమర్శలకు మరింత పదునుపెట్టారు. ప్రత్యేకంగా ఆయన రాసిన 'బిఫోర్ ది నైట్ ఫాల్స్: ఫోర్‌బోడింగ్స్ ఆఫ్ ఫాసిజమ్ ఇన్ ఇండియా', 'యాన్ ఎజెండా ఫర్ కల్చరల్ యాక్షన్' పుస్తకాలు వామపక్ష లౌకిక ఉద్యమాల బలహీనతలను నిజాయితీగా విశ్లేషిస్తూ, ఆర్.ఎస్.ఎస్, బి.జె.పి లను ఎదుర్కొనే సానుకూల కార్యాచరణ పథకాన్ని సూచిస్తాయి. బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత,అలాగే కేంద్రంలో బి.జె.పి ఆధ్వర్యంలో ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత ఆయన అనేక రచనలు చేశారు. అధ్యాపకులు, పండితులు, మేధావులు దేశంలోని బహుళత్వ సంస్కృతిని కాపాడేందుకు జరిగే ఉద్యమాలలో ధైర్యంగా పాల్గొనాలి. గొంతు విప్పాలి– అని ఆ రచనలు ప్రబోధిస్తాయి.

పణిక్కర్ ఒక ప్రసిద్ధ చరిత్రకారుడిగా, విద్యావేత్తగా చేసిన శాస్త్రీయ కృషి చాలా విస్తృతమైనది. ఈ చిన్న వ్యాసంలో వాటిని వివరించడం సాధ్యం కాదు. అయితే సాహసవంతమైన, నిర్భీతితో కూడిన పణిక్కర్ వంటి మేధావులు, వారి సమకాలీనులు రుజువు చేసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే...సామ్రాజ్యవాద వ్యతిరేక పరిశోధన, మేధో కార్యాచరణ రెండూ పరస్పరం అభివృద్ధి చెందుతాయి అని. ఇవాళ మనం ఉన్న సంక్షుభిత కాలంలో పణిక్కర్ వంటి సంప్రదాయ మేధావుల వారసత్వం మనకు భవిష్యత్తుపై ఆశను,పోరాటాన్ని కొనసాగించేందుకు తగిన స్ఫూర్తిని ఇస్తుంది. పణిక్కర్‌జీ...! మీ మేధో మార్గదర్శకత్వం, మీ సాహసోపేత వైఖరికి భౌతికంగా ఇవాళ మేం దూరమయ్యాం. కానీ మీ ఆశయాలను, వారసత్వాన్ని ముందుకు తీసుకుపోతాం. ❑

**('వైర్' సౌజన్యంతో)**

## కారల్ మార్క్స్ : ఒక చారిత్రక ప్రవాహం

**(31వ పేజీ తరువాయి)**

ఫలితంగానే నేడు ఒకవైపు పశ్చిమాసియా మంటల్లో కాగుతుండగా, మరోవైపు యూరప్ తీవ్ర ఉద్రిక్తలకు కేంద్రంగా మారింది. ప్రపంచ రాజకీయాల ఈ దిశను మార్క్స్ తన కాలంలోనే గుర్తించాడు. అందుకే నేటి ప్రపంచ పరిణామాలను అర్థం చేసుకోవాలంటే మార్క్స్‌ను మనం తిరిగి చదవాల్సిన అనివార్యత స్పష్టంగా కనిపిస్తోంది. ఒక వ్యక్తి ఆలోచనలు ఇలా శతాబ్దాల పాటు ప్రపంచాన్ని ప్రభావితం చేయడం సాధారణ విషయం కాదు. అది సాధ్యమవ్వాలంటే ఆ ఆలోచనలు కాలాన్ని మించిన శక్తిని కలిగి ఉండాలి. మానవ చరిత్రను ముందుకు నడిపించే శక్తులతో అనుసంధానమై ఉండాలి. మార్క్స్ ఆలోచనలు అలాంటివే. అందుకే, ఒక సమాజం న్యాయసమ్మతంగా, సమానత్వంతో కూడినదిగా మారాలని పోరాడే ప్రతి ఉద్యమంలో మార్క్స్ ప్రతిధ్వని వినిపిస్తుంది. ప్రపంచం మళ్లీ యుద్ధాల అంచులపై నిలిచిన ఈ సమయంలో ఆ ప్రతిధ్వని మరింత స్పష్టంగా గర్జిస్తోంది. శాంతి, ప్రజాస్వామ్యం, మానవహక్కుల పేరుతో సాగుతున్న రాజకీయాల వెనుక, వాటి ఫలితంగా తలెత్తుతున్న యుద్ధాల వెనుక దాగి ఉన్న అసలు శక్తులను అర్థం చేసుకోవాలంటే సమాజాన్ని వాస్తవాల ఆధారంగా విశ్లేషించే శాస్త్రీయ దృక్పథం అవసరం. ఆ దృక్పథాన్ని మనకు అందించిన మహోపాధ్యాయుడు కార్ల్‌మార్క్స్.

మార్క్స్ ఒక వ్యక్తి కాదు, సమాజాన్ని కదిలించే శక్తి,
మార్క్స్ ఒక కాలం కాదు, ఒక చారిత్రక ప్రవాహం.. ❑

**(నవతెలంగాణ సౌజన్యంతో)**

# రాష్ట్రంలో భావజాల విధ్వంసం!?



- సంగిరెడ్డి హనుమంతరెడ్డి

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నేడు మూడు ప్రక్రియలు చోటుచేసుకున్నాయి. అనవసర అంశాలను తెరపైకి తెచ్చి అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చడం. తిరుమల "కల్తీ" లడ్డు తిని ఎందరు చనిపోయారో తెలియదు. పాలకుల దృష్టిలో అది సర్వజన సంహారిణి. ఆహార ముడి పదార్థాల, హోటళ్లలో ఆహార కల్తీలను, భూ-జల, వాయు, శబ్ద పర్యావరణ కాలుష్యాలను పట్టించుకోరు. గుడి గోడలు కూలి, దర్శనాల క్యూలో తోపుళ్ళకు ప్రాణాలు పోగొట్టుకున్న భక్తులు కనపడరు. రోడ్ల ప్రమాదాల్లో రోజూ చనిపోతున్న అమాయకులు పట్టరు. 2. ప్రజల్లో వైదికవాద ప్రచారం.

తొలినాళ్ళలో చేగువేరా చొక్కాలు తొడుక్కొని యువతను దారి తప్పించిన పవన్ అర్థం లేని సనాతన ధర్మం సంకరమౌతోందని ఊగారు. సనాతన ధర్మ రక్షణ జాతీయ సంస్థను స్థాపించాలని చిందులేశారు. బాబు లౌకిక మూల పార్టీ అలౌకికమైంది. స్థాపక సూత్రాలను తుంగలో తొక్కారు. మతతత్వంతో అంటకాగు తున్నారు. చంద్రన్న పాలనలో నదులకు దీపారాధన ప్రారంభించారు. కుంభమేళాతో సమానంగా గోదావరి పుష్కరాలను జరుపుతారట! గోదావరి గత పుష్కరాల్లో 19 మందిని చంపారు. కుంభమేళాలో 2025 జనవరి 29న ప్రయాగరాజ్ వద్ద ప్రభుత్వ లెక్కల ప్రకారం 37 మంది చనిపోయారు. 200 మంది గాయపడ్డారు. భూ-జల వాయు కాలుష్యాలు ఘోరంగా పెరిగాయి. జనజీవితాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఆ ఘనతలు ఆంధ్రప్రదేశ్‌లో జరిగేటట్లు జాగ్రత్త వహిస్తారన్న మాట ! 3.స్వార్థంతో రాష్ట్ర కాషాయీకరణ. గెలుపుపై అపనమ్మకంతో, 2002లో, 2018లో విమర్శించిన నరహంతక పాలకులతో కూటమి కట్టారు. సంఘ్ తాత్వికుల విగ్రహాలు పెడుతున్నారు. కేంద్ర పాలకుల అనుకూల సంఘ్ సూత్రాలతో రాష్ట్ర పాలన సాగిస్తున్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం జాతీయ సంపద నిర్వహణ చట్టం చేసింది. దీని ప్రకారం లాభాల ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్లకు పంచారు.

జాతి సంపదలను ఆశ్రితపక్ష కార్పొరేట్లకు బదలాయించారు. ముఖ్యమంత్రి ఈ సంఘ్ సూత్రాన్ని అనుకరిస్తున్నారు. గత ప్రభుత్వాలు స్థాపించిన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్లకు అప్పగించటం అందులో భాగమే. రైతుల 70 వేల ఎకరాల రాజధానిలో వందల ఎకరాలు కార్పొరేట్లకు కట్టబెట్టారు. వాళ్ళు మిగిలిన భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటారు. ఈ స్వామి కార్యంలో స్వార్థ స్వకార్యం, నీకిది, నాకది సూత్రం అంతర్భాగాలు. ఒకవైపు ప్రజల ఆస్తులు, సంస్థలు, సంపదలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. మరొకవైపు 4పిల శీర్షికలో ప్రజలను కలిపి వారిని మోసగిస్తున్నారు.

రాష్ట్ర రాజధాని అమరావతిలో జాతిపిత మోహనచంద్ గాంధీ, రాజ్యాంగ ప్రధాన నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్, మౌలిక భౌతిక వసతుల దేశ నిర్మాత ప్రథమ ప్రధాని జవహర్లాల్ నెహ్రూల విగ్రహాలను స్థాపించలేదు. సంఘ్ తొలి ప్రధాని, 24 పార్టీల సంకీర్ణంలోనే ప్రైవేటీకరణను, దేశ సంపదల, సంస్థల అమ్మకాలను చట్టబద్ధం చేసిన, దేశాన్ని అశాస్త్రీకరించిన, "ఇతర" మతంపై విషయం చిమ్మిన అటల్ బిహారి వాజపేయి విగ్రహాన్ని నిర్మించారు. రాష్ట్ర ప్రధాన నగరాల్లో, ప్రతి జిల్లా రాజధానిలో ఆయన బొమ్మలను పెడతారట. రాష్ట్రమంతా సంఘ్ రంగు పులుముతారట. సంఘ్ పూర్వీకుల్లో స్వాతంత్ర్య సమరయోధులు లేరు. ఆ లోటును పూరించడానికి, కాంగ్రెస్‌వాది వల్లభ్ పటేల్‌ను మోదీ సొంతం చేసుకున్నారు. గ్రహణ చంద్రన్న ఆంధ్ర అన్న ఎన్టీఆర్ పై ఆధారపడ్డారు. ఆ అన్న 116 అడుగుల విగ్రహాన్ని అమరావతిలో 200ఎకరాల స్మారక పథకంలో, భూమి ఖరీదు కాకుండానే, రూ. 1,750 కోట్ల విగ్రహ ఖర్చుతో నిర్మిస్తారట. 2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య సౌకర్యాల కల్పన, నిర్వహణలకు కేటాయించిన మొత్తం రూ. 1,900ల కోట్లు రూ. 1,750 కోట్లతో 9 పెద్ద వైద్యశాలలను, ఏటా1,350 మంది వైద్యులను తయారుచేసే 9 వైద్య కళాశాలలను స్థాపించవచ్చు.

గిరిజన ప్రాంతాల్లో వందల పాఠశాలలను, వసతి గృహాలను, వైద్యశాలలను నిర్మించి నిర్వహించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 873 కోట్లతో 49 పారిశ్రామిక వాడలను ప్రతిపాదించింది. 1,750 కోట్లతో 100 పారిశ్రామిక వాడలను స్థాపించవచ్చు. గుంటూరు శంకర్ విలాస్ రైల్ ఓవర్ బ్రిడ్జ్ లాంటి 18 బ్రిడ్జిలను కట్టవచ్చు. ఈ నిర్మాణాలకు రామన్న, చంద్రన్న, లోకన్న, దేవన్న, పవనన్న పేర్లను పెట్టుకోవచ్చు. రాష్ట్ర జాబితాలోని 61 అంశాల్లో జనహిత చట్టాల నిర్మాణం, అమలు, రాజ్యాంగబద్ధ లౌకిక పాలన నేటి రాష్ట్ర అవసరం. ప్రజలను మతాధారంగా విడగొట్టే కేంద్ర అలౌకిక అరాచక పాలనకు, చట్టాలకు అంధ సమర్థన, అనుసరణ, అనుకరణ అవాంఛనీయాలు. ❑

# శ్రీ కలిదిండి భీమరాజు జయంతి సభ
# 2026 మార్చి 21-తణుకులో చర్చా గోష్టి

**ఉ.10 గం చర్చా గోష్టి ప్రారంభం : సమాచార పత్రం - అంశం : మోదీ పాలన - ప్రజా ఉద్యమాలు**

**మొదటి చర్చనీయ అంశం :**

**1. మోదీ పాలన పర్యవసానాలు :** మోదీ రాజకీయం రాజ్యాంగ విరుద్ధం. కార్పొరేట్ల దోపిడీ, సంపద కేంద్రీకరణ రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగ పీఠిక ప్రకటించిన "సామాజిక, ఆర్థికన్యాయం" కోసం ప్రజా ఉద్యమం రాజ్యాంగ బద్ధమైన ఉద్యమం.

**మోదీ పాలన కొన్ని ముఖ్యాంశాలు**

**ఎ)** మెజారిటీ ప్రజల ఓట్ల కోసం మతపరమైన విభజన, విద్వేష రాజకీయం కీలకమైంది. హిందూత్వ నినాదం ముసుగుతో హిందువుల ఓట్లను ఆకర్షించడం. హిందూమతం ఒక విశ్వాసం. అందులో పరమత సహనం వుంది. విద్వేషం లేదు. హిందూ మతానికి తనదైన రాజకీయమూ లేదు. హిందూ మతాన్ని అనుసరించే హక్కు రాజ్యాంగ బద్ధమైంది. హిందూత్వ మతం కాదు. మత రాజకీయం. పరమత విద్వేషం మీద ఆధారపడిన రాజకీయం. రాజకీయానికి మతాన్ని వాడుకోవడం రాజ్యాంగ పరమైన ఎన్నికల చట్టానికి విరుద్ధం. సంఘ్ పరివారం లక్ష్యంగా పెట్టుకున్న "హిందూ రాష్ట్ర" నినాదం – దేశ లౌకిక రాజ్యాంగానికి విరుద్ధం. రాజ్యాంగం స్థానాన్ని మనుధర్మ శాస్త్రం ఆక్రమిస్తుంది. సామాజిక న్యాయానికి అంత్యక్రియలు చేస్తుంది.

**బి)** మోదీ పాలనలో బిలియనీర్లు, కార్పొరేట్లు వికసిస్తున్నారు. పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య రంగాల మీద ఆధిపత్యం సాధించారు. ప్రభుత్వ సహకారంతో సహజ వనరులను స్వంతం చేసుకున్నారు. విమానాశ్రయాల మీద, ఓడ రేవుల మీద పెత్తనం చేస్తున్నారు. వ్యవసాయం రంగంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల, వ్యవసాయ పరికరాల కంపెనీలను స్వంతం చేసుకున్నారు. బీమా పేరుతో లాభాల పంట పండించుకుంటున్నారు. కార్పొరేట్లు వ్యవసాయం పేరుతో పరోక్షంగా రైతుల భూములపై పెత్తనం చేసే స్థితిలో వున్నారు. సామాజిక రంగంలో కార్పొరేట్ విద్యాసంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రుల వ్యాపారీకరణ జోరుగా సాగుతున్నది. రిటైల్ వ్యాపారంతో సాధారణ చిరు వ్యాపారాలు మూత పెడుతున్నారు. మోదీ ప్రభుత్వ అండతో కార్పొరేట్ల దోపిడీకి దేశం అడ్డాగా మారింది.



**సి)** మోదీ పాలనలో స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల సంఘాన్ని ఇతర రాజ్యాంగ సంస్థలను ప్రభుత్వ శాఖలుగా అధీనంలోకి తెచ్చుకుంటున్నారు. సీబీఐ, ఈడీలను ప్రత్యర్థులను బెదిరించడానికి లొంగదీసుకోడానికి వినియోగిస్తున్నారు. ప్రశ్నించే వారిని విచారణ లేకుండా ఏళ్ల తరబడి జైళ్ల పాలు చేసే నల్ల చట్టాలను ప్రయోగిస్తున్నారు. ప్రజల హక్కులు కాపాడే రాజ్యాంగాన్ని తమ పరిచారికగా ప్రజల హక్కులను హరించడానికి వాడుకుంటున్నారు.

**డి)** మోదీ పాలనలో శ్రమజీవుల దుస్థితి కార్పొరేట్ల మెప్పుకోసం కార్మిక వర్గం మీద నాలుగు లేబర్ కోడ్లను తెచ్చారు. రైతులకు, కౌలుదారులకు లాభసాటి ధరలు లేవు. రుణ మాఫీలు లేవు. ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. నిరుద్యోగ శాతం గరిష్ట స్థాయికి చేరింది. ఉపాధి కల్పన ఊడిపోతున్న ఉపాధి హెచ్చుగా వుంది. పేదల స్థితి దుర్భరంగా మారింది. పరోక్ష పన్నులతో ధరల భారం మోస్తున్నారు. ఉపాధి అవకాశాలకు, ఉపశమన సంక్షేమ పథకాలను కత్తిరిస్తున్నారు. 80 కోట్ల మందికి రేషన్ పంచే స్థితి పేదరికానికి అద్దం పడుతున్నది. ప్రపంచ మానవాభివృద్ధి సూచిక, ఆకలి సూచికలు దీనిని ధృవపరుస్తున్నాయి. ప్రభుత్వ విద్య ; వైద్య సేవలను ఉపేక్షించడం, పోషకాహార లోపం, శిశు మరణాల రేటు పేదల దుస్థితిని తెలియజేస్తున్నాయి.

ఇవి కొన్ని ముఖ్యమైన అంశాలు. వీటి ఆధారంగా ప్రజలను చైతన్యపరిచే ఉద్యమాన్ని రూపొందించుకోవాలి. రాజ్యాంగానికి, సామాజిక న్యాయానికి విరుద్ధమైన మోదీ హిందూత్వ రాజకీయం మీద, కార్పొరేట్లు దేశాన్ని దోచుకుని పోగు చేసుకున్న సంపద కేంద్రీకరణ మీద ఉద్యమించాలి.

## రెండవ చర్చనీయ అంశం : మోదీ పాలనపై రెండు ఉద్యమాలు

మన ప్రజా ఉద్యమం మోదీ హిందూత్వ రాజకీయం మీద- దేశ సంపదను స్వంతం చేసుకుని అంతరాల సమాజంతో అత్యధికులను పేదరికంలో వుంచిన కార్పొరేట్ సంపద కేంద్రీకరణ మీద సాగించాలి. ఈ రెండు శక్తులు ఒక దానితో మరొకటి పెనవేసుకుని ఉన్నాయి. మోదీ పాలన సహకారంతో కార్పొరేట్లు దేశ సంపదను కొల్లగొడుతున్నారు. కార్పొరేట్ల విరాళాలతో, వారి గోదీ మీడియా ప్రచార బాకాలతో మోదీ అధికారాన్ని స్వంతం చేసుకుంటున్నారు. ఇది జమిలి పోరాటమే కాని రెండు రూపాలలో సాగించాలి.

**ఎ) హిందూత్వపై భావజాల ఉద్యమం-సామాజిక న్యాయం :** మోదీ అనుసరిస్తున్న హిందూత్వ మీద ఉద్యమం ప్రధానంగా భావజాల రంగంలో జరపాలి. హిందూ మతాన్ని, హిందూత్వను వేరు చేసి చూపించాలి. హిందూత్వ జాతీయవాదం స్థానంలో భారత ప్రజల జాతీయవాదాన్ని ముందుకు తేవాలి. వివిధ భాషలను, ప్రాంతీయ వైవిధ్యాన్ని కాపాడే భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రచారం చెయ్యాలి. హిందూరాష్ట్ర నినాదం, హిందూత్వ భావజాలం సామాజిక న్యాయానికి విరుద్ధమైనదిగా ప్రచారం జరగాలి. హిందూ రాష్ట్ర నినాదం నిజ స్వరూపాన్ని అది ప్రతిపాదించే మనువాద ఎజెండాను వివరించాలి. దీనిలో భాగంగా జరుగుతున్న చరిత్ర వక్రీకరణలను, పాఠ్య పుస్తకాల్లో మార్పుల పర్యవసానాలను తెలియజెప్పాలి. ఈ భావజాల ఉద్యమం మోదీ హిందూత్వ జనాకర్షణను తగ్గిస్తుంది. మోదీ రాజకీయం బలహీనపడుతుంది. ఎందుకంటే మోదీ జనాకర్షణ హిందూత్వ రాజకీయం నుండి వచ్చిందే కాని ఆయన పాలనా ప్రతిభ నుండి వచ్చింది కాదు. ఆయన పాలన, ఇచ్చిన నినాదాలు వైఫల్యాల పుట్ట మాత్రమే. మోదీ భావజాలం మీద సాగించే ఉద్యమం ప్రధానంగా ప్రచార రూపంలో వుంటుంది.

**బి) సామాజిక, ఆర్థికన్యాయం కోసం ప్రజా ఉద్యమం :** రాజ్యాంగ పీఠిక ప్రకటించిన సామాజిక న్యాయం, ఆర్థికన్యాయం దేశ ప్రజలకు దక్కాలంటే ఆర్థికఅంశం కీలకమైంది. ఆర్థికన్యాయంతోనే పేదరిక నిర్మూలనకు,సామాజిక న్యాయానికి ద్వారాలు తెరుచుకుంటాయి. ఆర్థిక న్యాయం తక్షణ అవసరంగా వున్న వారు దేశ జనాభాలో సగానికి పైబడి వున్నారు. రాజకీయ పరిభాషలో యస్.టి, యస్.సి, బి.సి, మైనారిటీలలో అత్యధికులు పేదలు. వివక్షకు గురౌతున్న వారు. సామాజిక, ఆర్థిక న్యాయం నినాదం అత్యధిక సంఖ్యాకులకు అవసరమైన నినాదం అవుతుంది. ఇది ప్రచార ఉద్యమం మాత్రమేకాదు, ప్రజా ఉద్యమ రూపం తీసుకునే వీలుంది.

## ఆర్థిక న్యాయం సాధించడానికి రాజ్యాంగ బద్ధంగా వున్న అవకాశాలు

**మోదీ పాలనలో సంపద కేంద్రీకరణ :** 2014లో దేశంలో 50 మంది బిలియనీర్లు వుంటే ఈ 12 సంవత్సరాల్లో అదనంగా 200 మంది పుట్టుకొచ్చారు. అసమానతలు హెచ్చుగా వున్న దేశంగా మారింది. ఒక శాతం బిలియనీర్లు, కార్పొరేట్ల దగ్గర 46 శాతం దేశ సంపద పోగుపడింది. 10 శాతం కుబేరుల దగ్గర 75 శాతం సంపద గుట్టపడింది. ఆదాయాలలో ఇదే తరహా అంతరాలు కనిపిస్తున్నాయి. మోదీ ప్రభుత్వం వీరికి దేశ సంపదను దోచుకునే అన్ని వనరులను కట్టబెట్టడంతోపాటు, కార్పొరేట్ పన్ను 35 శాతం నుండి 22 శాతానికి తగ్గించారు. వారికి రుణమాఫీలు, రాయితీల పేరుతో 20 లక్షల కోట్లు అందించారు. ఇంతకు ముందున్న సంపద పన్నును, వారసత్వ పన్నును రద్దు చేశారు.

**సంపద పునః పంపిణీకి మార్గాలు :** రాజ్యాంగబద్ధంగా గతంలో వుండి మోదీ ప్రభుత్వం తొలగించిన సంపద పన్ను, వారసత్వ పన్ను లను తిరిగి విధించాలి. ఈ ప్రభుత్వం గణనీయంగా తగ్గించిన కార్పొరేట్ పన్ను కనీసం 3 శాతం పెంచాలి. విపరీత ఆదాయాల మీద విండ్ ఫాల్ పన్ను విధించాలి. ఈ ప్రారంభ చర్యలతో సామాజిక న్యాయానికి, పేదరిక నిర్మూలనకు నాంది పలకాలి.

## వివిధ పన్నులు విధిస్తే వచ్చే అదనపు ఆదాయం అంచనాలు

**ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త ప్రభాత్ పట్నాయక్ :** టాప్ 1 శాతం కుబేరుల మీద 2 శాతం సంపద పన్ను వేస్తే 8 లక్షల కోట్లు, మూడో వంతు వారసత్వ పన్ను విధిస్తే 6 లక్షల 67 వేల కోట్లు. ఈ రెండు పన్ను ల ద్వారా 14 లక్షల కోట్లు పైగా వస్తాయి. Tax Rich campaign సంస్థ అంచనాల ప్రకారం ఈ రెండు పన్నుల ద్వారా 17 లక్షల కోట్లు (ఈ రెండు అంచనాలు టాప్ 1 శాతం మంది మీద 2 శాతం పన్ను ను లెక్కించాయి) టాప్ 10 శాతం మీద సరాసరి 3 శాతం పన్ను విధిస్తే "చాట్ జిపిటి ప్రకారం 27 లక్షల కోట్లు వస్తాయి. ఇందులో వారసత్వ పన్ను లేదు టాప్ 10 శాతం మీద సంపద పన్నుతో వచ్చే 27 లక్షల కోట్లతో "జాతీయ సంక్షేమ నిధి"ని ఏర్పాటు చేసి వివిధ మార్గాల ద్వారా సకల శ్రమజీవులకు, రైతులకు, యువతకు సంపద పునఃపంపిణీ చెయ్యాలి.

## మూడవ చర్చనీయ అంశం

**హక్కుల ఉద్యమం- ఉచితాల ఉద్యమం కాదు జీవించే హక్కు రాజ్యాంగబద్ధం- సంపదలో వాటా చట్టబద్ధం :** "ఒక సిద్ధాంతం , ఒక ఆలోచన ప్రజల మనసులను ఆకట్టుకుంటే

అది భౌతికశక్తి అవుతుంది" అనే ప్రసిద్ధ మాటను జర్మన్ తత్వవేత్త Karl Marx చెప్పారు. అలాంటి భౌతిక శక్తి గల ప్రజా ఉద్యమం ఎలా రూపొందుతుంది ? ప్రతి వ్యక్తికీ ఆకాంక్షలు, ఆశయాలు, సిద్ధాంతాలు వుంటాయి. వాటిని సాధించాలనే తపన ఆయనను నడిపించే శక్తిగా వుంటుంది. ఈ ఆకాంక్ష వ్యక్తికి మరొక వ్యక్తికి మారిపోతుంది. ప్రజా ఉద్యమానికి సామూహిక ఆకాంక్ష వుండాలి. అది సమూహం అందరి మనసులను ఆకట్టుకోవాలి. అప్పుడే అది ప్రజా ఉద్యమంగా లక్ష్యసాధన దిశగా నడిపించే భౌతికశక్తి రూపంధరిస్తుంది. సామాజిక, ఆర్థిక న్యాయం అవసరం వున్న సకల పట్టణ, గ్రామీణ శ్రమజీవుల సమూహాలు-కుల, మత, లింగ వివక్షకు గురవుతున్న సమూహాలకు ఒక ఉమ్మడి ఆకాంక్షను రూపొందించాలి. ఈ సమూహాలన్నింటినీ ప్రభావితం చెయ్యగల ఒక కొత్త ఉమ్మడి ఆకాంక్షగా వుండాలి. ఈ కొత్త ఆకాంక్ష లేదా నినాదం ఈ సమూహాల ప్రజల జీవితాలను మార్చేదిగా, అందరికీ గౌరవ ప్రదమైన స్వతంత్ర జీవనాన్ని ఇచ్చేదిగా వుండాలి. ఉదాహరణకు సంపద పునఃపంపిణీతో అందరికీ గౌరవప్రదమైన స్వతంత్ర జీవనం. ఇందులో ఒక కొత్త నినాదం, కొత్త ఆకాంక్ష వున్నాయి. ఒక నినాదం తనంతట తానుగా ప్రజల మనసులను ఆకట్టుకుని ఒక భౌతిక శక్తిగా, ఒక ప్రజా ఉద్యమంగా రూపొందదు. కొన్ని నినాదాలు ప్రజలను ఎందుకు ఆకట్టుకో గలిగాయో పరిశీలించుకోవాలి.

### ప్రజలను ఆకట్టుకున్న కొన్ని ప్రయోగాలు

- **1.నినాదం :** గరీబీ హఠావో **2.చర్య :** బ్యాంకుల జాతీయకరణ సొమ్ము **3.ఫలితం :** 20 సూత్రాల పథకాల ద్వారా నేరుగా లబ్ధి.
- **1.నినాదం :** అచ్ఛేదిన్ **2.చర్య :** విదేశాలలో లక్షల కోట్ల నల్లధనం **3.ఫలితం :** ప్రతి కుటుంబానికి 15 లక్షలు.
- **1.నినాదం :** దున్నే వానికి భూమి **2.చర్య :** జమిందారీ వ్యవస్థ రద్దు **3.ఫలితం :** రైతులకు భూమి హక్కు.

### ఇదే తరహాలో సంపద పునఃపంపిణీ ఉద్యమాన్ని రూపొందించుకోవాలి

- **1.నినాదం :** సంపద పంపిణీతో స్వతంత్ర జీవనం

  **2.చర్య :** టాప్ 10 శాతం దగ్గర పోగుపడ్డ సంపద పై వివిధ పన్నుల ద్వారా "జాతీయ సంక్షేమ నిధి ఏర్పాటు

  **3.ఫలితం :** ఎ) 50 శాతం శ్రమజీవులు, పేదలు, సామాన్యుల కుటుంబాలకు 50 వేలు వార్షిక బోనస్ (కంపెనీ లాభంలో వాటాను బోనస్ చట్టం హక్కును చేసింది. దాని విస్తరణ రూపమే హక్కుగా జాతీయ బోనస్ నినాదం)

  **బి)** గౌరవప్రద జీవన హక్కులో భాగంగా హక్కుగా నివాస వసతి లేదా అద్దె, హక్కుగా ఉపాధి లేదా పరిహారం, - హక్కుగా రేషన్‌తోపాటు పోషకాహార దినుసులు, హక్కుగా పెన్షన్‌లు హక్కుగా అందరికీ వైద్య సేవలు, హక్కుగా అన్ని స్థాయిల చదువులు

  **సి)** రైతులకు హక్కుగా లాభసాటి ధరలు.

  **డి)** యువతకు ఉచితంగా ఉపాధి నైపుణ్యాలు, హక్కుగా తగిన ఉపాధి లేదా పరిహారం.

ఈ మూడు అంశాలు జత పడినప్పుడు ఒక నినాదం ప్రజల మనసులను ఆకట్టుకుంటుంది. విజయాలు తెచ్చిపెట్టే ప్రజా ఉద్యమం అవుతుంది. ఇది హక్కుల ఉద్యమం. హక్కుదారుల ఉద్యమం. ఇది ఉచితాల ఉద్యమం కాదు. లబ్ధిదారులుగా చేసే అభ్యర్ధన ఉద్యమం కాదు. రాజ్యాంగం హామీ ఇచ్చిన సామాజిక, ఆర్థిక న్యాయం, ప్రాథమిక హక్కుగా ప్రకటించిన గౌరవప్రదమైన జీవన హక్కు కోసం ఉద్యమం. రాజ్యాంగ విరుద్ధ మైన సంపద కేంద్రీకరణ మీద చేసే చట్ట బద్ధమైన ప్రజా ఉద్యమం.

### ప్రజాసంఘాలు : ఉమ్మడి నినాదం

- సమాజంలో వివిధ ప్రజా సంఘాలు వాటికి ప్రత్యేక సమస్యలు వుంటాయి. అన్ని ప్రజాసంఘాలకు ఒక ఉమ్మడి నినాదం వుండాలి.
- సామాజిక, ఆర్థిక న్యాయం కోసం "కార్పొరేట్ల సంపద దోపిడీని కట్టడి చెయ్యండి. పోగుపడ్డ సంపదను పంపిణీ చెయ్యండి" అన్నది ఉమ్మడి నినాదం కావాలి.
- సకల పట్టణ, గ్రామీణ శ్రమజీవుల సంఘాలకి జాతీయ బోనస్ - జీవన హక్కుల నినాదం అవుతుంది - విద్యార్థి, యువజన, మహిళా సంఘాలకు కార్పొరేట్ విద్య, కార్పొరేట్ వైద్యం దోపిడీని అరికట్టాలి. సంపద పంపిణీతో హక్కుగా మంచి ప్రమాణాల విద్య వైద్య సేవలు అందించాలి.
- వ్యవసాయ రంగంలో కార్పొరేట్ దోపిడీని అరికట్టాలి. సంపద పంపిణీతో చట్టబద్ధంగా పంటలకు లాభసాటి ధర కల్పించాలి.
- సంపద పంపిణీతో అందరికీ సమానంగా ఎదిగే అవకాశాలు, పేదరికం లేని గౌరవప్రదమైన జీవనం కోసం అన్నది వివక్ష తరగతుల సంఘాల నినాదం కావాలి. అన్ని ప్రజా సంఘాలు ఒక ఉమ్మడి నినాదంతో ముందుకు వస్తే అది విజయాలు సాధించే ప్రజా ఉద్యమం అవుతుంది.


**వివరాలకు : డి.వి.వి.యస్.వర్మ**


**85006 78977**




జీవిత కాలం లేటు

కుక్క కాటుకు..









శకునం చెప్పే బల్లి..


కార్టూన్స్ : సతీష్ ఆచార్య

**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**
Vol : 4 - Issue No : 6 Online Edition March 2026




## కొత్త పుస్తకాల స్వీకారం




ప్రతులకు..
ప్రజాశక్తి
బుక్ హౌస్,
కార్ల్ మార్క్స్
రోడ్
విజయవాడ 2

